14-08Pg1fT:14-08Pg1fT.qxd 8/13/2026 11:45 PM Page 1



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి


: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-8-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 195 పేజీలు: 10+4 వెల: 6.50

**ఎర్రకోట పేలుళ్లు అల్‌ఖైదా పనే: ఐరాస నివేదిక** 5లో

**ముప్పుతోనే విమానం మారా: ట్రంప్**



## రాజధానికి రాజమార్గం 'సీడ్ యాక్సెస్'

### అమరావతి నిర్మాణంలో మొదటి మెట్టు

- ఐదు కాన్సెప్టులతో దేశం మెచ్చిన రాజధానిగా అమరావతి
- స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసభవన సముదాయం పరిశీలన



గురువారం అమరావతి స్టీల్ బ్రిడ్జ్, సీడ్ యాక్సెస్‌రోడ్డు ప్రారంభించిన అనంతరం సభలో సిఎం చిరుదరహాసం

**విజయవాడ, ఆగస్టు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయ్యిందని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుఅన్నారు. రాష్ట్రాభివృద్ధిలో, అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని సిఎం స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజ ధాని అమరావతిని విజయవాడ -మంగళగిరి - గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఇ3ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా సిఎం ప్రారంభించారు. వీటి ప్రారంభానికి సూచికగా ఉండవల్లివద్ద ఏర్పాటు చేసినశిలాఫలకాన్ని మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్‌లతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాయపూడి నుంచి వెంకటపాలెం పెనుమాక మీదుగా ఉండవల్లి వరకూ సీడ్ యాక్సెస్ రహదారిని సిఆర్‌డిఎ నిర్మించింది. స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించటంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్లైంది. మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా ప్రణాళిక చేశారు. దీనికి రూ.1,519 కోట్ల వ్యయం కానుంది. స్టీల్ బ్రిడ్జిలతో పాటు సీడ్ యాక్సెస్ రహదారిని సిఎం కాలినడకన తిరిగి ఆసాంతం పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిఎం మాట్లాడుతూ "రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్. తెలుగు జాతి గర్వపడేలా ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం జరిగింది. విభ జన తర్వాత రాష్ట్రం నష్ట పోయింది. రాజధాని కూడా లేకుండా >>2

## అంగారకుడిపై రత్నాల రాసులు!

**న్యూయార్కు, ఆగస్టు 13:** అంగారకుడిపై సాధారణంగా కనిపించిన ఓ రాయిని పరిశీలించేందుకు నాసా రోవర్ లేజర్ ప్రయోగించింది. ఆ రాయిలో భూమిపై రత్నాలతో సంబంధం ఉన్న ఖనిజాల ఆనవాళ్లు బయటపడ్డాయి. నాసాకు చెందిన పర్సీవరెన్స్ రోవర్ జెజెరో క్రేటర్లో సేకరించిన సమాచారాన్ని విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఈ అనూహ్య విషయాన్ని గుర్తించారు. రోవర్లోని సూపర్క్యామ్ పరికరంతో రాయిపై లేజర్ ప్రయోగించి దాని రసాయన కూర్పును పరిశీలించారు. ఇందులో క్రోమియం కలిగిన కొరండం ఖనిజం ఉన్నట్లు తేలింది. భూమిపై కొరండం ఖనిజానికి చెందిన కొన్ని రూపాలు రూబీ, సఫైర్ వంటి విలువైన రత్నాలుగా కనిపిస్తాయి. అంగారకుడిపై ఇలాంటి ఖనిజాలు ఈ ప్రాంతంలో ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగా ఊహించలేదు. ఈ ఖనిజాలు కోట్లాది ఏళ్ల క్రితం ఏర్పడి ఉండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. భూగర్భంలో వేడి నీరు రాళ్లలోని పగుళ్ల నుంచి ప్రవహించినప్పుడు ఇలాంటి ఖనిజాలు ఏర్పడే అవకాశం ఉంది. అంగారకుడిపై కూడా ఒకప్పుడు నీరు చురుగ్గా కదిలిందన్న వాదనకు ఈ పరిశీలన మరింత బలం చేకూర్చుతోంది.

## బాలికలపై లైంగిక వేధింపులు పాస్టర్‌కు 20యేళ్ల జైలు

**విజయవాడ, ఆగస్టు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** సండే బైబిల్ స్కూల్ నిమిత్తం చర్చికి వచ్చే మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో ఓ పాస్టర్‌కు విజయవాడ ప్రత్యేక పోక్సో కోర్టు తీవ్రమైన శిక్ష ఖరారు చేసింది. దోషిగా తేలిన పాస్టర్‌కు 20యేళ్ల కఠిన కారాగార శిక్ష విధించడంతో పాటు రూ.30,000 జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.జయలక్ష్మి తీర్పు వెలువరించారు. విజయవాడలోని మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఓ చర్చిలో ప్రతి ఆదివారం జరిగే 'సండే స్కూల్'కు వచ్చే ముగ్గురు మైనర్ బాలికలతో అక్కడి పాస్టర్ అసభ్యంగా ప్రవర్తించేవాడు. వారిపై లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, ఈ విషయాలు బయటకు చెబితే తీవ్ర పర్యవసానాలు ఉంటాయని ఆ బాలికలను భయభ్రాంతులకు గురిచేసిబెదిరించేవాడు. పాస్టర్ ఆగడాలు తట్టుకోలేక బాధిత బాలికలు ధైర్యంచేసికుటుంబసభ్యులకు తెలపడంతో, పేరెంట్స్ 2020లో మాచవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. న్యాయస్థానంలో ఈ కేసులో సాక్ష్యాధారాలు రుజువు కావడంతో నిందితుని న్యాయమూర్తి జయలక్ష్మి శిక్షను విధించారు.దోషికి రూ.30,000 జరిమానా విధించారు. బాధితులైన ముగ్గురు చిన్నారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున పరిహారం అందజేయాలని పేర్కొంది.

### మానవ - వన్యప్రాణి సంఘర్షణ లేకుండా జీవనం అత్యున్నతం



**ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం** 2లో

**కుంకీ ఏనుగుల రాకతో సత్ఫలితాలు**

**అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో డి.సిఎం పవన్ కల్యాణ్**




14-08pg2exHMNWJQE:14-08pg2exHMNWJQE.qxd 8/13/2026 11:50 PM Page 1





గురువారం అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలంకారీ కళాకారులు రూపొందించిన ప్రత్యేక కళాఖండాల్ని ఆవిష్కరిస్తున్న డి.సిఎం పవన్

## మానవ - వన్యప్రాణి సంఘర్షణ లేకుండా

# జీవనం అత్యున్నతం

## అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో డి.సిఎం. పవన్ కల్యాణ్

**విశాఖపట్నం(జ్ఞానాపురం), ఆగస్టు 13 ప్రభాతవార్త:** "ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతాల్లో మదపుటేనుగుల గుంపులతో తీవ్రమైన సమస్యలుండేవి. సుమారు 132 నుంచి 142 ఏనుగులు గుంపులుగా ఏజెన్సీ ప్రాంతంలో కల్లోలం సృష్టించేవి. చిత్తూరు జిల్లా పలమనేరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల గుంపులు పంటపొలాల మీద పడి పంటలను ధ్వంసం చేయడం, అడ్డొచ్చే వారిపై దాడులు చేయడంతో ప్రజల్లో భయందోళనలు నెలకొన్నాయి. అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖల బాధ్యతలను తీసుకున్న తర్వాత మొదటిగా ప్రజలకు, ఏనుగులతో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం మీదనే దృష్టి సారించ్చా అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మదపుటేనుగులను నిరోధించేందుకు నాలుగు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వ సహాయంతో తీసుకొచ్చి, వాటికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మానవులు - వన్య ప్రాణుల మధ్య ఘర్షణలను నివారించే ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వీటివల్ల ఏజెన్సీ ఏరియాల్లో మంచి ఫలితాలొస్తున్నాయని చెప్పారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా విశాఖపట్నంలో ప్రత్యేకంగా నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "ఏనుగులు పర్యావరణ సమతుల్యతకు వారధిగా నిలుస్తాయి. దేశ వన్యప్రాణి వారసత్వానికి అవి చిహ్నాలు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏనుగుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2014 నుంచి దేశంలోని ఏనుగుల సంరక్షణ కేంద్రాలు 26 నుంచి 33కు పెరిగాయి. కారిడార్ల రక్షణ, 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్' బలోపేతం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 150 ఏనుగుల కారిడార్లను దేశవ్యాప్తంగా గుర్తించడం ద్వారా ఏనుగుల ఆవాసాలకు ఇబ్బంది లేకుండా ఉంది. ఈ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అనుసరిస్తోంది. ఏనుగుల సంరక్షణ కోసం ప్రత్యేకంగా దృష్టి సారించింది. కుంకీ ఏనుగులను రాష్ట్రానికి అందించడంలో సహకరించిన కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకి, ముఖ్యమంత్రి డికె శివకుమార్‌కి, అప్పటి అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేకి ఈ సందర్భంగా మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇది కేవలం రెండు రాష్ట్రాల మధ్య సహకారం మాత్రమే కాదు. ఇది ప్రజలు, ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణ కోసం సాగుతున్న పరస్పర సహకారం. కుంకీ ఏనుగులు ఇప్పటికే మదపుటేనుగులు చేసే విధ్వంసాలను అరికట్టే 15 కార్యకలాపాలలో సహాయపడ్డాయి. దీనివల్ల అటవీ సరిహద్దు ప్రాంతాల్లో మానవ మరణాలు 70శాతం తగ్గింది. పంట నష్టం కూడా తగ్గింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున కూడా సొంత కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాం. ఇప్పటికే ఒక శిక్షణ పొందిన కుంకీ ఏనుగు జయంత్ పార్వతీపురం మన్యం ప్రాంతంలో ఉంది. ప్రతి ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వాలనేది మా ప్రణాళిక్ష అని స్పష్టం చేశారు.

**హనుమాన్ ప్రాజెక్టుతో మంచి ఫలితాలు**

"మానవులు - వన్య ప్రాణుల మధ్య నెలకొన్ని ఘర్షణలను పూర్తిగా నిరోధించేందుకు, వన్య ప్రాణులను రక్షణ కోసం రూపొందిన హనుమాన్ ప్రాజెక్టుతో మంచి ఫలితాలు వస్తున్నాయి. వేగవంతమైన స్పందన, సాంకేతికత, వణ్య ప్రాణులతో కలిగే నష్ట నివారణ కోసం సమగ్ర మానవవన్యప్రాణుల సంఘర్షణ నిర్వహణ వ్యవస్థ అయిన హనుమాన్ ప్రాజెక్టును 2026, మార్చిలో ప్రారంభించాం. 93 స్పందన వాహనాలు, 7 వన్యప్రాణి అంబులెన్స్‌లను ఈ ప్రాజెక్టులో సిద్ధం చేశాం. ఇప్పటి వరకు 200కు పైగా వన్యప్రాణులు రక్షి ంచడమే కాకుండా, 30కి పైగా వన్యప్రాణులను తరలింపు కార్యక్రమం జరిగింది. సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. సమాజాన్ని దీనిలో భాగస్వామ్యం చేయాలనే లక్ష ్యంతో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాం. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ప్రతి రైతు భయం లేకుండా సాగు చేయగలిగే పరిస్థితికి చేరుకోవాలన్నదే లక్ష ్యం. వణ్య ప్రాణులను, ప్రజలను విడదీయడం మా ఉద్దేశం కాదు... ప్రజలు, వన్యప్రాణులు ఒకే ప్రదేశంలో సురక్షి తంగా కలిసి జీవించగలిగే భవిష్యత్తును సృష్టించడమే అసలైన విజయం" అని డి.సిఎం పవన్ కల్యాణ్ అన్నారు.

**ప్రాజెక్ట్ ఎలిఫెంట్ 30 జెయింట్ స్టెప్స్ పుస్తకావిష్కరణ**

అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా అటవీ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్ 30 జెయింట్ స్టెప్స్' పుస్తకాన్ని కేంద్ర మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తో కలిసి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దక్షి ణ భారతదేశంలో ఏనుగుల సంరక్షణకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌తోపాటు వైల్డ్ లైఫ్ సైన్స్‌కి సంబంధించిన పలు పుస్తకాలను విడుదల చేశారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కలంకారీ కళాకారులు రూపొందించిన ప్రత్యేక కళాఖండాన్ని కూడా ఆవిష్కరించారు. అనంతరం దేశవ్యాప్తంగా 21,450 పాఠశాలల్లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## రాజధానికి రాజమార్గం 'సీడ్ యాక్సెస్'

>> పోయింది. 25 పార్లమెంటు స్థానాల్లో మధ్యలో ఉన్న గుంటూరు జిల్లాలో రాజధాని పెట్టాలని ఆనాడు సంకల్పించాం. విస్తృత చర్చల తర్వాత మాపై విశ్వాసంతో రైతులు రాజధాని నిర్మాణం కోసం ముందుకు వచ్చి భూములు ఇచ్చారు. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ పాదాభివందనం చేస్తున్నాను. రైతులది త్యాగం కాదు స్ఫూర్తి. సింగపూర్ అమరావతి బృహత్ ప్రణాళికను ఉచితంగా ఇచ్చి సహకరించింది. గత పాలకులు ప్రజలతో పాటు సింగపూర్ ప్రతినిధులను కూడా వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్సు భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయించాం. కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తలలు దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో రాజధాని 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి తర్వాత మూడు రాజధానులని మాట తిప్పేశాడు. 2019-24 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు. అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రాజధాని నిర్మాణంలో ఐదు కాన్సెప్టులు**

"అమరావతి రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి వచ్చేసింది. నగర నిర్మాణంలో ఇది ప్రారంభం మాత్రమే. మూడో దశలో ఇది తాడేపల్లి వద్ద జాతీయ రహదారికి కనెక్ట్ అవుతుంది. అమరావతి రాజధాని పూర్తి కాలుష్య రహిత నగరంగా మారుతుంది. డీప్‌టెక్ క్యాపిటల్‌గా దీనిని తయారు చేస్తున్నాం. ఐదు ముఖ్యమైన అంశాలతో రాజధాని నిర్మాణం చేపడుతున్నాం. నో పోల్స్, బ్లూ, గ్రీన్, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం డీప్ టెక్ లాంటి ఐదు కాన్సెప్టులతో నిర్మాణం జరుగుతోంది. ఏఐ, క్వాంటం కంప్యూటర్ వ్యాలీగా అమరావతి మారుతుంది. టాప్-5 నగరాల్లో ఒకటిగా తయారవుతుంది. అమరావతి, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు, విజయవాడ కార్పొరేషన్లు రాజధాని పరిధిలోనే ఉంటాయి. 190 కిలోమీటర్ల అవుటర్, 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగురోడ్డు మంజూరు చేసిన కేంద్రానికి ధన్యవాదాలు. 2028 నాటికి భారత్ మెచ్చిన రాజధానిగా అమరావతిని ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. సింధూ నాగరికత తరహాలోనే రాజధాని నగరంలో సీడ్ యాక్సెస్ రహదారులు నిర్మాణం జరుగుతున్నాయి. ఇక అమరావతి అన్‌స్టాపబుల్. రాజధానిలో నిర్మిస్తున్న రోడ్డును అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించారు. ఈ తరహా వ్యక్తులతో రాష్ట్రానికి చాలా ప్రమాదం. రాష్ట్రాభివృద్ధి కోసం నిర్దుష్టమైన లక్ష్యాలను పెట్టుకుంటున్నాం అని సిఎం అన్నారు.



ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసభవన సముదాయం


రాజధాని అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిపనులను చూపిస్తున్న సిఎం చంద్రబాబు

**జెండా సాధించాల్సిన అజెండాతో సంకల్పం**

"2047 నాటికి ఏపిని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నాం. ప్రజలు వ్యక్తులుగా మీరేం సంకల్పం తీసుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయండి. అనునిత్యం మీ సంకల్పాన్ని నెరవేర్చుకునే ఆలోచనలు చేస్తే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యం అవుతుంది. మనకు స్వాతంత్ర్యం ఎందుకు వచ్చిందన్న అంశాన్ని అంతా మర్చిపోతున్నాం. జెండా వందనంతో పాటు దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేలా ఆలోచనలు చేయటం ముఖ్యం. రైతులు, విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులు ఎవరైనా తమ తమ స్థాయిల్లో కృషి చేయాలి. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలి. మండల, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలి. ఓ ప్రజా ఉద్యమంగా తిరంగా ర్యాలీ జరగాలి. వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. ఆ శక్తి సామర్థ్యాలను ప్రజలే అందించాలి. అమరావతి రాజధాని అభివృద్ధికి ప్రజలూ ఆలోచనలు పంచుకోవాలి. అమరావతి ఆర్థిక రాజధానిగా ఎదగాల్షి అని సిఎం అన్నారు. అనంతరం మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రవణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపి భాష్యం రామకృష్ణలతో కలిసి రాయపూడి వద్ద నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని సిఎం చంద్రబాబు పరిశీలించారు.

## గుమ్మడి గోపాలకృష్ణకు సంగీత నాటక అకాడమీ అవార్డు

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్న గుమ్మడి


గురువారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గుమ్మడి గోపాలకృష్ణ

**విజయవాడ,ఆగస్టు 13, ప్రభాత వార్త ప్రతినిధి:** సుప్రసిద్ధనటుడు, ఏపి నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణకు ప్రతిష్టాత్మక సంగీత నాటక అకాడమీ పురస్కారం లభించింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డు గుమ్మడి అందుకున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు ఆయనకు 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. నాటకరంగం - నటన విభాగంలో 2024 సంవత్సరానికి గాను అందుకున్నందుకు మీకు హృదయపూర్వక శుభాభినందనలని సిఎం పేర్కోన్నారు.తెలుగు నాటకరంగానికి, ప్రత్యేకించి కాలాతీతమైన తెలుగు పద్యనాటక సంప్రదాయానికి మీరు అంకితమైన అసాధారణమైన నాలుగు దశాబ్దాల ప్రస్థానానికి ఈ జాతీయ గౌరవం తగిన గుర్తింపు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, హరిశ్చంద్రుడు మరియు శ్రీనాథుడి పాత్రలలో మీ అద్భుతమైన నటన ద్వారా, మీరు మన పురాణాలు, చరిత్ర మరియు సాహిత్యంలోని పాత్రలను తరతరాల ప్రేక్షకులకు సజీవమైన, మరపురాని అనుభవాలుగా మార్చారు.మీ శక్తివంతమైన ..కంఠం, భావయుక్తమైన నటన,.. కవిత్వంపైపట్టు మరియు మన సాంస్కృతిక సంప్రదాయాలపై లోతైన అవగాహన నాటక ప్రియుల హృదయాలలో మీకు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించిపెట్టాయి. అంతేకాకుండా, తెలుగు నాటకరంగ వైభవాన్ని భారతదేశం దాటి, దాని సౌందర్యాన్ని మరియు లోతును అమెరికాతో సహా విదేశీ ప్రేక్షకులకు పరిచయం చేయడానికి మీరు చేసిన కృషి కూడా ప్రశంసనీయం. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్‌గా, మీ అనుభవం మరియు హోదా యువ కళాకారులను ప్రోత్సహించడంలోనూ, మన అమూల్యమైన ప్రదర్శన కళల వారసత్వాన్ని పరిరక్షించడంలోనూ మీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయి. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు మీకు అపారమైన ఆనందాన్ని కలిగించి, రాబోయే మరెన్నో సంవత్సరాల పాటు వేదికను ప్రకాశవంతం చేస్తూ, మన సాంస్కృతిక జీవితాన్ని సుసంపన్నం చేయడానికి మీకు స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను. మరోసారి హృదయపూర్వక అభినందనలు, నా వ్యక్తిగత శుభాకాంక్షలు అని వ్యాఖ్యానించారు.

## ప్రజారోగ్యానికి సవాలుగా మారిన ఊబకాయం

### రాష్ట్రంలో ప్రతి ఇద్దరిలో ఒకరికి అధిక బరువు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,ఆగస్టు13,ప్రభాతవార్తప్రతినిధి:** ఊబకాయ సమస్య రాష్ట్ర ప్రజారోగ్యానికి సవాల్ విసురుతోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర రూపం దాలుస్తోన్న ఊబకాయ సమస్యను ఎదుర్కొనేందుకు జాయింట్ టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆరోగ్య శాఖతోపాటు విద్య, క్రీడలు, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖలను ఇందులో భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. విజయవాడలో గురువారం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో ఊబకాయం, జీవక్రియ ఆరోగ్యంపై నిర్వహించిన రాష్ట్రస్థాయి బహుళరంగ భాగస్వామ్యుల సదస్సులో మంత్రి మాట్లాడారు. జీవనశైలిలో వస్తోన్న మార్పులకారణంగా ఊబకాయం ప్రధాన ప్రజారోగ్య సవాల్‌గా మారుతోందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. సంపద పెరుగుతున్న వేగం కంటే ఊబకాయం విస్తరిస్తున్న వేగం ఎక్కువగా ఉందన్నారు. పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక ప్రగతితో జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నప్పటికీ.. మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమతగ్గడం వంటి కారణాలతో ఊబకాయం సమస్య తీవ్రతరమవుతోందని చెప్పారు. దీనిని నిరక్ష్యం చేస్తే ప్రజల ఆరోగ్యంతోపాటు ఉత్పాదకత, ఆర్థిక ప్రగతిపైనా ప్రభావం పడుతుందని వివరించారు. సిఐఐ రాష్ట్ర ఛైర్మన్ నరేంద్రకుమార్, మాజీ ఛైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ, ప్రిన్సిపల్ అడ్వైజర్ (హెల్త్‌కేర్) డాక్టర్ షబ్నమ్ సింగ్ మాట్లాడుతూ.. సీఐఐ ఆర్థిక వ్యవహారాలకే పరిమితం కాకుండా సామాజిక, ఆరోగ్య రంగాల అభివృద్ధికి కూడా కృషి చేస్తోందన్నారు. ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఊబకాయ సమస్య తీవ్రతను గుర్తించి రాష్ట్రాల వారీగా అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలపై సీఐఐ తరఫున ప్రతిపాదనలు అందిస్తామని చెప్పారు.ఈ సదస్సులో వైద్య, ఆరోగ్య శాఖ జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు, బోధానాసుపత్రుల వైద్యులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాల్గొని ఊబకాయం పరిష్కార చర్యలపై అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## జూనియర్ వైద్యుల సమ్మెకు ప్రభుత్వ వైద్యుల సంఘం సంఘీభావం


గురువారం గుంటూరు ప్రభుత్వ వైద్యకళాశాలలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యులు

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 13, ప్రభాత వార్త:** రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ వైద్యులు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో స్వచ్ఛంద రిలే నిరాహార దీక్ష రెండో రోజు కొనసాగింది. సమ్మె రెండో దశలో భాగంగా జూనియర్ వైద్యులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో శాంతియుతంగా ఆందోళన కొనసాగించారు. జూనియర్ వైద్యుల ఆందోళనకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల వద్ద జరుగుతున్న సమ్మె శిబిరాన్ని సందర్శించారు. జూనియర్ వైద్యులను కలిసి వారి సమస్యలను తెలుసుకుని సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ స్వరూప్ కాంత్‌తో పాటు డాక్టర్ కట్టా శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్ రమ్య, డాక్టర్ కే. మారుతీదేవి, డాక్టర్ వై. రవీంద్రకుమార్, డాక్టర్ ఎస్. అరుణాదేవి, డాక్టర్ బి. శివగోపాల్, డాక్టర్ పి. రాజా, డాక్టర్ అజయ్, డాక్టర్ పి. సుధారాణి, డాక్టర్ టి. వెంకట శివరామకృష్ణ, డాక్టర్ పి. టాబితా, డాక్టర్ మురళి తదితరులు సమ్మె శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ జూనియర్ వైద్యులు చేస్తున్న డిమాండ్లు న్యాయమైనవని, వైద్య రంగ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న సమయంలో విద్యార్థులపై ఫీజులు, వసతి గృహ రుసుములు, అద్దెలు, పుస్తకాలు, వైద్య సదస్సులు, ఇతర విద్యా సంబంధిత ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా జూనియర్ వైద్యుల ఉపకార వేతనాన్ని సకాలంలో సవరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

**అర్హత కలిగిన వారికే బోధనా అవకాశాలు**

ఎంఎస్సీ, పిహెచ్‌డీ అర్హత కలిగిన బోధనా సిబ్బంది నియామకాల విషయంలో కూడా స్పష్టమైన విధానం అవసరమని ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఇలాంటి బోధనా సిబ్బంది వైద్య కళాశాలలు లేదా జాతీయ స్థాయి వైద్య సంస్థల్లో శిక్షణ పొంది, వైద్య విద్యార్థులకు బోధించడంలో తగిన అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన వైద్య స్నాతకోత్తర బోధనా సిబ్బంది అందుబాటులో లేని సందర్భంలో మాత్రమే ఇటువంటి నియామకాలను పరిగణించాలని, అవి మొత్తం నియామకాల్లో పది శాతానికి మించకూడదని సూచించారు. నిర్దేశిత నిబంధనలకు మించి నియామకాలు చేపట్టడం, పదవీ విరమణ వయస్సును పెంచడం వల్ల యువ వైద్యులకు ఉద్యోగ, బోధనా అవకాశాలు తగ్గే అవకాశం ఉందని ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే సీనియర్ వైద్యుల అనుభవం, విజ్ఞానం రాష్ట్ర వైద్య రంగానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.

## నెలాఖరులో వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం

### నిర్వాసితుల సమస్యలన్నింటిని పరిష్కరిస్తాం

### నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు


గురువారం ప్రకాశం జిల్లా కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు. చిత్రంలో ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ విజయ సునీత

**మార్కాపురం, ఆగస్టు 13, ప్రభాతవార్త ప్రతినిధి :** మూడు దశాబ్దాల పశ్చిమ ప్రాంత కల సాకారం కానున్న వెలిగొండ ప్రాజెక్టును ఈనెలాఖరులో జాతికి అంకితం చేయడం జరుగుతుందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ప్రాజెక్టు నీటి విడుదలపై నిర్వాసితుల సమస్యలను అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును ఆయన చేతుల మీదుగానే ఈ నెలాఖరులో జాతికి అంకితం చేయడం ఓ సువర్ణ అధ్యాయం అన్నారు. మూడు జిల్లాల్లో సాగు, తాగునీరు అందించే భారీ వెలిగొండ ప్రాజెక్టు నీటితో పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం కానుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో మిగిలిపోయిన పనులన్నింటిని ప్రణాళికబద్ధంగా పూర్తి చేసుకుంటూ ముందుకు సాగామన్నారు. కొల్లం వాగు నుంచి రెండు టన్నెల్స్‌ల ద్వారా నల్లమల సాగర్‌కు నీరు అందించేందుకు రాత్రింబవళ్లు అధికారులు, సిబ్బంది కష్టపడి పని చేయడం జరిగిందన్నారు. లైనింగ్ పనులు, టన్నెల్ నిర్మాణ పనులు వంటి పెండింగ్ ఉండగానే 2024లో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేసి దగా చేశారని విమర్శించారు. ఎటువంటి పనులు చేపట్టకుండానే కేవలం జాతికి అంకితమంటూ ఓట్ల కోసం పశ్చిమ ప్రాంతప్రజలను మోసం చేశారన్నారు. రెండవ టన్నెల్‌లో 80వేల క్యూసెక్కుల మట్టి తొలగించడం జరిగిందని, ఎట్టి పరిస్థితుల్లో ప్రాజెక్టు ద్వారా నీరు ఇవ్వాలన్న సంకల్పంతోనే శరవేగంగా పనులు పూర్తి చేశామన్నారు. టన్నెల్ బోరింగ్ మిషన్ తొలగింపుకు పెద్ద ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చిందని, 1900 మెట్రిక్ టన్నులు ఉన్న బోరింగ్ మిషన్‌విడిభాగాలకుగాను 1500 మెట్రిక్ టన్నులు బయటకు తీసుకు రావడం జరిగిందని, మరో 400ఈనెల 17వతేదీలోపు తొలగించడం జరుగుతుందన్నారు. టన్నెల్ బోరింగ్‌మిషన్ గుత్తేదారు పనులపై స్టేఉన్నందున న్యాయ నిపుణులతో చర్చించి ఆ స్టేను తొలగించడం జరిగిందన్నారు. 11వేల క్యూసెక్కుల ప్రవాహం కలిగిన ఫీడర్ కెనాల్ గండి పడిపోగా పరిస్థితిని అధ్యాయనం చేసి ఫీడర్ కెనాల్‌కు సిసి వాల్, లైనింగ్ పనులు రూ.4కోట్లతో పూర్తి చేయడం జరిగిందన్నారు. నిర్వాసితులకు ఇవ్వాల్సిన 900 కోట్ల రూపాయల పరిహారానికి గాను గత నెలలో రూ.315 కోట్లు ఇవ్వడం జరిగిందని, మిగిలిన బ్యాలెన్స్ పరిహారం కూడా నెలాఖరులోపు పూర్తి స్థాయిలో చెల్లించడం జరుగుతుందన్నారు. నిర్వాసితుల త్యాగాలు మరువలేమని, నిర్వాసితుల సమస్యలన్నింటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా అందుతుందన్నారు. గజిట్‌లోపేర్లు తప్పులు పడి పరిహారం తీసుకోని వారి సమస్యలు పరిష్కరించి పరిహారం అందించడం జరుగుతుందన్నారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి గ్రామానికి అధికారులతో కమిటీలు వేయడం జరిగిందని, ఆ కమిటీలు నిర్వాసితుల ప్రతి సమస్యను తెలుసుకుని పరిష్కరించడం జరుగుతుందన్నారు.

ఎవరికైనా పరిహారం రాకపోతే ఎందుకు ఇవ్వలేకపోయామో కూడా కారణాలు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఏఒక్కరికి అన్యాయం జరగకుండా సమస్యలను పరిష్కరించి ఆదుకోవడమే తమ కర్తవ్యం అన్నారు. కూలీనాలి చేసుకుని జీవించే నిర్వాసిత ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వెలిగొండ నీటి విడుదల ద్వారా పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం కావడమే కాకుండా అన్ని రకాలుగా వెనుకబాటుకు గురైన పశ్చిమ ప్రాంతానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడం జరుగుతుందని, తద్వారా యువతకు ఉపాధిఅవకాశాలు మెరుగవుతాయన్నారు. ఆర్థికంగా, సామాజికంగా పశ్చిమప్రాంతం ఎదగనుందన్నారు. వెలిగొండ నీటి ద్వారా ఫ్లోరిన్ సమస్యకు స్వస్తిచెప్పడమే కాకుండా భూగర్భజలాలు మెరుగుపడి సాగు, తాగునీరు సమస్యకు శాశ్విత పరిష్కారం కానుందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావాలన్నా మూడు దశాబ్దాల పశ్చిమ ప్రాంత కల కూటమి ప్రభుత్వ హయాంలో నెరవేరుతుండడం పట్ల ఎంతో సంతోషంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయసునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### వారం - వర్జ్యం

14-08-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఆశ్లేషకార్తె
తి.విదియ సా.6.52
న.పూర్వఫల్గుణి రా.3.44
వ.మ.12.21-మ.1.53
దు.1. ఉ.8.23-ఉ.9.14
దు.2. మ.12.38-మ.1.29
రాహు ఉ.10.30-ఉ.12.00
శుభ ఉ.6.00-ఉ.7.00

### వార్తాఫలం

**మేషం :** ఉద్యోగంలో నూతన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పై అధికారుల ప్రశంసలు పొందుతారు. వస్త్ర లాభం.

**వృషభం :** నూతన వ్యాపారాలు పరిశ్రమలను ప్రారంభిస్తారు. మిత్రులతో కలిసి విందు, వినోదాల్లో పాల్గొంటారు.

**మిథునం :** ప్రముఖ వ్యక్తి ద్వారా ఒక ముఖ్యమైన వ్యవహారాన్ని విజయవంతంగా పూర్తి చేస్తారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కర్కాటకం :** పనులు వాయిదాపడే సూచనలు ఉన్నాయి. మిత్రులు ఒత్తిడి వలన కొంత బాధ కలుగుతుంది.

**సింహం :** కుటుంబంలో శుభకార్యాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. మిత్రుల కలయిక.

**కన్య :** ఓర్పుతో, ధైర్యముతో చేయవలసిన పనిని సఫలము చేయగలుగుతారు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**తుల :** విధి నిర్వహణలో గాని, వ్యాపారములో గాని మార్పులు జరుగ వచ్చును. క్రయ విక్రయాలలో లాభాలు.

**వృశ్చికం :** రాజకీయాలు, సంఘములు, యూనియన్లు మొదలగు కార్యక్రమాలకు అనుకూల కాలము. క్రయ విక్రయాలలో లాభాలు.

**ధనుస్సు :** వైరి వర్గంలోని అనైక్యత మీకు లాభిస్తుంది. మొండి బాకీలు రాబట్టు కోవడానికి కొత్త విధానాలు అవలంభిస్తారు.

**మకరం :** ముఖ్యమైన విషయాలలో పెద్దల సలహాలు తీసుకుంటారు. కొన్ని అవకాశాలు అప్రయత్నంగా కలిసి వస్తాయి.

**కుంభం :** కార్యాలయాలలో సహోద్యోగుల సహాయ సహకారాలు అందిస్తారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మీనం :** స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఆరోగ్యం జాగ్రత్త.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## రాజకీయాల్లోకి వచ్చే యువతకు కన్నా లక్ష్మీనారాయణ ఆదర్శం

### అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు

**గుంటూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త :** రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు సీనియర్ నేత కన్నా లక్షీ ్మనారాయణ జీవితం ఎంతో ఆదర్శప్రాయమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు కొనియాడారు. గుంటూరు లో గురువారం ఘనంగా జరిగిన ఖకన్నాఖ రాజకీయ స్వర్ణోత్సవ సంబరాలు, ఆయన 73వ జన్మదిన మహోత్సవ వేడుకలకు అయ్యన్న పాత్రుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకసారి ఎన్నికల్లో గెలిస్తే రెండోసారి గెలవడం కష్టంగా మారిన ప్రస్తుత రోజుల్లో, కన్నా లక్షీ ్మనారాయణ ఏకంగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలవడమే కాకుండా ఐదుగురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పనిచేసిన ఏకైక నేతగా ఘనత సాధించారని కితాబిచ్చారు.క్రమశిక్షణ, పట్టుదల, పోరాట పటిమ కన్నా నైజమని, ఆయన నడిచిన బాట నుంచి నేటి తరం ఎంతో నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాడు దివంగత ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం వల్లే నేడు ప్రజల ఎదుట ఇలా నిలబడే అవకాశం కలిగిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందని అయ్యన్న పాత్రుడు స్పష్టం చేశారు. నేటి యువత చురుగ్గా రాజకీయాల్లోకి వచ్చి స్వచ్ఛమైన పాలన అందించాలని పిలుపునిచ్చారు.



భుజానికి శస్త్ర చికిత్సపూర్తయిన అనంతరం గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అవుతున్న జూనియర్ ఎన్టీఆర్

# ఆస్పత్రి నుంచి జూనియర్ ఎన్టీఆర్ డిశ్చార్జ్

## రెండు నెలలు విశ్రాంతి అవసరం

### సినీనటుడికి వైద్యుల సూచన, హెల్త్‌బులెటిన్ విడుదల

**హైదరాబాద్ (బేగంపేట), ఆగస్టు 13 ప్రభాతవార్త:** భుజం నొప్పితో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరిన ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ శస్త్ర చికిత్స అనంతరం గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఇటీవల ఆయన భుజానికి శస్త్రచికిత్స విజయ వంతంగా చేసినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు ఆయన ఆస్పత్రి హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. డా. ఆర్.ఎ.పూర్ణచంద్ర తేజస్వి, డా.నితిన్ బెజంకి నేతృత్వంలోని వైద్య బృందం ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించింది. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం ఆయనకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. ఆయన పూర్తి స్థాయిలో కోలుకునేందుకు ఇకపై క్రమబద్ధమైన పున రావాస(రిహాబిలిటేషన్) కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు ఆస్పత్రి వర్గాలు స్పష్టం చేశాయి.

# రాజధానితో అన్ని జిల్లాలకు సమన్యాయం: మంత్రి నారాయణ



బకింగ్‌హామ్ కెనాల్ స్టీల్ బ్రిడ్జిపై మంత్రి నారాయణ

**విజయవాడ,ఆగస్టు13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని, ఏపీకి ఆర్థిక రాజధాని కట్టాలని సీఎం చంద్రబాబు భావించారని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం సీడ్ యాక్సెస్ రోడ్ రెండో దశను, బకింగ్‌హామ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జిని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణకు వచ్చే ఆదాయం హైదరాబాద్ నుంచే ఎక్కువగా వస్తోందన్నారు. మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడులకు ముంబాయి, బెంగళూరు, చెన్నై ద్వారా ఆదాయం వస్తోందని తెలిపారు. ఆర్థిక రాజధాని నిర్మాణానికి మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా అందించిందని చెప్పుకొచ్చారు. ఐకానిక్ భవనాల నిర్మాణం కోసం నార్మల్ ఫాస్టర్స్ లండన్ వారిని సంప్రదించినట్లు తెలిపారు. కృష్ణానది ఒడ్డున అమరావతి కడితే అన్ని జిల్లాలకు సమన్యాయం జరుగుతుందని వెల్లడించారు. అమరావతి.. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు మధ్యలో ఉంటుందని మంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గం అందుబాటులో ఉందన్నారు. 2015 జనవరిలో ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ ఇచ్చామని, కేవలం 58 రోజుల్లో ఒక్క లిటిగేషన్ కూడా లేకుండా 34,000 ఎకరాలను రైతులు ఇచ్చారని వివరించారు. అమరావతిలో పనులు ప్రారంభించడం, టెండర్లు పిలవడం, ఇతర పనులు చేపట్టడానికి మూడున్నర సంవత్సరాలు పట్టిందన్నారు. మిగిలిన సంవత్సరం 6 నెలల్లో పదివేల కోట్లు అమరావతి కోసం ఖర్చు చేశామన్నారు.వైసీపీ అధికారంలోకి వచ్చి మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ఆడిందని మంత్రి విమర్శించారు. అమరావతి నిర్మాణాన్ని ఎక్కడికక్కడ ఆపేసిందన్నారు. నిర్మాణ సంస్థల ఒప్పందాలను క్లోజ్ చేయకుండా వదిలేసిందని దీంతో కూటమి ప్రభుత్వం తిరిగి వచ్చాక ఆయా సంస్థలతో ఒప్పందాలను టెక్నికల్‌గా క్లోజ్ చేసి తిరిగి టెండర్లు పిలవాల్సి వచ్చిందని అన్నారు. గతంలో ఉన్న పనుల నాణ్యతను ఐఐటీ చెన్నై, హైదరాబాద్ వారితో పరిశీలన చేసి పనులను ప్రారంభించామన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్‌ను ఆనుకుని ఎలక్ట్రికల్, గ్యాస్, టెలిఫోన్ వాటర్ వంటివి అండర్ గ్రౌండ్‌లో ఉండేలా ప్లాన్ చేశామన్నారు. వైసీపీ ఓ గొడ్డలి పార్టీగా రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేసినప్పటికీ అయినా రైతులు అమరావతి నిర్మాణానికి సహకరించారని తెలిపారు. ఇలాంటి అమరావతి నిర్మాణంలో పాలుపంచుకునే అవకాశం కల్పించినందుకు సిఎం చంద్ర బాబు కు నారాయణ ధన్యవాదాలు తెలియజేశారు.

# గత పాలకులు రైతులను అవమానాలకు గురి చేశారు: మంత్రి నాదెండ్ల మనోహార్



**విజయవాడ,ఆగస్టు13,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులను ఎన్నో అవమానాలకు గురిచేశారని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. రాజధాని కోసం భూములిచ్చేందుకు రైతులు ముందుకు వచ్చిన వారిని కించపరిచారని, గతంలో పవన్ కళ్యాణ్ తన పర్యటనల ద్వారా రైతుల పడుతున్న బాధలను స్వయంగా అర్థం చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. రైతులు ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలనేదే పవన్ కళ్యాణ్ ఆకాంక్ష అని చెబుతూ రాజధాని అమరావతి రైతులకు ఆయన మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రధానమంత్రి సహకారంతో కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం మరిన్ని కీలక చర్యలు తీసు కుం టుందని మంత్రి స్పష్టం చేశారు.రాజధాని నిర్మాణం కోసం 30 వేల ఎకరాల భూమి ఇచ్చిన రైతులను గత ప్రభుత్వం అవమానించారని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో స్థానిక నాయకులు, ఎమ్మెల్యేలు రాజధాని రైతులను నానా ఇబ్బందులు పెట్టారని, వాటిని రైతులు ఎప్పటికీ మర్చిపోరని మంత్రి సూచించారు. రైతులు ఆనందంగా ఉండాలనేదే పవన్ కళ్యాణ్ కోరికని నాదెండ్ల మనోహర్ తెలిపారు. నాడు పర్యటనల్లో పవన్ స్వయంగా రైతుల బాధలను చూసి చలించారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అమరావతి నిర్మాణ కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాజధాని అభివృద్ధికి మరిన్ని వేగవంతమైన చర్యలు తీసుకుం టామని వెల్లడించారు. ఈ సందర్భంగా చారిత్రాత్మక పోరాటం చేసిన అమరావతి రైతులకు మంత్రి నాదెండ్ల మనోహర్ మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

# స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం గుడ్ న్యూస్

## 10 మంది నిబంధన సడలింపు

### పొదుపు సంఘాలకు సులభంగా బ్యాంక్ రుణాలు

### ఎపి గ్రామీణ బ్యాంక్‌కు మంత్రి కొండపల్లి అభినందనలు

### ఇతర బ్యాంకులూ అనుసరించాలని మంత్రి పిలుపు

**సచివాలయం, ఆగస్టు 13 ప్రభాతవార్త :** స్వయం సహాయక సంఘాల మహిళలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవా సాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సభ్యుల మరణం లేదా వలసల వల్ల ఒక సంఘంలో సభ్యుల సంఖ్య 10కంటే తగ్గితే, ఆ సంఘాలు ఎంత బాగా పనిచేసినా తదుపరి రుణ సదుపాయం (రిపీట్‌డోస్) పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని, ఈ క్రమంలోనే ఎపి గ్రామీణ బ్యాంక్ తమ అంతర్గత ఉత్తర్వులు నెంబర్ 152 ద్వారా ప్రత్యేక సడలింపులు ప్రకటించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. అలాగే కొత్త మార్గదర్శకాల ప్రకారం కనీసం 8 మంది యాక్టివ్ సభ్యులు ఉన్న సంఘాలకు రిపీట్ డోస్ రుణం మంజూరు చేస్తారని, అయితే సభ్యుల సంఖ్య తగ్గడానికి వలసలు లేదా మరణం మాత్రమే కారణమై ఉండడంతో పాటు అక్రమాలు లేకుండా పాత బకాయలు లేకుండా సక్రమమైన చెల్లింపులు ఉండాలని కూడా మంత్రి సూచించారు. రుణసడలింపు పొందిన సంఘాలు 6 నెలల వ్యవధిలో తమ సభ్యుల సంఖ్యను మరల కనీసం 10 మందికి పెంచుకోవాలని కూడా మంత్రి తెలిపారు ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్తను తయారు చేయడమే ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇదే రీతిలో స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్‌ఎల్‌బిసి), రాష్ట్రంలో ఉన్న ఇతర బ్యాం కులు కూడా ముందుకు వచ్చి, మంచి రికార్డు ఉన్న స్వయం సహాయక సం ఘాలకు 10 మంది నిబంధనను సడలించి, సులభంగా రుణ పునరుద్ధరణ సహాయం అందించాలని మంత్రి కొండపల్లి పిలుపునిచ్చారు.

# ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

## గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ఎండి హెప్సిబా



**సచివాలయం, ఆగస్టు 13,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రతి పేదవానికి పక్కా ఇల్లు అందించాలని, ఆలక్ష్యానికి అనుగుణంగా నిర్మాణంలో ఉన్న ఇళ్ళను సకాలంలో పూర్తి చేయడానికి ఉద్యోగులంతా సమిష్టిగా కృషిచేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి,రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జీ మేనేజింగ్ డైరెక్టర్ హెప్సిబా కొర్లపాటి పిలుపునిచ్చారు.గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జీ ఎండిగా నియమితులైన ఆమె అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఇంజనీరింగ్ అధికారులు క్రమం తప్పకుండా లేఅవుట్‌లను సందర్శించి పనుల పురోగతిని,నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు.ప్రతి అధికారి,ఉద్యోగి సమయపాలన పాటిస్తూ సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.సమావేశంలో సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ కృష్ణయ్య,జనరల్ మేనేజర్లు గోవిందరావు,లీలారాణి తదితర అధికారులు పాల్గొన్నారు.




# దేశంలోనే తొలి ప్రైవేట్ బ్రాండ్ రైలు 'స్ప్రైట్ తేజస్'

**లక్నో, ఆగస్టు 13:** దేశంలోనే తొలి ప్రైవేట్ రైలు పేరు తేజస్. ఈ రైలును ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ ప్రారంభించింది. ఇది లక్నో- ఢిల్లీ మధ్య నడుస్తుంది. ఇప్పుడు ఈ రైలును స్ప్రైట్ తేజస్ ఎక్స్‌ప్రెస్ అని పిలువనున్నారు. ఈ ప్రకటన హక్కులను ఆరునెలల కాలానికి ఐఆర్‌సీటీసీ కల్పించింది. దీంతో ఈ రైలును స్ప్రైట్ తేజస్ ఎక్స్‌ప్రెస్ పిలవాలని నార్త్ ఈస్టర్న్ రైల్వే సూచించింది. దేశంలో ఒక రైలుకు బ్రాండ్ పేరు పెట్టడం ఇదే మొదటిసారి. సూపర్‌ఫాస్ట్ రైలు అయిన దీనిలో ఏసీతో పాటు అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయి. దీనిలో ఆహార, పానీయాలు, ఇన్ఫోటైన్‌మెంట్ సేవలు కల్పిస్తారు. అదేవిధంగా గ్రూప్ బుకింగ్ చేసుకోవచ్చు. సమావేశాలు, వివాహాలు, ఏదైనా ఈవెంట్ కోసం 78 సీట్ల ఏసీ చైర్ కార్‌ను వినియోగించుకోవచ్చు. ఈ ప్రైవేట్ రైలు ట్రాకులు, మౌలిక సదుపాయాలు వినియోగించుకుంటున్నందుకు అయ్యే ఖర్చును ఐఆర్‌సీటీసీ భారతీయ రైల్వేకు చెల్లిస్తుంది. దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ రైలు అయిన తేజస్‌ను ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఐదేళ్లక్రితం డిసెంబర్ 3న ప్రారంభించారు.

# 'సర్'ను పారదర్శకంగా పూర్తి చేయాలి: సిఇఒ

## 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు

### అభ్యంతరాలు సమర్పించేందుకు 30 వరకూ గడువు




గురువారం సచివాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఇఒ వివేక్ యాదవ్

**విజయవాడ,ఆగస్టు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)2026 ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి అత్యంత పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వివేక్ యాదవ్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఈవో, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించాలన్నారు. మ్యాపింగ్ చేయని ఓటర్లు, లోపాలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయడం, విచారణలు పూర్తి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేశారు. బుక్ ఎ కాల్ పెండింగ్ అంశాలు, ఎన్‌జీఎస్పీ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లాల అధికారులను ఆదేశించారు. ఓటర్ల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు సీఈఓ వెల్లడించారు. ఈ నిర్ణీత ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), రాజకీయ పార్టీల ప్రతినిధులు (బీఎల్ఏలు) పోలింగ్ కేంద్రాల్లోనే స్వయంగా అందుబాటులో ఉండి పౌరులకు ఓట్ల నమోదు, ఫారమ్‌ల పూర్తిపై మార్గదర్శకత్వం వహిస్తారని పేర్కొన్నారు. చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ ఈ ప్రక్రియను పారదర్శకంగా ముగించాలన్నారు. 18- 19 ఏళ్ల వయసు గల యువ ఓటర్ల నమోదుకు విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం అన్ని కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, అర్హులైన ప్రతి యువకుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారులను ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు).అదనపు డిఈవోలు పాల్గొన్నారు. ఇక ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా జూన్ 15 నుంచి జులై 24 మధ్య మీ వివరాలు నింపిన ఎన్యూమరేషన్ ఫాంలను బూత్ స్థాయి అధికారులకు ఇంకా సమర్పించ లేనివారికి, తాజాగా విడుదలైన ముసాయిదా ఓటరు జాబితాలో మీ పేరు లేనివారికి ఎన్నికల సంఘం ఓ అవకాశం కల్పించింది. మీ పేరు జాబితాలో ఉన్నా పేరు, వివరాలు, చిరునామాల్లో ఏమైనా తప్పులు, సవరించుకునేందుకు, లేకుంటే మార్పులు కోసం,జాబితాలోని అనర్హుల పేర్లపై అభ్యంతరం చెప్పేందుకు వీలు కల్పించింది. ఆయా అంశాలపై దరఖాస్తు చేసుకునేందుకు, అభ్యంతరాలు సమర్పించేందుకు ఎన్నికల సంఘం మరోసారి అవకాశం కల్పించింది. ఓటర్లు, రాజకీయ పార్టీల బూత్‌స్థాయి ఏజెంట్లు.బిఎల్‌ఏ ఎవరైనా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించేందుకు ఆగస్టు 30 వరకూ సమయం ఇచ్చింది.

# సిట్ నివేదికను బయటపెట్టిన మంత్రి డోలా

## 97.55 శాతం ఓఎంఆర్ షీట్లలో దిద్దుబాట్లు

### ప్రైవేట్ రిసార్ట్‌లో, అనర్హులతో వాల్యుయేషన్ జరిపినట్లు గుర్తింపు

### యువతను మోసం చేసిన జగన్ సమాధానం చెప్పాలి



**విజయవాడ, ఆగస్టు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, పాపాలు సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) నివేదిక ద్వారా బట్టబయలయ్యాయని, వీటికి మాజీ ముఖ్యమంత్రి జగన్ సమాధానం చెప్పాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిట్ నివేదికలో వెలుగు చూసిన వాస్తవాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని అన్నారు. సిట్ నివేదిక ప్రకారం, వాల్యుయేషన్ ప్రక్రియలో పాల్గొన్న 158 మంది వాల్యుయేటర్లలో కేవలం 72 మందికి మాత్రమే అర్హత ఉందని, మిగిలిన వారంతా అనర్హులేనని మంత్రి స్పష్టం చేశారు. అధికారిక వ్యవస్థను కాదని, ప్రైవేట్ జీమెయిల్ ఖాతాలు, వ్యక్తిగత ఐడీలు, డ్రైవ్‌ల ద్వారా వాల్యుయేషన్ నిర్వహిం చడం దారుణమని అన్నారు. అంతేకాకుండా, అభ్యర్థుల ఆన్సర్ షీట్లను ఓ ప్రైవేట్ రిసార్ట్‌కు తరలించి, సీసీ కెమెరాలు గానీ, యూనివర్సిటీ నిపుణుల పర్యవేక్షణ గానీ లేకుండా 86 రోజుల పాటు అక్కడే ఉంచి మూల్యాంకనం జరిపారని ఆరోపించారు. ఎంపికైన 165 మంది అభ్యర్థుల్లో 160 మంది (96.97 శాతం) ఓఎంఆర్ షీట్లలో దిద్దుబాట్లు జరిగాయని, మొత్తం 736 మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలిస్తే 97.55 శాతం షీట్లలో దిద్దుబాట్లు కనిపించాయని సిట్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. ఫోరెన్సిక్ పరీక్షల్లో వైట్నర్ వాడకం, సంతకాలు సరిపోకపోవడం, ఒకే పేపర్‌లో రెండు రకాల ఇంక్‌వాడటం, చీఫ్ ఎగ్జామినర్ సంతకాలలో తేడాలు వంటి అనేక అక్రమాలు తేలాయని వివరించారు. ఇవి కేవలం సాంకేతిక తప్పిదాలు కావని, మెరిట్ ఉన్న అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకున్న చెలగాటమని మంత్రి మండిపడ్డారు. ఈ అక్రమాలన్నింటికీ జగనే ప్రధాన బాధ్యుడని, యువతను, కోర్టులను తప్పుదారి పట్టించిన ఆయనకు రాజకీయాల్లో కొనసాగే నైతిక అర్హత లేదని డోలా అన్నారు. తమ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 20లక్షల ఉద్యోగాల హామీలో భాగంగా, అత్యంత పారదర్శకంగా మెరిట్ ప్రాతిపదికన 16వేల డీఎస్సీ ఉద్యో గాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. వైసీపీ నేతలు 240కి పైగా కేసులు వేసినా, చట్టబ ద్ధంగా అన్నింటినీ అధిగమించి డీఎస్సీని పూర్తిచేశామన్నారు. పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నవారు, ముందుగా సిట్ నివేదికలో తేలినతమ అక్రమాలపై సమా ధానం చెప్పాలని సవాల్ విసిరారు. తెలుగుదేశం ప్రభుత్వం యువతకు న్యాయం చేస్తూ ముందుకు సాగుతుందని, గతంలో జరిగిన అక్రమా లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఎస్సీ కార్పొరేషన్ అధికారిక వెబ్ సైట్ ప్రారంభం

**విజయవాడ, ఆగస్టు 13,ప్ర,ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్సి కార్పొరేషన్ అధికారిక వెబ్ సైట్ ని ఉపయోగించుకొని అర్హులైన వారు ఆయా సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు. గురువారం తాడేపల్లిలోని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సి కార్పొరేషన్ అధికారిక వెబ్సైట్ ప్రారంభించారు. ఈ వెబ్ సైట్ లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు బ్యాంకింగ్, సంక్షేమ పథకాలకు సంబంధించిన పూర్తి సమాచారం పొందుపరిచారు. పథకాలకు సంబంధించిన అర్హతలు, రుణ పరిమితి, సబ్సిడీ వంటి వివరాలతో పాటు ఆయా పథకాలకు సులభతరంగా ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా వెబ్సైట్ రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఎస్సీలకు విద్య, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధితో పాటు వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎస్సి కార్పొరేషన్ వెబ్సైట్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు బ్యాంకింగ్, సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు విశాఖ, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా ఒక్కో కేంద్రంలో 50 మంది చొప్పున ఇంగ్లీషు భాషలో ప్రావీణ్యం కోసం ఉచిత శిక్షణ అందించి వారికి ఇజ్రాయెల్ దేశంలో ఉపాధి కల్పిస్తామన్నారు. దీని కోసం ఈ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు విశాఖ, గుం టూరు, తిరుపతి కేంద్రాలుగా జర్మన్ లాంగ్వేజ్ లో ఉచిత శిక్షణ ఇప్పించి జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. నిరుద్యోగ ఎస్సీ యువతకు వివిధ రంగాలలో నైపుణ్య శిక్షణ అందించి వారికి ఉపాధి కల్పిస్తామని మంత్రి తెలిపారు. ఔత్సాహికులు ఈ వెబ్ సైట్ ని ఉపయోగించుకొని ఆయా పథకాలకు దర ఖాస్తు చేసుకోవాలని మంత్రిడోలా శ్రీబాల వీరాంజనేయస్వామి కోరారు.ఈ కార్యక్రమంలో మాదిగ, మాల కార్పొరేషన్ చైర్మన్లు ఉండవల్లి శ్రీదేవి, పెదపూడి విజయ్‌కుమార్, సాంఘిక సం క్షేమశాఖ కార్యదర్శి ఎం.ఎం నాయక్, ఎస్సి కార్పొరేషన్ జనరల్ మేనేజర్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ఎక్సైజ్ పాలసీపై కసరత్తు .. సెప్టెంబర్ 30తో ముగినయున్న గడువు

**విజయవాడ, ఆగస్టు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రస్తుత ఎక్సైజ్ పాలసీ గడువు సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో, తదుపరి రిటైల్ ఎక్సైజ్ పాలసీ రూపకల్పనపై మంత్రుల బృందం గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో సమావేశమై విస్తృతంగా చర్చించింది. గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆన్‌లైన్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో పాటు ఎక్సైజ్ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. 2024-26 రిటైల్ ఎక్సైజ్ పాలసీ అమలు ద్వారా జూలై 2026 వరకు వచ్చిన ఫలితాలపై అధికారులు మంత్రుల బృందానికి సమగ్రంగా వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న పాలసీ సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో, ఆ తర్వాత అమలు చేయాల్సిన కొత్త రిటైల్ ఎక్సైజ్ పాలసీకి సంబంధించి రూపొందించిన వివిధ నమూనాలను కూడా సమావేశంలో అధికారులు మంత్రుల బృందం ముందు ఉంచారు. కొత్త పాలసీ రూపకల్పన కోసం వివిధ వర్గాల నుంచి అందిన సూచనలు, అభిప్రాయాలను కూడా వివరించారు. ప్రతిపా దించిన వివిధ నమూనాలపై మంత్రుల బృందం సుదీర్ఘంగా చర్చించింది.


అందుబాటులో ఉన్న సమాచారం, గణాంకాలను పరిశీలించిన అనం తరం ప్రతిపాదిత నమూనాలను మరింతగా సవరించి, సంబంధితపూర్తి వివరాలు, ఆధారిత గణాంకాలతో మరోసారి సమర్పించాలని అధికారులను మంత్రుల బృందం ఆదేశించింది. ప్రస్తుత ఎక్సైజ్ పాలసీ పనితీరు, ఇప్పటివరకు వచ్చిన ఫలితాలు, వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్ 30 తర్వాత అమలు చేయాల్సిన కొత్త రిటైల్ ఎక్సైజ్ పాలసీని రూపొందించే ప్రక్రియలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించారు.

# పలువురు జిల్లా జడ్జీల బదలీ

## ఎపి జుడీషియల్ అకాడెమీ డైరెక్టర్‌గా వైవిఎస్‌బిజి పార్థసారధి

**విజయవాడ, ఆగస్టు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా పలువురు జిల్లా జడ్జిలను హైకోర్టు బదిలీ చేసింది. మరోవైపు హైకోర్టులో పలు నియామకాలు చేపట్టింది. విశాఖపట్నం జిల్లా పిడిజెగా సేవలు అందిస్తున్న చిన్నశెట్టి రాజు హైకోర్టు రిజిస్ట్రార్(అడ్మినిస్ట్రేషన్)గా నియమితులయ్యారు. రాజు ఈ పోస్టులో బాధ్యతలు స్వీకరించాక కొత్తగా మంజూరైన రిజిస్ట్రార్(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. నెల్లూరు జిల్లా పిడిజె జి.శ్రీనివాస్ విశాఖ జిల్లా పిడిజెగా నియమితులయ్యారు. శ్రీనివాస్ విశాఖ పిడిజెగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎపి వ్యాట్ అప్పిలేట్ ట్రెబ్యునల్ ఛైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. కడప జిల్లా పిడిజెగా పనిచేస్తున్న డాక్టర్ సి.యామిని కృష్ణా జిల్లా(మచిలీపట్నం) పిడిజెగా బదలీ అయ్యారు. చిత్తూరు జిల్లా తిరుపతి కుటుంబ న్యాయస్థానం, అయిదో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జి.రామ గోపాల్ కడప జిల్లా పిడిజెగా నియమితులయ్యారు. తిరుపతిలోని ఎర్రచందన స్మగ్లింగ్ కేసులను విచారించే ప్రత్యేక కోర్టు న్యాయాధికారి ఎ.నరసింహమూర్తి నెల్లూరు పిడిజెగా నియమితులయ్యారు. హైకోర్టులో రిజిస్ట్రార్(అడ్మినిస్ట్రేషన్)గా సేవలు అందిస్తున్న విఎస్ఎస్ శ్రీనివాస శర్మ కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని మొదటి అదనపు జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. హైకోర్టు రిజిస్ట్రార్(విజిలెన్స్) శ్రీనివాస శివరాం బుధవారం ఈ మేరకు నోటిఫికేషన్ జారీచేశారు. ఈనెల 19లోగా కొత్త స్థానాల్లో బాధ్యతలు తీసుకోవాలని కోరారు. ఇక హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్(ఆర్‌జి)గా పనిచేస్తున్న వైవిఎస్‌బిజి పార్థసారధి ఎపి జుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి(పిడిజె)గా పనిచేస్తున్న గుత్తాల గోపి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా నియమితులయ్యారు.

# సైనికుల సంక్షేమానికి రూ.3 లక్షల విరాళం



**విశాఖపట్నం, ఆగస్టు 13, ప్రభాతవార్త:** దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు అండగా నిలుస్తూ రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ తన సేవాభావాన్ని చాటుకున్నారు. ఎంపీగా అందుకున్న తొలి నెల జీతంరూ.3లక్షలను అమరవీరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం విరాళంగా అందిం చారు.ఈ మేరకు విరాళం చెక్కును కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్వయంగా అందజేశారు.

పంజాబ్ నేషనల్ బ్యాంకు punjab national bank ...the name you can BANK upon!
సాధారణ సేవల పరిపాలన విభాగం – జోనల్ ఆఫీస్
6-1-73, 2వ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీ-కా-పూల్, హైదరాబాద్-500004.
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లలో ఆర్కిటెక్చరల్ సేవలు అందించు ఆర్కిటెక్ట్‌లు/సంస్థల ఎంప్యానెల్‌మెంట్ ప్రకటన
"ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలలో వివిధ విభాగాలలో ఆర్కిటెక్చరల్ సేవలను అందించే ఆర్కిటెక్ట్‌లు / సంస్థల ఎంప్యానెల్‌మెంట్ కోసం దరఖాస్తులను" పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆహ్వానిస్తోంది. దరఖాస్తుల డౌన్‌లోడ్ ప్రారంభం: తేదీ 14.08.2026 ఉదయం 10:00 గంటల నుండి. దరఖాస్తుల డౌన్‌లోడ్ మరియు సమర్పణకు చివరి తేదీ: 27.08.2026 సాయంత్రం 17:00 గంటల వరకు. ప్రీ-క్వాలిఫికేషన్ దరఖాస్తు పత్రాన్ని మా వెబ్‌సైట్ www.pnbindia.in/Tender.aspx నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. బ్యాంక్‌లో ప్రస్తుతం ఎంప్యానెల్ అయి ఉన్న ఆర్కిటెక్ట్‌లు / ఆర్కిటెక్చరల్ సేవల సంస్థలు కూడా ఈ ప్రస్తుత ఎంప్యానెల్‌మెంట్ ప్రక్రియలో తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
పూర్తిగా భర్తీ చేసిన దరఖాస్తు ఫారమ్‌ను అవసరమైన అన్ని పత్రాలతో కలిపి పంజాబ్ నేషనల్ బ్యాంక్, GSAD, జోనల్ ఆఫీస్, 6-1-73, రెండవ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 500004 చిరునామాలో సమర్పించాలి. పైన పేర్కొన్న ప్రీ-క్వాలిఫికేషన్ పత్రానికి సంబంధించి ఏవైనా సవరణలు (Corrigendum) లేదా స్పష్టీకరణలు ఉంటే కేవలం పైన తెలిపిన వెబ్‌సైట్‌లో మాత్రమే విడుదల చేయబడతాయి. కావున వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా చూడగలరు.
చీఫ్ మేనేజర్

AU SMALL FINANCE BANK
నమోదిత కార్యాలయం: 19-A ధులేశ్వర్ గార్డెన్, జైపూర్, రాజస్థాన్, ఇండియా, 302001. www.au.bank.in
బంగారంపై రుణం-"ఏది ఎక్కడ ఎలా ఉన్నవీ అక్కడ అలా" ప్రాతిపదికపై వేలం ప్రకటన
AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ("బ్యాంక్") నుండి బంగారంపై రుణ సౌకర్యాలు పొందిన క్రింద పేర్కొన్న వారిని రుణగ్రహీత/లు వారి రుణ బకాయి మొత్తాలను చెల్లించవలసినదిగా నోటీసులు జారీ చేయడమైనది. రుణ గ్రహీత/లు అతని/వారి బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున అందులో నిర్దేశించబడిన పద్ధతి ప్రకారం క్రింద పేర్కొనబడిన శాఖలలో 14 సెప్టెంబర్ 2026న ఉ.11.00 మ.3.00 (సమయం) మధ్య తాకట్టు పెట్టిన బంగారు ఐటమ్‌లు/వస్తువులు యొక్క వేలం మేము బహిరంగ వర్గాల నిర్వహించబోతోంది. దివంగతులైన రుణగ్రహీతల విషయమై వారి చట్టబద్ధమైన వారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి. పై వేలం నిర్వహించడం ఒకవేళ విఫలమైతే బ్యాంక్ ముందస్తుగా తెలియపరచవలసిన అవసరం లేకుండానే మరొక వేలం నిర్వహించటానికి దానికి హక్కు రిజర్వ్ అయినదని దయచేసి గమనించవలసినదిగా ఇందుమూలముగా తెలియజేస్తున్నాము.
భౌతిక వేలం శాఖ వివరాలు
యెమ్మిగనూరు -L25660001817382 L25660001956519 L26660000895548 L25660001875881 L26660000794778 L25660001980233 L25660001891780 L25660001911485 L25660001897189 । నరసన్నపేట - L25660001820865 L25660001813609 L25660001988918 । కనిగిరి -L90010901575442743 L90010901575446112 L25660001879794 L26660000919026 పొన్నూరు L25660002016912 తాడిపత్రి -L25660001943904 L25660001936947 L25660001813419 L25660002148313 L25660001990214 L25660002013977 L25660002017040 L25660002013447 । సుజాత నగర్ ఒంగోలు -L26660000907328 L25660001966000 L25660001888696 । గుంటూరు -L26660000613131 L26660000286995 । ఆళ్లగడ్డ - L25660000708915 । గిద్దలూరు -L25660002039888 L25660002030965 L25660001959164 L25660002100314 L25660001831535 L25660002100524 L25660001925418 । రమణయ్యపేట కాకినాడ L25660001927795 L25660001900705 L25660001971250 । మచిలీపట్నం L26660000826120 L25660001813179 L26660000886056 । కాకినాడ L26660000792872 L25660001806263 L25660001897779 । నందికొట్కూరు L25660001932355 L25660001821644 । గుంతకల్ - L25660001830686 దేవరపల్లి - L26660000901909 L25660001840287 L90010901585296639 । బొబ్బిలి -L26660000799969 L25660001842184 L25660001892768 L25660001910876 । రేపల్లె -L26660000811628 L25660001953735 మార్కాపూర్ -L25660000687552 L25660001848763 L25660001995495 పెద్దాపురం - L25660001972148 L25660001907943 L25660002035715 L25660001961569 L25660001958275 । గాయత్రి నగర్ విజయవాడ - L90010920538102779 L26660000676831 । కడప -L25660001913461 L25660002039248 L25660002025475 । నరసరావుపేట - L25660001969905 L25660001895413 L25660001803958 L25660001997771 । ఆత్మకూరు -L25660001842984 L25660002011361 L25660001871048 L25660001934691 । CB రోడ్ చిత్తూరు -L25660001923962 L25660002035285 L25660002034607 L25660001882587 L25660002023728 L25660002025935 । కర్నూలు -L25660001961049 L25660001812061 । జంగారెడ్డిగూడెం -L25660001985864 L25660002028789 L26660000778609 L25660001843412 L25660002029317 L25660002038680 । అద్దంకి -L25660001961239 L25660001960971 L25660001821184 L25660001948605 । Ctm రోడ్ మదనపల్లి L26660000904604 L25660002038270 L26660000795536 । తిరువూరు L25660001856357 L25660001862835 । Rc రోడ్ తిరుపతి -L26660000528701 L25660001871718 L25660001863924 L25660001401085 L25660001871988 L25660001812421 L25660001812371 । మురళీ నగర్-విశాఖపట్నం L25660001837754 L26660000513359 L25660002183175 L25660001856807 । రాజమండ్రి -L25660001913961 । అనకాపల్లి - L25660000724204 । కొవ్వూరు L26660000662087 L26660000842309 L26660000898153 । నంద్యాల -L25660002023428 L26660000748146 । అమలాపురం -L25660001901244 । ఏలూరు -L26660000860835 L25660001235956 L26660000784767 L26660000860575 నందిగామ L25660002028079 L25660002290814 L26660000388933 । పిడుగురాళ్ల L25660001810255 । వినుకొండ -L25660002287580 L25660002287070 । నాయుడుపేట - L25660001929491 L25660000959931 । చీరాల -L25660002007729 L26660000674705 L25660001938654 । గూడూరు-L25660002032041 । పాలకొల్లు -L25660001848633
గమనిక: 1. ఒకవేళ భౌతికంగా వేలం విఫలమైతే వెబ్‌లింక్ - https://gold.samil.in ఉపయోగించటం ద్వారా ఇ-వేలం నిర్వహించవచ్చును.
2. ఒకవేళ ప్రతిపాదించబడిన వేలం విఫలమైతే తర్వాతి వేలం కొరకు ఈ నోటీసును ముందస్తు-ప్రకటనగా దయచేసి పరిగణించవలెను.
3. వేలం యొక్క ప్రారంభానికి ముందు అందుబాటులో ఏర్పాటు చేసిన బిడ్ ఫారమ్‌లోని రూల్ అయిన నియమాలు మరియు నిబంధనలకు లోబడి వేలం ఉంటుంది.
సం/- మేనేజర్, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

14-8pg4:14-8pg4.qxd 8/13/2026 11:23 PM Page 1



వార్త


మన కష్టసుఖాలకు తరచూ కారణమయ్యేది మన మాట తీరే.

న-షేక్‌స్పియర్

# రాజకీయ గ్రహణంలో దేవుళ్లు!

భారతీయ సంస్కృతికి మారుపేరుగా, భక్తి విశ్వాసాలకు నిలయాలుగా ఒకనాడు ప్రజాదరణ పొంది, దేదీప్యమానంగా వెలుగొందిన దేవాలయాలు రానురాను దీనావస్థకు చేరుకుంటున్నాయి. అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్నట్లు వేలాది కోట్ల రూపాయల ఆస్తిపాస్తులున్నా నిత్యపూజలకు నోచుకోలేక, కనీసం దీపంపెట్టే దిక్కులేక, కళావిహీనంగా ఎన్నో ఆలయాలు జీర్ణావస్థకు చేరుకుంటుండడం ఆందోళన కలిగిస్తున్నది. రాజకీయ అవసరాల కోసం దేవుడిని, దేవాలయాలను, దైవభక్తిని దుర్వినియోగం చేసే దుష్టసంప్రదాయం ఆరంభమైనప్పటి నుంచి దేవాలయ వ్యవస్థ పతనం ఆరంభమైందని చెప్పొచ్చు. పవిత్రమైన హిందూదేవాలయ వ్యవస్థలో రాజకీయ జోక్యం పెరుగుతున్న కొద్దీ దేవుళ్లకు, భక్తులకు కష్టాలు పెరుగుతున్నాయి. ఎవరు ఎంత అరచి గీపెట్టినా, ఎన్ని హెచ్చరికలు చేసినా, దేవుళ్ల ఆస్తుల దుర్వినియోగం నివారించలేకపోతున్నారు. ఒర్లి, ఒర్లి వారుపోతారు, వండక తిని మనం పోతాం అన్నట్లుగా ఉంది పరిస్థితి. గతంలో ఎన్నో విదేశీ దాడులు ఎదుర్కొని మరెన్నో ఆటు పోట్లు తట్టుకున్న దేవుళ్లు ఇప్పుడు స్వజనుల దోపిడీలను, దుర్మార్గాలను నియంత్రించలేపోతున్నారేమోననిపిస్తున్నది. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు ముప్ఫైఆరువేలకు పైగా దేవాలయాలు ఉంటే అందులో నాలుగోవంతు దేవుళ్ల నిత్యపూజలు అందుకోలేకపోతున్నారు. ఆస్తులు స్వాహా చేయడమే కాదు, వందలాది సంవత్సరాల చరిత్ర కలిగిన అపురూప శిల్పకళాఖండాలున్న దేవాలయ ప్రాంగణాల నుంచి విగ్రహాలను పెకిలించుకుపోతున్నారు. గుప్తనిధుల కోసం నిరాటంకంగా తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ ముఠాలు అప్పుడప్పుడు పోలీసులకు పట్టుబడినా అంతంత మాత్రం చర్యలు తీసుకొని చేతులు దులుపుకుంటున్నారు. ఇక దేవుళ్ల ఆస్తులు అన్యాక్రాంతమైపోయాయి, పోతున్నాయి. తెలంగాణ రాష్ట్రం వరకు తీసుకున్నా రికార్డుల ప్రకారం దాదాపు తొంభైవేల ఎకరాలకుపైగా భూములు దేవుళ్లకు ఉన్నాయి. ఇందులో పదివేల ఎకరాలకుపైగా అన్యాక్రాంతమైనట్లు సమాచారం. అసలు దేవుళ్ల మాన్యాలను గుర్తించడం కష్టసాధ్యంగా మారిపోయింది. దేవాలయాల్లో నిత్యపూజ కైంకర్యాల నిర్వహణ, అర్చకుల జీవనోపాధి కోసం నిజాం, కాకతీయ ప్రభువుల నుంచి సామాన్య భక్తుల వరకు పెద్దమొత్తంలో భూములను విరాళంగా ఇచ్చారు. ఇప్పటికీ వాటి వివరాలు అస్తవ్యస్తంగానే ఉన్నాయి. మరికొన్ని భూములకు సంబంధించి వివిధ స్థాయిలో న్యాయస్థానాల్లో వివాదాల్లో కొనసాగుతున్నాయి. ఇంకొకపక్క ఆక్రమించుకునేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఇంత జరుగుతున్నాదేవుళ్ల ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన దేవాదాయ శాఖ కానీ, పాలకులు కానీ అంతగా పట్టించుకోకపోవడం దురదృష్టకరం. జీతభత్యాలపై ఉన్న శ్రద్ధ దేవుళ్ల ఆస్తులపై ఉండడం లేదు. అసలు దేవాలయాల భూములు ఎన్ని? భవనాలు ఎన్ని? ఎవరు ఆధీనంలో ఉన్నాయి? వాటిపై రావాల్సిన ఆదాయం ఎంత? ఎంత వస్తున్నది? తదితర వివరాలు దేవాదాయ శాఖ వద్ద స్పష్టంగా లేవనే చెప్పొచ్చు.కొన్ని తెలిసినా రకరకాల కారణాలతో నోరు విప్పరు. గతంలో ఈ భూములకు రికార్డులు ఎంతో పకడ్బందీగా నిర్వహించేవారు. ఆదాయం, ఖర్చులు ఇతర వివరాలన్నీ నోట్ చేయడమేకాక జమాబంధి రూపంలో తనిఖీలు కూడా నిర్వహించేవారు.ఇప్పుడు రికార్డులు ఏమైనారాస్తున్నారేమోకానీ అవి ఏ మేరకు వాస్తవమో ప్రశ్నార్థకమే. దేవాదాయ భూములకు సంబంధించి నిజాం కాలంలో ఒక నిర్దిష్టమైన పద్ధతుల్లో నమోదు అయ్యేవి. హైదరాబాద్ రెగ్యులేషన్ కింద 1349 ఫస్లీ నుంచి తెలంగాణలో మొత్తం దేవాలయ భూములు వాటిపై వస్తున్న ఆదాయం పరిశీలించేవారు. ఆదాయ ఖర్చులకు సంబంధించి వివరాలు నమోదు చేసేవారు. ఆర్డిఒ స్థాయి అధికారితో పరిశీలన కూడా జరిగేది. దేవునిసొమ్ము ఏమాత్రం భోం చేసినట్లు తేలినా శిక్షలు తీవ్రంగా ఉండేవి. అప్పటి వరకు అమలులో ఉన్న మద్రాస్ యాక్ట్‌ను ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం కూడా కొనసాగించారు. 1966లో 17/66 చట్టం ద్వారా తెలంగాణ,ఆంధ్ర దేవాదాయ శాఖలను కలిపివేశారు. అప్పటివరకు అంతో ఇంతో రికార్డులు ఉండేవి. రానురాను భూములు అన్యాక్రాంతం కావడం, ఆక్రమణలు పెరిగిపోవడం వల్ల పరిస్థితి అదుపు తప్పింది. హైదరాబాద్ నడిబొడ్డులో అత్యంత విలువైన వందలాది ఎకరాలకుపైగా భూమిని తొంభైతొమ్మిది సంవత్సరాలకు ఒక కంపెనీకి నామమాత్రపు లీజుకు ఇచ్చారు. అయితే ఆ కంపెనీ ఒప్పందాలు ఉల్లంఘించి ఏకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించడంతో ప్రజలు పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో న్యాయస్థానం దృష్టికి దేవాదాయ శాఖ తీసుకువెళ్లింది. సుప్రీంకోర్టువరకు నడిచిన ఈ కేసు లో భూమి దేవాదాయశాఖ పరమైంది. అయితే ఇప్పుడు భూమిపై కొందరు పెద్దలు కన్నేసినట్లు ఆరోపణలు వస్తు న్నాయి. ఇక్కడ అక్కడ అని కాదు ఎక్కడ వీలైతే అక్కడ భూములను ఆక్రమించుకునేందుకు నిత్యం ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. భక్తులు సమర్పించుకునే కాను కులపై కూడా అక్రమార్కుల కన్ను పడి పక్కదారి మళ్లీ స్తున్న సంఘటనలు కూడా తరచుగా జరుగుతున్నాయి. ఇక దేవుళ్ల హుండీలకు కూడా కన్నాలు పడుతున్నాయి. ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న తిరుమల తిరుపతి వెంకన్న కూడా అవినీతిపరుల నుంచి తప్పించుకోలేకపో తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ నిర్వాకం చూసి తాము భక్తితో సమర్పించుకుంటున్న కానుకలు సద్వినియోగం కావడం లేదని ప్రజలు విశ్వసిస్తే పరిస్థితి ఎటువైపు దారితీస్తుందో పాలకులు ఒక్కసారి విజ్ఞతతో ఆలోచించాలి.

ప్రతిభావంతుడు సముద్రపు గట్టులాంటి వాడు, అలల వంటి సమస్యలకు వెనుతిరిగిపోడు.



టి.ఎడిసన్

ప్రస్తుతమున్న అవకాశాన్ని వాడుకోలేని వారు, ఎన్ని అవకాశాలిచ్చినా ఏమీ చేయలేరు.



జార్జి ఇలియెట్

# ఆ లక్షల ఓట్లు ఎటుపోయాయి?

***ఓటరు జాబితా ఎంత చిన్నదైందన్నది విజయానికి కొలమానం కాదు. అర్హత లేని ఒక్క పేరు కూడా లేకుండా, అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరుకూడా మిస్‌కాకుండా ఉండే జాబితానే నిజమైన, శుద్ధమైన ఓటరు జాబితా. ఈ నెల 17న వెలువడే డ్రాఫ్ట్ జాబితా నుంచి అక్టోబర్ 19న వచ్చే తుది జాబితా వరకు ప్రతి దశలో ఈ సూత్రాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగం పైనే కాకుండా ప్రతి పౌరుడిపైనా ఉంది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల రోజు క్యూలో నిలబడటం మాత్రమే పౌరుడి బాధ్యత కాదు. తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో చూసుకోవడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. 73లక్షల పేర్లు బయటపడుతున్నాయన్న వార్తల నేపథ్యంలో ప్రతి ఓటరూ అప్రమత్తం కావాలి. ఒకసారి పేరు తొలగిపోయిన తర్వాత ఎన్నికల సమయంలో ఆందోళన చెందడం కంటే, డ్రాఫ్ట్ జాబితా వచ్చినప్పుడే తన హక్కును నిర్ధారించుకోవడం మంచిది. ఎందుకంటే ఓటు కేవలం ఒక గుర్తింపు కాదు. అది ప్రజాస్వామ్యంలో పౌరుడి స్వరం. ఆ స్వరం జాబితాలో ఉండాలి.***

తిప్పర్తి శ్రీనివాస్

తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్( సర్) ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశం.అయితే తాజాగా వెలువడుతున్న గణాంకాలు మాత్రం రాజకీయ వర్గాల్లోనే కాకుండా సామాన్య ప్రజల్లోనూ తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 73 లక్షల ఓట్లు జాబితా నుంచి బయటపడినట్లు తెలుస్తుండటం సాధారణ పరిణామంగా కొట్టిపారేయలేని అంశం.ముఖ్యంగా గ్రామీణప్రాంతాల్లో స్పందన ఎక్కువగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లో తక్కువగా ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా ఎనిమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, పరిశీలన, డిజిటైజేషన్ వంటి అనేక దశలు కొనసాగాయి. దాదాపు 47రోజులపాటు ఎనిమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ సాగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రక్రియలో ఓటర్ల నుంచి వచ్చిన వివరాలను ప్రస్తుత ఓటరు జాబితాలతో సరిపోల్చడం, ఒకే వ్యక్తి పేర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఉన్నాయా, మరణించిన వారి పేర్లు కొనసాగుతున్నాయా, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు ఉన్నాయా వంటి అంశాలను పరిశీలించడం జరిగింది. జిల్లాల వారీగా చూస్తే యాదాద్రి భువనగిరి జిల్లా అత్యధికంగా 94.30 శాతం స్థాయిలో ఎనిమరేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. మరోవైపు హైదరాబాద్ జిల్లా చివరి స్థానంలో 58.58 శాతంతో నిలిచినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గడం ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. పల్లెల్లో ప్రజలు ఎనిమరేషన్ ప్రక్రియపై ఎక్కువగా స్పందించగా, పట్టణాల్లో ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం ఇందుకు ఒక కారణంగా కనిపిస్తోంది. అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. జాబితా నుంచి తొలగించబడుతున్న వారిలో నిజంగా అర్హతలేని వారెంతమంది? వాస్తవంగా అర్హులైనప్పటికీ తమ వివరాలు సమర్పించలేకపోయిన వారు ఎంతమంది? ఈ రెండు అంశాల మధ్య తేడాను స్పష్టంగా గుర్తించడం అత్యంత కీలకం. ఓటర్ల జాబితాను శుద్ధి చేయడం ప్రజాస్వామ్యానికి అవసరమే. కానీ శుద్ధి పేరుతో ఒక్క అర్హుడి ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకూడదు. ప్రత్యేకించి హైదరాబాద్ వంటి మహానగరాల్లో సమస్య మరింత సంక్లిష్టంగా ఉంటుంది. ఉపాధి, విద్య, ఉద్యోగాల కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రజలు తరచూ వలస వెళ్తుంటారు. అద్దె ఇళ్లలో నివసించే వారి సంఖ్య ఎక్కువ. ఒకే కుటుంబంలోని కొందరు ఒక నగరంలో, మరికొందరు మరో ప్రాంతంలో ఉండే పరిస్థితి కూడా ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో చిరునామా మార్పు, తాత్కాలిక వలస, శాశ్వత వలస మధ్య తేడాను గుర్తించడం అధికారులకు పెద్ద సవాలే. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం కుటుంబాలు, స్థానిక సంబంధాలు, స్థిర నివాసాలు స్పష్టంగా ఉండటంతో ఎనిమరేషన్ ప్రక్రియ సులభంగాసాగి ఉండవచ్చు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు పనులకు వెళ్లిపోవడం, అద్దె ఇళ్లలో మార్పులు, అవగాహన లోపం, ఫారాలు అందకపోవడం లేదా సమర్పించకపోవడం వంటి కారణాలు ప్రభావం చూపి ఉండవచ్చు. అందువల్ల గ్రామాల్లో అధిక స్పందన, పట్టణాల్లో తక్కువ స్పందనను కేవలం ప్రజల



నిర్లక్ష్యంగా చూడటం సరైనది కాదు. ఇక సుమారు 73 లక్షల ఓట్లు జాబితా నుంచి బయటపడుతున్నాయన్నఅంశం అత్యంత సున్నితమైనది. ఓటర్ల జాబితా నుంచి తొలగించ బడిన ప్రతి పేరు వెనుక ఒక వ్యక్తి ఉంటాడు. ఆ వ్యక్తి ఒక కుటుంబ సభ్యుడు. ఒక ఓటు అంటే కేవలం ఒక సంఖ్య కాదు, అది రాజ్యాంగం కల్పించిన రాజకీయ హక్కు. ఎన్ని కల సమయంలో ఆ హక్కును వినియోగించే అవకాశం కోల్పోతే, దాని ప్రభావం వ్యక్తిపైనే కాకుండా మొత్తం ప్రజా స్వామ్య ప్రక్రియపై పడుతుంది. అందుకే ఈ ప్రక్రియలో పారదర్శకత అత్యంత అవసరం. ఈనెల 17న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల కానున్న నేపథ్యంలో ప్రజలకు తమ పేర్లు జాబితాలో ఉన్నాయా లేదా అన్నది తెలుసుకునే అవకాశం కల్పించాలి. పేరులేకపోతే అభ్యంతరం లేదా క్లెయిమ్ దాఖ లు చేసుకునే విధానం గురించి విస్తృత ప్రచారం చేయాలి. గ్రామాల్లోనే కాకుండా పట్టణాలు, అపార్ట్‌మెంట్ సముదాయాలు, బస్తీలు, వలస కార్మికులు నివసించే ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అంతే కాదు, డ్రాఫ్ట్ జాబితాలో పేరు తొలగించబడిన ప్రతి ఓటరుకు సాధ్యమైనంతవరకు కారణాన్ని స్పష్టంగా తెలియజేయడం అవసరం. ఒకవ్యక్తి మరణించాడని భావించి పేరు తొలగిస్తే, దానికి ఆధారం ఏమిటో ఉండాలి. వేరే ప్రాంతానికి శాశ్వతంగా మారిపోయాడని భావిస్తే, ఆ నిర్ధారణ ఎలా జరిగిందో వెల్లడించాలి. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్నట్లు గుర్తిస్తే, సరైన చిరునామా ఏదో నిర్ధారించుకున్న తర్వాతే చర్య తీసుకోవాలి. ఎన్నికల సంఘం, జిల్లా యంత్రాంగం, బూత్ స్థాయి అధికారులు ఈ విషయంలో కీలక పాత్ర పోషించాలి. రాజకీయ పార్టీలు కూడా కేవలంతమకు అనుకూలంగా ఉన్న పేర్లు మాత్రమే కాపాడాలని కాకుండా, అర్హులైన ప్రతి ఓటరి హక్కును కాపాడేందుకు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. ఓటర్ల జాబితా శుద్ధి రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా జరగాల్సిన ప్రక్రియ.అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా వెలువడనుండటంతో ఇప్పుడు అందరి దృష్టి ఆ జాబితాపైనే ఉంది. డ్రాఫ్ట్ జాబితా నుంచి తుది జాబితా వరకు వచ్చేకాలం అత్యంత కీలకం.ఈ మధ్యలో వచ్చే అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, సవరణలను అధికారులు నిష్పక్షపాతంగా పరిశీలించాలి. తుది జాబితా తయారయ్యే ముందు ప్రతి అర్హుడి ఓటుహక్కు రక్షించబడిందా లేదా అన్నదే ప్రధాన ప్రమాణంగా ఉండాలి. ఓటర్ల జాబితా లో అక్రమంగా చేర్చిన పేర్లను తొలగించడం ఎంత ముఖ్య మో, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడడం అంతకంటే ముఖ్యం. దొంగ ఓట్లను తొలగించాలనే ఉద్దేశం తో నిజమైన ఓటర్లను కూడా జాబితా నుంచి తొలగిస్తే అది శుద్ధి కాదు హక్కుల హరణం అవుతుంది. అదే సమయంలో నకిలీ, డూప్లికేట్, మరణించిన,శాశ్వతంగా వలస వెళ్లిన వ్యక్తుల పేర్లు కొనసాగితే అది కూడా ప్రజాస్వామ్యానికి ప్రమాదమే. కాబట్టి సర్‌ను అనుమానంతో చూడాల్సిన అవసరం లేదు. కానీ గుడ్డిగా స్వాగతించాల్సిన అవసరమూ లేదు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే ప్రక్రియగా మారాలి. దానికి ప్రజల భాగస్వామ్యం, అధికారుల నిష్పక్షపాత వైఖరి, రాజకీయ పార్టీల బాధ్యతాయుత సహకారం ఈ మూడు తప్పనిసరి. చివరికి ఓటరు జాబితా ఎంత చిన్నదైందన్నది విజయానికి కొలమానం కాదు. అర్హత లేని ఒక్క పేరు కూడా లేకుండా, అర్హతఉన్న ఒక్క ఓటరు పేరు కూడా మిస్ కాకుండా ఉండే జాబితానే నిజమైన శుద్ధమైన ఓటరు జాబితా.ఈ నెల 17న వెలువడే డ్రాఫ్ట్ జాబితా నుంచి అక్టోబర్ 19న వచ్చే తుది జాబితా వరకు ప్రతి దశలో ఈ సూత్రాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపైనే కాకుండా ప్రతి పౌరుడిపైనా ఉంది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల రోజుక్యూలో నిలబడటం మాత్రమే పౌరుడి బాధ్యత కాదు. తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో చూసుకోవడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. 73 లక్షల పేర్లు బయటపడుతున్నాయన్న వార్తల నేపథ్యంలో ప్రతి ఓటరూ అప్రమత్తం కావాలి. ఒకసారిపేరు తొలగిపోయిన తర్వాత ఎన్నికల సమయంలో ఆందోళన చెందడం కంటే, డ్రాఫ్ట్ జాబితా వచ్చినప్పుడే తన హక్కును నిర్ధారించుకోవడం మంచిది. ఎందుకంటే ఓటు కేవలం ఒక

# అపోహాలతోనే... మూఢ విశ్వాసాలు!

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ఆధునిక సాంకేతిక యుగంలో సమాంతరంగా మానవ జీవన విధానాల్లో ఆధ్యాత్మిక చింతనతో పాటు అనాదిగా వస్తున్న అనేక విశ్వాసాల గురించి వాస్తవికతను తెలుసుకునేందుకు అధిక అవకాశం నేటిసమాజంలో గోచరిస్తూ ఉంటుంది. తరచుగా విభిన్న ఆచార వ్యవహారాలకు సంబంధించిన దేవాలయాలకు వెళ్లి కొందరు సంకల్ప పూజలు చేసినట్టుగా వార్తలు రావడం కూడా వింటుంటాం.అది నిజమేనా కాదా అనే అంశాలను పక్కన పెడితే ఈకాలంలో కూడా అనాదిగా వస్తున్న నమ్మకాలతో జనాలు దైనందిన జీవితంలో ఇలాంటి అంశాలపై ఆసక్తిని పెంచుకోవడం సహజమే.అయినా సమాజంలో ఎవరినమ్మకాలు విశ్వాసాలు వారివి.అయితే ఇటీవల తెలంగాణరాష్ట్రంలో ఏకంగా క్షుద్రపూజల అంశమే చర్చ కొనసాగుతుంది. అది కూడా మామూలు జనాల మధ్య జరిగిన అంశాలు కాకుండా క్షుద్ర పూజలు మంత్ర తంత్రాలు విషయమైప్రజానాయకులు చర్చించుకుంటున్న విధానం విస్తృతంగా సమాజంలో వినిపిస్తుంది.మానవ జీవన సరళిలో మూఢవిశ్వాసాలుగా చెప్పబడుతున్న చేతబడులు అంటే క్షుద్రపూజలు, మంత్ర తంత్రాలు లాంటిఅనేక రకాలైనటువంటి విశ్వాసాలు ఇప్పటికీ ఇంకా ఆధునిక నాగరిక జీవన విధానాలతో కలిసిపోయి ఉన్నాయంటే అతిశయోక్తి కాదేమో. ఎక్కడైనా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు ప్రజలకు సహజంగా ఈ అంశాలపై ఆసక్తి బాగాఉంటుంది. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో క్షుద్రపూజలు మంత్రతంత్రాలు అంటే చేతబడి లాంటి అంశాలపై విపరీతమైన విశ్వాసాలు గోచరిస్తూ ఉంటాయి.ఇలాంటి విషయాల్లోఅనేక గ్రామాల్లో కొందరు క్షుద్రపూజలు చేస్తున్నారనే అనుమానాలతో అలాంటి వ్యక్తులపై హింసాత్మకదాడులు తరచుగా జరుగుతూనే ఉన్నాయి. వాస్తవంగా క్షుద్రపూజలు చేతబడులునేటి ఆధునిక జీవనవిధానాల్లో నమ్మదగినవి కాకపోయినా మానవ జీవన పురోగతిలో ఇలాంటి అంశాలు మానవుని బలహీనమైన మనసులకు మరింత ఆందోళన కలిగిస్తుంటాయి. అయితే సమస్యలు వచ్చినప్పుడు దానికి పరిష్కారం దొరకనప్పుడు ఏదో అతీత శక్తి ఉందని దానికి కారణమైన క్షుద్రశక్తులు ఉంటాయని నమ్మేవారు కూడా ఇప్పటికిఉన్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది. అందుకు ఎవరో ఒకరు ఇలాంటి క్షుద్ర పూజలతో చేతబడి చేస్తున్నారని ఇతరుల నష్టాన్ని కోరుకుంటారని అందుకే క్షుద్ర పూజలు చేయడం వలన ఏదో జరిగిపోతుంది అనేదిసామాన్య జనాల్లో ఉన్నప్పటికీ, కొందరు నాయకుల్లోకూడా ఇలాంటి చర్చకొనసాగుతూ వస్తుండడం గమనార్హం. ఏదిఏమైనప్పటికీ బలహీనమైన మనసు కలిగినవారికి క్షుద్రపూజలు మంత్రతంత్రాలు లాంటి అంశాలు ఎంతో కొంత ఆసక్తిని కలిగిస్తుంటాయి. నమ్మకమైన జీవితం ధృడవిశ్వాసం కలిగినటువంటిమనసు కలిగిన మానవులకు ఇలాంటివాటిపై ఆసక్తి తక్కువే.సమాజంలో కొంతమందిలో ఉండే లేనిపోని అపోహల వలన ఇలాంటి విభిన్నమైన అంశాలు తెరపైకివస్తుంటాయి. నిజానికి ఆధునికంగా పరిణితి చెందుతున్న సమాజంలోమానవ జీవనప్రస్థానంలో విభిన్నవైవిధ్యాలు కలిగిన మానవుల మధ్య జరుగుతున్న అనేక విషయాలపై వాస్తవిక దృష్టితో నిర్దిష్టమైన ఆధారాలతో సరైన దృక్పథం ఉండాలే కానీ మూఢ విశ్వాసాలపై చర్చ అవసరం లేదనిపిస్తుంది. ●

# ప్రజావాక్కు



## యుద్ధాలతో జిడిపి పతనం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఇరాన్ అణు సామర్థ్యం పూర్తిగా నిర్వీర్యమయ్యే వరకు సైనిక చర్యలు కొనసాగుతాయని ప్రకటించడం మధ్యప్రాచ్యాన్ని మరోసారి ఉద్రిక్తతల కేంద్రంగా మార్చింది. ఇది కేవలం రెండు దేశాల మధ్యయుద్ధం మాత్రమేకాదు, ప్రపంచఇంధన భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపుతున్న అంతర్జాతీయ సంక్షోభం. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు ఐదో వంతు హోర్ముజ్ జలసంధి గుండా సాగుతుంది. ఘర్షణ తీవ్రతతో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 65-68 డాలర్ల నుంచి 80-82 డాలర్లకు పెరిగింది. దీంతో రవాణా, విద్యుత్ ఉత్పత్తి, ఎరువులు, పెట్రోరసాయనాలు, విమానయాన రంగాల్లో వ్యయభారం పెరిగి ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు మళ్లీ అధికమవుతున్నాయి.పరిస్థితులు మరింత దిగజారితే ఈ నష్టం 3.5 ట్రిలియన్ డాలర్లకు చేరే ప్రమాదం ఉంది.

- హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## మద్యం దుకాణాలను ఎత్తివేయాలి

తమిళనాడుప్రభుత్వం ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను తొలగించేందుకు తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది. ఇటువంటి చర్యలు విద్యార్థులకు, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో దోహదపడతాయి. ఆధ్యాత్మిక కేంద్రాల పవిత్రతను, విద్యాలయాల గౌరవాన్ని కాపాడే ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించి అమలు చేస్తే సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటు అందుతుంది. సమాజంలో సానుకూల ఆలోచనలు, మంచి విలువలు,ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని ప్రోత్సహించేందుకు కూడా ఇది దోహదపడుతుంది.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

## అధికారులకు లంచాలు ఇవ్వొద్దు

ప్రభుత్వ ఆఫీసులలో మనభూమి,ఆదాయం,కులం ఇంకా ఏవైనా తదితర సర్టిఫికేట్లకు మీ సేవ నిర్వాహకులకు గానీ ప్రభుత్వ అధికారులకు గానీ ఎక్కడ కూడా అదనపు రుసుం చెల్లించరాదు.అలాంటి అధికారులు ఎవరైనా డబ్బులు అడిగితే పై అధికారులకు ఫిర్యాదు చేయండి తప్ప డబ్బులు ఇవ్వరాదు. ఒకసారి లంచం ఇవ్వడం మొదలుపెడితే అందరూ లంచగొండులు తయారవుతారు. అప్రమత్తంగా ఉండండి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## చట్టపరిధిలోనందరినీ రెగ్యులర్ చేయాలి

కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ రెగ్యులరైజేషన్ కొరకు గత ప్రభుత్వం యాక్ట్ 30 జి.ఓ.114 ద్వారా 2023లో చట్టం చేసి కొన్ని శాఖల ఉద్యోగులను రెగ్యులర్ చేసాక, ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్తగా కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాల తరువాత మరల రెగ్యులర్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. కాంట్రాక్ట్ వ్యవస్థలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ఇతర శాఖలకంటే కాంట్రాక్ట్ లెక్చరర్స్ ఎక్కువగా ఉన్నారు.రెగ్యులర్ ప్రక్రియలో భాగంగా వీరి సర్టిఫికేట్స్ వెరిఫికేషన్ కూడా ఆనాడే జరిగి నిధి పోర్టల్ ద్వారా కేటగిరీల విభజనతో ఇంటర్ కమీషనర్ గారికి దిగువస్థాయి అధికారులు అప్‌లోడ్ చేశారు. కేటగిరీల విభజనలో జె.డి. ఆఫీస్ సిబ్బంది అవకతవకలకు పాల్పడి ఓవరేజ్ వారివి పంపించి నోవరేజ్ కాని వారివి ఓవరేజ్‌లో ఉంచేసినట్లు ఆరోపణలున్నాయి. పైఅధికారులు పరిశీలించవలసి ఉంది.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## ఇజ్రాయెల్‌కి పెనుశాపం

అమెరికా మీద సౌదీ, పాకిస్థాన్, ఈజిప్ట్,టార్కీ వంటి దేశాలు నమ్మకం కోల్పోయాయా అంటేఅవుననే సమాధానమే వస్తుంది. సౌదీ రక్షణ రంగ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నప్పటికీ పాకిస్థాన్ దేశంలో అణుబాంబు ఉన్నప్పటికీ టర్కీ నాటో సభ్యత్వం ఉన్నప్పటికీ తన భయం అంత నాటో సహాయం అందిస్తుందా అని ఊగిసలాటలో ఉన్నది. ఇంకా పశ్చిమఆసియా సంక్షోభం అంత ఈఅపనమ్మకం కలిగించడానికి కారణం అయింది. అయితే ఈపరిస్థితి అంతా ఇజ్రాయల్‌కి పెను శాపం అవుతుంది. వెస్ట్ బ్యాంకులో ఉన్న అసాధారణ పరిస్థితి అంత ఇజ్రాయల్ మెడకు చుట్టుకుంటున్నది.

- భారత అవినాష్, జనగామ

## గ్రామాలలో జంతుబలిని నిషేధించాలి

గ్రామాలలో వీధులలో జంతు బలిని నిషేధించాలి. వర్షాకాలంలో జంతువులను వధించడం వలన జంతువు కళేబరాలు,వ్యర్థపదార్థాలను,రక్తం, మాంసం,ఎముకలు, కసరు, వంటి పదార్థాలు ముురుగు వాసనతో అంటూ రోగాలు వస్తున్నాయి. జంతువులు బలిచేసే వారు ఆర్థికంగా లాభం పడుతున్నారు. కానీ చుట్టూ ప్రక్కల ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారు. కనుక తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య, హెల్త్ డిపార్ట్మెంట్, స్థానిక గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో జంతు బలిని నిషేధం చేయాలి.

- కె. శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్


మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ప్రశ్నించే గొంతుకగా 'బొద్దింకల్ల ఉద్యమం



మేకిరి దామోదర్

యువతను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తును కోల్పోయి నట్టే. వారి ఆశలకు దిశ చూపితే దేశ భవిష్యత్తుకు బాట వేసినట్టే!' అనే మాట అక్షరాలా నిజమవుతున్న సమ యం ఇది. దేశ జనాభాలో యువత వాటా గణనీయంగా ఉన్న మనదేశం లో వారి చేతిలో ఓటుమాత్రమే కాదు ప్రశ్నించేశక్తి, డిజిటల్ వేదికలు,సామాజిక చైతన్యం కూడా ఉన్నాయి. ఒకప్పుడు రాజకీయ పార్టీల పిలుపుతో ఉద్యమా లు జరిగేవి. ఇప్పుడు సమస్య తమ జీవితాల్ని చిన్నాభిన్నం చేయడంతో ఆవేదన చెందిన యువతే ప్రజా స్వామ్య పద్ధతిలో రాజ్యాంగ బద్ధంగా, రాజ్యాంగాన్ని చేబూని స్వయంగా ఉద్యమానికి శ్రీకారం చుడుతోంది. ప్రజాస్వామ్య పాలనలో రాజకీయాల్లో తప్పులు చేస్తే వాటి దుష్ఫలితాలు లక్షల,కోట్ల మంది అనుభవించాల్సి వస్తుంది. పాలన ప్రజల ఇష్టాయిష్టాలపై సాగాలి కానీ అధికార రాజ కీయ ఆధిపత్యం కోసం పాలన చేయకూడదు. ప్రజాపాలన లో అన్నిసామాజిక స్థాయిల్లోని ప్రజలు సమ్మిళిత అభివృద్ధి సాధించాలి. అలాకాకపోతే, అది ప్రజాస్వామ్యం అనబడదు. నిరంతరం అప్రమత్తంగా ఉంటేనే స్వేచ్ఛను కాపాడుకోగలు గుతాం. మనదేశంలో ఇటీవల పరీక్షల నిర్వహణా లోపాలు, ప్రశ్నపత్రాల లీకులు, ఫలితాల్లో జాప్యం, ఉద్యోగ నియామకాల ఆలస్యం వంటిఅంశాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఉద్యోగార్థుల్లో పెరుగుతున్న అసంతృప్తి ఉద్యమానికి నిదర్శనం. 2026లో పరీక్షా సంస్కరణలను డిమాండ్ చేస్తూజరిగిన యువత ఉద్యమాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పరీక్షా వ్యవస్థను సమూలంగా సంస్కరించేందుకు 'నందన్ నీలేకణి' నేతృత్వంలో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది.పరీక్షల్లో పారదర్శకత, విశ్వసనీయత, సాంకేతిక వినియోగం పెంచ డమే లక్ష్యమని,లీకుల అక్రమాలకు పాల్పడే వారిపై 2026 సవరణలు చేసిన చట్టంలో శిక్షలు కఠినతరం చేశామని ప్రధాని ప్రకటించారు. ఈ నేపథ్యంలో 'ఆగస్టు 15న ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి చేసే స్వాతంత్ర్య దినోత్సవ' ప్రసంగంపై యువతతో పాటు దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల్లో, రాజకీయపార్టీల్లో ఆసక్తి నెలకొంది.ఉపాధి, ఉద్యోగ నియామకాలు, పరీక్షా సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధి, దేశ సమగ్రాభివృద్ధికి తోడ్పడే అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ఉంటుందా? లేక సాధారణ హామీలకే పరిమిత మవుతుందా? అన్నదే ఇప్పుడు కీలకంగా మారుతోంది.దేశ యువతకు విద్య పూర్త యిన వెంటనే ఎదురయ్యే అతిపెద్ద ప్రశ్న తర్వాత ఏంటి?' అన్నదే. చదువుకున్నా ఉద్యోగం దొరకడం కష్టమ వడం, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్లతరబడి ఎదురుచూడాల్సి రావడం, నోటిఫికేషన్లపరీక్షలుఫలితాల మధ్య అంతులేని జాప్యం యువతలో అసహనాన్ని పెంచుతున్నాయి. అందు లోనూ ప్రశ్నపత్రాల లీకులు జరిగితే కష్టపడి చదివిన విద్యార్థి నమ్మకం ఒక్కసారిగా కుప్పకూలుతుంది. పరీక్ష రద్దయితే డబ్బు,సమయం, శ్రమ మాత్రమేకాదు. యువత భవిష్యత్ ప్రణాళిక కూడా




దెబ్బతింటుంది.అందుకే చదివితే ఉద్యోగం వస్తుందనే నమ్మకం' కంటే ముందు న్యాయంగా పరీక్ష రాస్తే నా ప్రతిభకు గుర్తింపు లభిస్తుందనే నమ్మకం' కలగాలి. ఈ నేపథ్యంలో కేంద్రం పరీక్షల్లో అక్ర మాలకు అడ్డుకట్ట వేయడానికి చట్టపరమైన వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో 2026 చట్టం సవరణలో పరీక్ష ప్రక్రియలో మోసాలకు, అక్రమాలకు లీకులకు పాల్ప డితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, కనీసం రూ. ఒక కోటి జరి మానా విధించే కఠిన నిబంధనను చేర్చారు. అయితే చట్టాలు చేయడం ఒక్కటే సరిపోదు.వాటి అమలు పకడ్బం దీగా ఉండాలి. పరీక్షా నిర్వహణలో ప్రతి దశలో జవాబుదారీతనం, సాంకేతిక భద్రత, స్వతంత్ర పర్యవేక్షణ, వేగవంతమైన దర్యాప్తు ఉండాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు కాకుండా..సమస్య తలెత్తక ముందే నివారణ చర్యలు తీసుకోవాలి. పరీక్షల క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించడం, ఖాళీలను నిరంతరం భర్తీ చేయడం,ఫలితాలను నిర్ణీత గడువులో విడుదల చేయడం, అభ్యర్థుల ఫిర్యాదులకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయడం వంటి చర్యలు అత్యవసరం. ఇప్పటి జెన్‌జెడ్ యువత రాజకీయాలను కేవలం సభలు, ర్యాలీలు, పోస్టర్లు, ప్రసంగాల ద్వారా మాత్రమే చూడడం లేదు. సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ద్వారా సమాచారం తెలుసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నిస్తున్నారు. తమ సమస్యలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకువస్తున్నారు. 2026లో విద్యార్థి ఉద్యమాలు కేవలం పరీక్షా సమస్యకే పరిమితం కాకుండా యువతలోని విస్తృత అసంతృప్తికి ప్రతిబింబంగా మారాయి. నిరుద్యోగం, పరీక్షా పారదర్శకత, విద్యా అవకాశాలు, భవిష్యత్ భద్రత వంటి అంశాలు రాజకీయ చర్చలోకి బలంగా వచ్చాయి. ప్రతిపక్ష పార్టీలు కూడా పేపర్ లీకులు, నిరుద్యోగం, ఉద్యోగార్థుల సమస్యలను ప్రధాన రాజకీయ అంశాలుగా ప్రయత్నిస్తున్నాయి. ఇక్కడే రాజకీయ పార్టీలకు అసలు పరీక్ష మొదలవుతుంది. యువతను కేవలం ఎన్నికల సమయంలో ఓటర్లుగా చూడకుండా, పాలనలో భాగస్వాములుగా చూడాలి. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. స్వాతంత్ర్యం అంటే కేవలం విదేశీ పాలన నుంచి విముక్తికాదు. ప్రతి యువకుడికి తన ప్రతిభకు తగిన అవకాశం లభించడం, ప్రతి విద్యార్థికి న్యాయమైన పరీక్షావ్యవస్థ ఉండడం, ప్రతి ఉద్యోగార్థికి పారదర్శక నియామక ప్రక్రియ అందుబాటులో ఉండడం కూడా స్వాతంత్ర్యానికి అర్థాన్ని ఇస్తాయి. అందువల్ల ఈసారి స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో యువతకు స్పష్టమైన దిశానిర్దేశం అవసరం. ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలపై పారదర్శక సమాచారం, నియామకాలకు నిర్దిష్ట క్యాలెండర్, పరీక్షా సంస్కరణలకు కాలపరిమితి, పేపర్ లీకులపై కఠినచర్యలు, నైపుణ్యాభివృద్ధికి మెరుగైన అవకాశాలు, అప్రెంటి షిప్‌ల విస్తరణ, పరిశ్రమలకు అనుగుణ మైన విద్యా విధానం రావాలి. తదితర అంశాలపై ఆచర ణాత్మక, స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. అదే సమ యంలో దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ఒత్తిళ్లు ఉన్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి వినిపించే ప్రతి మాటకు యువత, దేశ ప్రజలు చెవులు కొరుక్కుని ఎదురుచూస్తోంది. ఆ మాటల్లో ఉద్యోగానికి భరోసా, పరీక్షలకు పారదర్శకత, నియామకాలకు కాలపరిమితి, పాలనలో జవాబుదారీతనం కనిపిస్తేనే యువత, ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుంది. లేకపోతే హామీలకు అమలుకు మధ్య పెరుగుతున్న అంతరం రాజకీయ అసంతృప్తికి ఆజ్యం పోసే ప్రమాదం ఉంది.అంతేకాదు భారత రాజకీయ సమీకరణాలు కూడా మారనున్నాయి!. యువతను కేవలం ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాల కాలం ముగుస్తోంది. తమ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే తరంఆవిర్భవిస్తోంది.

14-8Pg5:14-8Pg5.qxd 8/13/2026 11:25 PM Page 1



# 'వందేమాతరం' ఆలాపనతో పార్లమెంటు ఉభయసభలు నిరవధిక వాయిదా



**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** ప్రతిపక్షాల తీవ్ర నిరసనలు, ఆందోళనల నడుమ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం వందేమాతర గీతాలాపన అనంతరం లోక్‌సభను స్పీకర్ నిరవధికంగా వాయిదా వేశారు. చివరి రోజు సమావేశాలకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరయ్యారు. దాదాపు 18 నుంచి 19 రోజుల పాటు సాగిన ఈ సమావేశాలు ఎలాంటి అర్థవంతమైన చర్చలు లేకుండా, ప్రతిరోజూ వాయిదాలకే పరిమితం కావడం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సహా సభ్యులంతా సభలో ఉండగా ఆరు చరణాల జాతీయ గీతాన్ని ఆలపించారు. వందేమాతరం ఆలాపన పూర్తయ్యాక లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. రాజ్యసభ కూడా జాతీయ గేయంతోనే సమావేశాలను ముగించింది. పార్లమెంట్ చరిత్రలో కొత్త అధ్యాయం నమోదైంది. వందేమాతరానికి చట్టబద్ధ రక్షణ కల్పించిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. వర్షాకాల సమావేశాల్లో సభ లోపల, వెలుపల అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్రస్థాయిలో నిరసనలు చోటుచేసుకున్నాయి. ప్రతిపక్షాల తీరుపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన 30 యేళ్ల పార్లమెంటరీ జీవితంలో ఇంత బాధ్యతా రాహిత్యమైన ప్రతిపక్షాన్ని ఎప్పుడూ చూడలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు దేశంలోని తీవ్రమైన సమస్యలపై చర్చించకుండా ప్లకార్డులతో నినాదాలు చేస్తూ పారిపోతున్నాయని ఆరోపించారు. నీట్ పరీక్షలు, విద్యార్థుల ఆందోళన వంటి కీలక విషయాలపై చర్చకు ప్రభుత్వం వెంటనే సిద్ధంగా ఉందని, స్వయంగా హోం మంత్రి అమిత్ షా సమాధానాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా ప్రతిపక్షం వెనకడుగు వేస్తోందని స్పష్టం చేశారు. మరోవైపు పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద ఇండియా కూటమి ఎంపీలు నిరసనలు చేపట్టారు. గతనెల 20న విద్యార్థులపై జరిగిన చర్యలతో పాటు రామమందిర విరాళాల వ్యవహారంపై హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. చివరి రోజున కూడా హోం మంత్రికి వ్యతిరేకంగా విపక్షాల ప్రచారం కొనసాగగా, ఎన్డీయే, ప్రతిపక్షాలు పోటాపోటీగా నినాదాలు చేసుకోవడంతో పార్లమెంట్ ఆవరణ ఉద్రిక్తంగా మారింది.

## ఖర్గే ప్రసంగించిన వేదిక శుద్ధిచేయడంపై రాజ్యసభలో రభస

**ఖర్గే సభావేదిక శుద్ధిచేయడంపై రాజ్యసభలో రభస...**

ఇదిలా ఉండగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన ప్రదేశంలో శుద్ధీకరణ పేరుతో హోమం చేయడం రాజకీయ దుమారం రేపింది. ఈఅంశం గురువారం రాజ్యసభను కుదిపేసింది. ఖర్గే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు. రాజ్యసభలో ఖర్గే మాట్లాడుతూ తన సభకు లక్షలాది మంది హాజరయ్యారని చెప్పారు. తాను ఏ మతం లేదా వర్గం గురించి మాట్లాడలేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే మాట్లాడానని తెలిపారు. అయినా తన ప్రసంగం తర్వాత వేదికకు శుద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎస్‌సిఎస్టీ కేసునమోదుచేసి విచారణచేయాలని డిమాండ్‌చేసారు. ఇది ప్రజా స్వామ్య పద్ధతేనా రాజ్యాంగాన్ని ఎలా కాపాడుతున్నారని నిలదీశారు. ఈ ఘటనను ఖండించిన రాజ్యసభ ఛైర్మన్ అంటరానితనం కంటే పెద్ద పాపం మరొకటి లేదని వ్యాఖ్యానించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖర్గే దళితుడు కావడంతోనే శుద్ధి చేశారని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్ గోదియాల్ ఆరోపించారు. బిజెపి రాష్ట్ర నేత ఖజన్ దాస్ స్పందించారు. ఖర్గే సభలో చేసిన కొన్ని నినాదాలు సనాతన వర్గాల మనోభావాలను దెబ్బతీశాయని చెప్పారు. రామ్‌లీలా మైదానం మత పరమైన ప్రాధాన్యం ఉన్న ప్రాంతమని తెలిపారు. శుద్ధి కార్యక్రమంతో బిజెపికి సంబంధం లేదని ఎన్డీయే పక్షనేత కేంద్రమంత్రి జెపినడ్డా స్పష్టం చేశారు. ఘటనపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. బిజెపి ఇలాంటి చర్యలను సమర్థించదని స్పష్టం చేశారు.



# ఎర్రకోట పేలుళ్లు ఆల్‌ఖైదా పనే

## ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో 2025 నవంబర్‌లో జరిగిన పేలుడికి అల్‌ఖైదా అనుబంధ సంస్థ అల్‌ఖైదా ఇన్ ద ఇండియన్ సబ్‌కాంటినెంట్ కారణమని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అధికారికంగా పేర్కొంది. ఈనెల 10న విడుదలైన యూఎన్‌ఎస్సీ విశ్లేషణాత్మక సహాయ, ఆంక్షల పర్యవేక్షణ బృందం తన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. గత యేడాది నవంబర్ 10న రాత్రి 7 గంటల సమయంలో ఎర్రకోట సమీపంలో కదులుతున్న హ్యుందాయ్ ఐ20 కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. కారును ఉమర్‌ఎనబీ నడిపినట్లు దర్యాప్తులో గుర్తించారు. అతడే ఆత్మాహుతి దాడికి పాల్పడి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ దాడిని తొలుత పాకిస్థాన్ కేంద్రంగా ఉన్న జైష్‌ఎమొహమ్మద్ అయి ఉంటుందని అనుమానించారు. ఓ సభ్య దేశం కూడా వరుస దాడులతో పాటు రెడ్‌ఫోర్ట్ పేలుడికి జెఇఎం కారణమని పేర్కొన్నట్లు యూఎన్‌ఎస్సీ నివేదిక తెలిపింది. తాజాగా ఎక్యూఐఎస్‌కు అధికారికంగా ఆపాదించడం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది. 2014లో ఏర్పాటైన ఎక్యూఐఎస్ భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో అల్‌ఖైదా కార్యకలాపాలను విస్తరించేందుకు ఏర్పడిన ప్రాంతీయ అనుబంధ సంస్థ. పెద్ద ముఠాల కంటే చిన్న చిన్న చెదురుమదురు సెల్‌లుగా పనిచేస్తూ లాజిస్టిక్స్, ఆర్థిక నెట్‌వర్క్‌లను అభివృద్ధి చేసుకుంటోందని యూఎన్ ఎస్సీ నివేదిక పేర్కొంది. అల్‌ఖైదా, ఐఎస్‌ఐఎస్ అనుబంధ సంస్థల సామర్థ్యాలపై కూడా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. రసాయన, జీవ ఆయుధాలపై ఆసక్తి ఉన్నప్పటికీ వాటిని తయారు చేయడంలో సాంకేతిక సవాళ్లు ఇప్పటికీ ఉన్నాయని తెలిపింది.

# ప్రిరైడ్ టిప్స్ తక్షణమే తొలగించాలి

## కేంద్రం ఆదేశాలు



**న్యూఢిల్లీ,ఆ గస్టు 13:** ఉబర్, ఓలా, ర్యాపిడో లాంటి రైడ్ హెయిలింగ్ యాప్స్‌లో ప్రయాణికులు ముందస్తుగా టిప్స్ చెల్లించాల్సిన అవసరం తప్పింది. ఈ ఒరవడికి చెక్ పెడుతూ కేంద్రం తాజాగా ఆదేశాలు జారీచేసింది. ప్రీ రైడ్ టిప్స్ ఆప్షన్‌ను తక్షణం తొలగించాలని రైడ్ హెయిలింగ్ యాప్స్‌కు కేంద్రం స్పష్టంచేసింది. ప్రీ రైడ్ టిప్స్‌తో త్వరగా రైడర్ వచ్చే అవకాశం ఉందన్న భావన కలిగించి ప్రయాణికుల నుంచి అదనపు డబ్బు తీసుకోరాదని కేంద్రం ఆదేశించింది. మోటార్ వెహికిల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఉన్న అడ్వాన్స్ టిప్, చూజ్ యాన్ యాడాన్, క్వికర్ రైడ్ కన్ఫర్మేషన్ వంటి ప్రీరైడ్ టిప్ ఆప్షన్స్‌ను తొలగించాలని కేంద్రం తన ఆదేశాల్లో పేర్కొన్నది. ప్రీరైడ్ టిప్ ఇస్తే డ్రైవర్ తమ అభ్యర్థనను త్వరగా ఆమోదిస్తారన్న భావన యూజర్లలో కలుగుతున్నదని పేర్కొన్నది. ఈ మార్గదర్శకాల ప్రకారం ప్యాసింజర్లు స్వచ్ఛందంగా, అదీ ప్రయాణం ముగిసిన తరువాతే టిప్ చెల్లించాలి. త్వరగా క్యాబ్ బుకింగ్ జరుగుతుందన్న భావనతో టిప్స్ ముందస్తుగా చెల్లించే పరిస్థితి ఉండకూడదు. ఇక ప్యాసింజర్ టిప్ మొత్తం డ్రైవర్‌కే బదిలీ చేయాలి. ఓలా, ఉబర్ వంటి వాహన అగ్రిగేటర్‌లు ఇందులో ఎలాంటి వాటా స్వీకరించకూడదు. గతంలో సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ కూడా ఇదే తరహా ఆదేశాలు జారీచేసింది. త్వరగా రైడ్ బుక్ అవుతుందన్న భావన కలిగించి ప్రయాణికుల నుంచి ముందస్తుగా టిప్స్ వసూలు చేయొద్దని పేర్కొంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఈ తీరుకు శాశ్వతంగా ఫుల్ స్టాప్ పెట్టింది.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసును విచారించాలని అలహాబాద్ కోర్టు సిబిఐ, ఇడిని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఆగస్టు 17వ తేదీన చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం విచారించనున్నది. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ఆస్తులపై సిబిఐ ఇచ్చిన వివరణ పట్ల గతంలో అలహాబాద్ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. విచారణకు చెందిన కొత్త అఫిడవిట్‌ను దాఖలు చేయాలని జూలై 20వ తేదీన లక్నో బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఇడి విచారణ సమయంలో ఆదాయానికి మించిన ఆస్తులకేసులో ఏవైనా డాక్యుమెంట్లు సేకరించారా అనికూడా హైకోర్టు ప్రశ్నించింది. కర్ణాటక నివాసి ఎస్ విఘ్నేశ్ సిసిర్ దాఖలు చేసిన రిట్ పిటీషన్ ఆధారంగా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. రాహుల్ గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉన్నట్లు కూడా గతంలో విఘ్నేశ్ ఓ పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

## సున్సరి ఘర్షణల్లో పాక్ ఐఎస్ఐ హస్తం

**సున్సరి,నేపాల్, ఆగస్టు 13:** భారత్‌కు సరిహద్దున ఉన్న నేపాల్లోని సున్సరి జిల్లాలో జూలై 26న చోటుచేసుకున్న కోమల ఘర్షణల వెనుక పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సున్సరిలోని దేవ్గంజ్ గ్రామీణ పురపాలక పరిధిలోని కప్తాన్గంజ్ ప్రాంతంలో మతపరమైన జెండాలు, ఎక్కువ సౌండ్తో డీజే ప్లే చేయడంపై రెండు వర్గాలమధ్య మొదలైన చిన్నవివాదం తీవ్ర హింసాత్మకంగా మారింది. పరిస్థితి చేయిదాటడంతో భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈహింస ఇతర ప్రాంతాలకూ వ్యాపించడంతో యంత్రాంగం కర్ఫ్యూ విధించాల్సి వచ్చింది.గతనెల31 నాటికి ఈ ఘటనల్లో కనీసం ముగ్గురు మరణించగా, 25 మందికి పైగా గాయపడినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ ఘర్షణలపై నేపాల్ నిఘా సంస్థ ఆ దేశ హోం మంత్రిత్వ శాఖకు సమర్పించిన ప్రాథమిక నివేదికలో విదేశీ మత ప్రచారకుల కార్యకలాపాలు, సరిహద్దు ప్రాంతాల్లోని అనుమానాస్పద నెట్‌వర్క్‌పై సమగ్ర విచారణ జరపాలని సిఫార్సు చేసినట్లు సమాచారం. ఈ నివేదికలో పాకిస్థాన్‌మూలాలున్న మోలానా మహమ్మద్ ఇలియాస్ ఘుమాన్, ఖాట్మండు మసీదుఇమామ్ ముఫ్తీ అబుబకర్ కాస్మీలు సున్సరిలో పర్యటించినట్లు ప్రస్తావించారు. భారత సరిహద్దులోని సున్నితమైన జిల్లాల్లో విదేశీ మత పెద్దలు పర్యటించారని ఆరోపణలు వచ్చినప్పటికీ, వారి సమక్షానికీ ఈ హింసకూ నేరుగా సంబంధం ఉందనే విషయాన్ని అధికారులు అధికారికంగా ధృవీకరించలేదు.

## అకాలిదళ్ అధినేత బాదల్‌పై దాడి



**నాందేడ్, ఆగస్టు 13:** శిరోమణి అకాలీ దళ్ అధినేత, పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై మహారాష్ట్రలోని నాందేడ్‌లో దాడి జరిగింది. గురుద్వారా మాతా సాహిబ్ దర్శనం కోసం కుటుంబ సమేతంగా వెళ్లిన సమయంలో, ఓ నిహంగ్ సిక్కు వ్యక్తి పదునైన ఆయుధంతో ఆయనపై హఠాత్తుగా విరుచుకుపడ్డాడు. అతడు కత్తితో దాడి చేయడంతో సుఖ్‌బీర్ సింగ్ బాదల్ చేతికి గాయాలయ్యాయి. ఆయన రక్షణగా ఉన్న సెక్యూరిటీ సిబ్బందిలో ఒకరికికూడా ఈ ఘటనలో గాయాలైనట్టు తెలుస్తోంది. దాడి జరిగిన వెంటనే జడ్‌ప్లస్ కేటగిరీ భద్రతా సిబ్బంది అప్రమత్తమై నిందితుడిని అడ్డుకున్నారు. అనంతరం గాయపడిన సుఖ్‌బీర్ బాదల్‌ను వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తు న్నారు. దాడికి పాల్పడిన నిహంగ్ సిక్కు వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ వేగవంతం చేశారు.

## ప్యాకేజ్ ఫుడ్‌పై హెచ్చరిక లేబుళ్లు తప్పనిసరి

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** అధిక మొత్తంలో ఉప్పు, చక్కెర, కొవ్వు ఉండే ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల ప్యాకెట్లపై ముందు భాగంలో హెచ్చరిక లేబుళ్లను తప్పనిసరి చేయడంలో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు చేయలేకపోతే, మేమే అమలు చేసేలా చూస్తాం అంటూ గట్టి హెచ్చరిక జారీ చేసింది. ఈ విషయంలో తుది నిర్ణయం తెలియజేయడానికి కేంద్రానికి రెండు వారాల గడువును మంజూరు చేసింది. జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఇది ప్రజల, ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన కీలకమైన అంశమని, కార్పొరేట్ సంస్థల ఒత్తిడికి తలొగ్గి నిర్ణయాలు తీసుకోవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది.

# అధికమొత్తం యుపిఐ లావాదేవీలపై ఎండిఆర్ విధింపు




**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** యుపిఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్‌ను మళ్లీ అమలు చేసే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. అన్ని లావాదేవీలపై కాకుండా అధిక విలువ కలిగిన కొన్ని యుపిఐ చెల్లింపులు లేదా నిర్దిష్ట వ్యాపారులకే ఎండిఆర్ విధించే అవకాశం ఉంది. మరోవైపు ప్రభుత్వ ప్రోత్సాహకాలను దశలవారీగా తగ్గించే టియర్డ్ ఇన్సెంటివ్ విధానాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు ఆర్థిక మంత్రిత్వశాఖ పార్లమెంటరీ కమిటీకి తెలిపింది. యుపిఐ వ్యవస్థను దీర్ఘకాలం స్థిరంగా కొనసాగించడంతో పాటు ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గించేందుకు ఈ రెండు మార్గాలను పరిశీలిస్తున్నట్లు ఆర్థిక సేవల విభాగం వెల్లడించింది. అధిక పరిమితి దాటిన లావాదేవీలు లేదా కొన్ని వర్గాల వ్యాపారులకు ఎండిఆర్ పునరుద్ధరించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం యుపిఐ లావాదేవీలపై ఎండిఆర్ లేదు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు 2020 జనవరి నుంచి కేంద్రం ఈ ఛార్జీని రద్దు చేసింది. అంతకుముందు వ్యాపారుల యూపిఐ లావాదేవీలపై గరిష్ఠంగా 0.30శాతం ఎండీఆర్ ఉండేది. యుపిఐ లావాదేవీలకు ప్రోత్సాహకంగా కేంద్రం రూ. 2వేల కోట్లు కేటాయించింది. అయితే పరిశ్రమ అంచనా ప్రకారం యుపిఐ వ్యవస్థ నిర్వహణకు రూ. 20,700 కోట్ల వరకు ఖర్చవుతోంది. ప్రస్తుత ప్రభుత్వ ప్రోత్సాహకం పరిశ్రమ వాస్తవ ఖర్చులో కేవలం 11 శాతానికే సరిపోతుందని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. పరిహారం తగినంతగా లేకపోతే సైబర్ సెక్యూరిటీ, మోసాల నిరోధం, చెల్లింపు నెట్‌వర్క్ మౌలిక వసతులపై కీలక పెట్టుబడులపై ప్రభావం పడొచ్చని కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. యుపిఐ వినియోగం మరింత భారీగా పెరగనున్నట్లు కమిటీ తెలిపింది. నెలకు 150 బిలియన్ లావాదేవీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మరో 60 కోట్ల మంది కొత్త వినియోగదారులు యుపిఐలో చేరొచ్చని అంచనా వేసింది. పార్లమెంటు ఆమోదించిన పన్నులు, ఇతర చట్టాల సవరణ బిల్లు 2026తో కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలకు ఛార్జీల నుంచి చట్టపరమైన రక్షణ కొనసాగించేలా ప్రభుత్వం మార్గం ఏర్పడింది. యుపిఐపై ఎండిఆర్ విధించేందుకు ప్రభుత్వం ఇప్పటివరకు అనుమతించలేదు.


## రేవణ్ణ మొబైల్‌లో 90కిపైగా నీలిచిత్రాలు



**బెంగళూరు, ఆగస్టు 13:** అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న జెడిఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు చెందిన బ్యారక్‌లో దొరికిన మొబైల్ ఫోన్‌లో భారీగా పోర్న్ కంటెంట్ ఉన్నట్లు సమాచారం. బెంగళూరులోని అగ్రహార కేంద్ర కారాగారంలో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సిసిబి) నిర్వహించిన ఆకస్మిక సోదాల్లో ఈ ఫోన్ బయటపడింది. అందులో సుమారు 80 నుంచి 90 పోర్న్ వీడియోలు ఉన్నట్లు దర్యాప్తు వర్గాలను ఉటంకిస్తూ వార్తలు వెలువడ్డాయి. తక్కువ దుస్తుల్లో ఉన్న మహిళల ఫొటోలకు సంబంధించిన వార్తాపత్రిక కటింగ్స్ కూడా ఫోన్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ ఫోన్‌లో ఎక్కువగా భారతీయ పోర్న్ వీడియోలు ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఫోన్‌ను అధికారులు ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. వీడియోలు ఎప్పుడు డౌన్‌లోడ్ అయ్యాయి ఫోన్‌ను ఎవరు ఉపయోగించారు అందులో మరిన్ని ఫైళ్లు ఉన్నాయా అనే అంశాలను ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలించనున్నారు. సిసిబి అధికారులు జైలులో నాలుగు నుంచి ఐదు గంటల పాటు సోదాలు నిర్వహించారు. హైప్రొఫైల్ ఖైదీల బ్యారక్‌లతో పాటు హై సెక్యూరిటీ జైలులోనూ తనిఖీలు చేశారు. రేవణ్ణ బ్యారక్‌లో మొబైల్ ఫోన్‌తోపాటు పెన్‌డ్రైవ్, ఛార్జర్ కూడా లభించినట్లు జైలు అధికారులు తెలిపారు. ఇతర నిషేధిత వస్తువు లేవీ దొరకలేదని పేర్కొన్నారు. ఫోన్ బయటపడటంతో జైలు అధికారులపై చర్యలు మొదలయ్యాయి. నిషేధిత ఫోన్ జైలులోకి ఎలా చేరింది బ్యారక్‌లోకి ఎలావెళ్లింది అనే అంశాలపై శాఖా పరమైన విచారణకు ఆదేశించారు. ఫోన్‌లోని సిమ్ వినియోగం పైనా అధికారులు దృష్టి పెట్టారు. రేవణ్ణ ఫోన్‌లోని ఎయిర్‌టెల్ సిమ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో యాక్టివేట్ చేసినట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల్లో యాక్టివేట్ చేసిన సిమ్‌లు జైలు సిగ్నల్ జామర్లను తప్పించుకుని పనిచేస్తున్నట్లు ఇటీవల ఫోన్ స్వాధీనం చేసుకున్న ఘటనల్లో గుర్తించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# రూ.10.74 కోట్ల డిజిటల్ అరెస్ట్ మోసం

## సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అరెస్ట్



**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ వృద్ధుడిని మోసం చేసి రూ.10 కోట్లకు పైగా కాజేసిన కేసులో కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌ను పుణే పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని ఛత్రపతి శంభాజీనగర్‌కు చెందిన రోహన్ జాధవ్‌గా గుర్తించారు. పోలీసులు అతని బ్యాంకు ఖాతాలు, ఇతర ఆర్థిక వనరులను స్తంభింపజేయడంతో అతను కోర్టులో లొంగిపోయినట్లు అధికారులు తెలిపారు.ఈ యేడాది జనవరిలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. కొందరు మోసగాళ్లు సిబిఐ అధికారులుగా నటిస్తూ వృద్ధుడిని సంప్రదించారు. ఓ కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారని, డిజిటల్ అరెస్ట్ చేస్తామని బెదిరించారు. చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోవాలంటే వివిధ బ్యాంకు ఖాతాల్లోకి డబ్బు బదిలీ చేయాలని సూచించారు. దీంతో బాధితుడు మొత్తం రూ.10.74 కోట్లు పలు ఖాతాలకు బదిలీ చేశాడు. అనంతరం తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు.కేసు దర్యాప్తులో భాగంగా నిందితుల్లో ఒకరు ఎటిఎం నుంచి డబ్బు ఉపసంహరించుకోవడంతో పోలీసులు అతని ఆచూకీని గుర్తించారు. ఈ క్రమంలో హర్షద్ సుభాష్ ధంతోలే, సమర్థ్ సురేశ్ దేశ్‌ముఖ్, అమర్ శివాజీ అట్టార్గిలను అరెస్ట్ చేశారు.దర్యాప్తులో ధంతోలే కీలక విషయాలు వెల్లడించాడు. తాను ఎటిఎం నుంచి తీసుకున్న డబ్బును రోహన్ జాధవ్‌కు ఇచ్చినట్లు తెలిపాడు. అప్పటికే జాధవ్ పరారీలో ఉన్నాడు. విచారణలో జాధవ్ మోసపూరితంగా పొందిన రూ.10.74 కోట్లను ఏకంగా 5,436 బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించారు.అలాగే జాధవ్‌కు హాంకాంగ్‌లోని కొందరువ్యక్తులతో టెలిగ్రామ్‌యాప్ ద్వారా సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. వారితో తరచూ వీడియో కాల్స్‌లో మాట్లాడేవాడని పోలీసులు తెలిపారు. డిజిటల్ క్రిప్టోకరెన్సీ ద్వారా హాంకాంగ్‌లోని తన నిర్వాహకులతో ఆర్థిక లావాదేవీలు జరిపేవాడని, భారత్ నుంచి విదేశీ కరెన్సీకి డబ్బు బదిలీ చేసినందుకు భారీగా కమీషన్లు పొందేవాడని పోలీసులు పేర్కొన్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గాఉన్న జాధవ్ సెలబ్రిటీ మేనేజ్‌మెంట్ రంగంలోనూ పనిచేసేవాడని అధికారులు తెలిపారు. అతనిపై రెండు కేసులు నమోదయ్యాయి.

# సంక్షిప్త వార్తలు

## నాకు ముప్పుందన్నారు.. అందుకే విమానం మారా: ట్రంప్



**వాషింగ్టన్, ఆగస్టు 13:** గత నెలలో తుర్కియే పర్యటన ముగిశాక తనకు ముప్పుందన్న హెచ్చరికల నేపథ్యంలో ఎయిర్‌ఫోర్స్ వన్ నుంచి గుట్టుచప్పుడు కాకుండా తప్పించుకుని మరో విమానంలో అమెరికా చేరుకున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ వెల్లడించారు. అయితే ఈ బెదిరింపులకు తానేమీ భయపడలేదని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు క్యాటరింగ్ కంటైనర్‌లో దాక్కుని వేరే విమానంలోకి మారి అమెరికాకు ప్రయాణమవడం, అటుపై ఎయిర్‌ఫోర్స్ వన్ విమానాన్ని తప్పుదోవ పట్టించే డెకాయ్‌గా పంపిన ఘటనను ట్రంప్ తేలిగ్గా తీసుకున్నారు. అలాగే ఆ సమయంలో తన అధికారిక విమానంలో ప్రయాణించిన శ్వేతసౌధం అధికారులు, భద్రత-సహాయ సిబ్బంది, విలేకరులకు ఎదురయ్యే ప్రమాదాన్ని తక్కువ చేసి చూపారు. 'నేను వేరే విమానంలో ప్రయాణించాలని వారు కోరుకున్నారు. అక్కడ ఏదో ఓ ముప్పు ఉందని ఊహించా. అయితే దాని గురించి ఆరా తీయలేదు. నాకు చాలా ముప్పులు ఎదురవుతుంటాయి' అని ట్రంప్ ఒహాయోలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని వచ్చిన తర్వాత విలేకరులకు తెలిపారు.

## యుఎస్‌లో 'ఇండియా డే' అధికారిక గుర్తింపు

**వాషింగ్టన్, ఆగస్టు 13:** భారత స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికాలోని అనేక రాష్ట్రాలు ఇండియా డే వేడుకలకు సిద్ధమవుతున్నాయి. ఆగస్టు 15ను ఇండియా డేగా ప్రకటిస్తూ ఇటీవల కాలంలో పలు రాష్ట్రాలు అధికారిక ప్రకటన విడుదల చేశాయి. తాజాగా డెలావేర్ రాష్ట్రం కూడా 'ఇండియా డే'ను అధికారికంగా ప్రకటించింది. అంతకుముందు, న్యూయార్క్, న్యూజెర్సీ, మాసాచుసెట్స్ రాష్ట్రాల ప్రభుత్వాలు ఆగస్టు 15న ఇండియా డేను అధికారికంగా జరుపుకోవాలని నిర్ణయించాయి. రాష్ట్రంలో భారతీయ సంతతి ప్రజల భాగస్వామ్యంతో డెలావేర్ తనకంటూ ప్రత్యేకతను సంతరించుకుందని రాష్ట్ర గవర్నర్ మ్యాథ్యూ మేయర్ తాజాగా తెలిపారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు అనుసరించే ప్రజలు రాష్ట్రాన్ని మరింత బలోపేతం చేశారని వ్యాఖ్యానించారు. భారత సంతతి వారు తమ నైపుణ్యాలు, నాయకత్వం, సేవాతత్పరతో రాష్ట్రాన్ని సుసంపన్నం చేశారని ప్రశంసించారు.

## పాక్‌లో 62 మంది ఉగ్రవాదులు హతం

**ఇస్లామాబాద్, ఆగస్టు 13:** పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా రాష్ట్రంలోని రెండు జిల్లాల్లో 36 గంటలపాటు నిఘా సమాచారం ఆధారంగా జరిపిన వరుస ఆపరేషన్‌లలో 60 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారని భద్రతా అధికారులు తెలిపారు. దేశ వాయువ్య ప్రాంతంలోని ఉత్తర వజీరిస్తాన్, బన్నూ జిల్లాల్లో ఈ ఆపరేషన్లు జరిగాయి. ఉత్తర వజీరిస్తాన్‌లో మంగళవారం ఉదయం నుంచి ప్రారంభించిన ఆపరేషన్లలో నలుగురు కీలక కమాండర్లతో సహా 52 మంది ఉగ్రవాదులు హతమయ్యారని, బన్నూలో జరిగిన పలు ఆపరేషన్‌లలో 10 మంది ఉగ్రవాదులు హతమవ్వగా 16 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఉత్తర వజీరిస్తాన్‌లో ఫిత్నా అల్-ఖవారిజ్ మిలిటెంట్లపై లక్షిత దాడికి ముందు భద్రతా దళాలు అనుమానిత ప్రాంతాలపై నిఘాను కట్టుదిట్టం చేశాయి.

## ఆర్జీకర్ వైద్యురాలి కేసులో టిఎంసి మాజీ ఎమ్మెల్యే అరెస్టు

**కోల్‌కత్తా, ఆగస్టు 13:** ఆర్జీకర్ హత్యాచార బాధితురాలి మృతదేహాన్ని అత్యవసరంగా దహనం చేసిన వ్యవహారంలో టిఎంసి మాజీ ఎమ్మెల్యే నిర్మల్ ఘోష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఒడిశాలో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. సాక్ష్యాలను ధ్వంసం చేయడం, నేరపూరిత కుట్ర, ఒక వ్యక్తిని వారి ఇష్టానికి వ్యతిరేకంగా పని చేసేలా బలవంతం చేయడం వంటి ఆరోపణలపై పానిహతి మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదైనట్లు వెల్లడించారు. 2024 ఆగస్ట్ 9న కోల్‌కతాలోని ఆర్జీకర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో రాత్రి విధుల్లో ఉన్న 31 యేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ అనుమానాస్పదంగా మరణించింది. ఆమెపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసినట్లు వచ్చిన ఆరోపణల కేసుపై సిబిఐ దర్యాప్తు చేస్తున్నది. ప్రధాన నిందితుడికి ట్రయిల్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్షవిధించింది. అయితే ఈ సంఘటన జరిగిన రెండేళ్ల తర్వాత బాధితురాలి తండ్రి తాజాగా సోమవారం ఖర్దాహా పోలీస్ స్టేషన్లో కొత్తగా ఫిర్యాదు చేశారు. తన కుమార్తె మృతదేహాన్ని హడావిడిగా దహనం చేయడంలో బలవంతం చేసిన ముగ్గురిలో టీఎంసీ మాజీ ఎమ్మెల్యే నిర్మల్ ఘోష్ కూడా ఉన్నారని ఆయన ఆరోపించారు. దీంతో పోలీసులు కొత్తగా కేసు నమోదు చేశారు.

14-8Pg6exHMNWJQE:14-8Pg6exHMNWJQE.qxd 8/13/2026 11:16 PM Page 1



## తిరుమల సమాచారం

## బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న ఏడుకొండలు

### సెప్టెంబర్ 8న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### 14న అంకురార్పణ, 15న ధ్వజారోహణం



**తిరుమల,ఆగస్టు 13ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు రానున్న సెప్టెంబర్ 15నుండి జరిపించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధమైంది. ఇప్పటికే తిరుమల ఆలయం వరి సరాలు గ్యాలరీలు నిర్మాణం, తాగునీటి కొళాయిలు, అదనపు మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు మొదలయ్యాయి. నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లే తిరుమలకొండపై ప్రతి రోజూ ఉత్సవాలు, సేవలే. ఏడాదిలో తొమ్మిది దినాలు జరిగే బ్రహ్మోత్సవాలకు దేశవిదేశాల నుండి భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. తొమ్మిదిరోజులు జరిగే దేవదేవుని బ్రహ్మోత్సవాలకు కొండంతా సర్వాంగసుందరంగా ముస్తాబవుతోంది. ఇలవైకుంఠం నుండి కలియుగవైకుంఠానికి సాక్షాత్తు శ్రీమహావిష్ణువు శ్రీవేంకటేశ్వరునిగా అవిర్భవించడం, ఆనాటి నుండి నేటికీ అంగరంగవైభవంగా దేవుని బ్రహ్మోత్సవాలను అకుంఠిత దీక్షతో, భక్తిశ్రద్ధలతో టిటిడి పెద్దలు జరిపిస్తుండడం పరిపాటిగా మారింది. ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబర్‌లో సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలకు తొలిమెట్టుగా ఆలయం శుద్ధి వేడుక(కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం) సెప్టెంబర్ 8వతేదీ మంగళవారం జరగనుంది. ఆ తరువాత వారంరోజులకు 14వతేదీ సోమవారం సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవ ఘట్టాలు మొదలవుతాయి. మరుసటిరోజు సెప్టెంబర్ 15వతేదీ మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో ఉత్సవ వేడుకలు మొదలుకానున్నాయి. శ్రీదేవిభూదేవి ఉభయదేవేరులతో కలిసి మలయప్పస్వామికి మంగళవారం ఉదయం బంగారువాకిలిలో విశేష సమర్పణ చేస్తారు. యాగశాలలో సంప్రదాయ కార్యక్రమాల అనంతరం ఉత్సవర్లతో బాటు అనంత,గరుడ,చక్రత్తాళ్వార్, సేనాధిపతి ధ్వజపటం తిరువీధుల్లో నాలుగుమాఢవీధుల్లో ప్రదక్షిణగా ఊరేగింపు చేస్తారు. సాయంత్రం మీనలగ్నంలో ధ్వజస్తంభంపై గరుడపటాన్ని అధిరోహిస్తారు. ఆ తరువాత రాష్ట్రప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమం అనంతరం పెదశేషవాహనం వాహన సేవలు ఆరంభమవుతాయి. తొలివాహనం మంగళవారం రాత్రి 9గంటలకు వైకుంఠ శ్రీమహావిష్ణువు కలియుగప్రత్యక్షదైవంగా శ్రీనివాసుడు అవతారంలో ఏడుతలల పెద్దశేషవాహనంపై అధిరోహించి ఆలయమాఢ వీధుల్లో ఊరేగుతారు. సెప్టెంబర్ 22వతేదీ రాత్రి అశ్వవాహనసేవవరకు వివిధ వాహనసేవలు ఉదయం,రాత్రి వేళల్లో అత్యంత వైభవంగా జరుగుతాయి. బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు రాత్రి జరిగే గరుడసేవకు సిఎం పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీని 2004 నుంచి బ్రహ్మోత్సవాల ప్రారంభరోజే సమర్పించడం జరుగుతోంది. అనంతరం రంగనాయకుల మండపంలో 2027కు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరిస్తారు. సెప్టెంబర్ 15వతేదీ మంగళవారం తెల్లవారు జామున సుప్రభాతం మినహా మిగిలిన తోమాల,అర్చన ,వారపుసేవలైన కల్యాణోత్సవం,డోలోత్సవం, ఆర్జితబ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలు రద్దుచేశారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు.పూర్తిగా సర్వదర్శనం మాత్రమే అనుమతించనున్నారు. మిగిలిన సేవలన్నీ టిటిడి రద్దు చేసింది.

## 19న ఆన్‌లైన్‌లో నవంబర్ నెల ఆర్జితసేవ టిక్కెట్లు



**తిరుమల,ఆగస్టు 13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న నవంబర్‌నెలకు సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలకు సంబంధించిన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్‌లో 19వ తేదీ బుధవారం ఉదయం 10గంటలకు విడుదల చేస్తుండగా 21వతేదీ వరకు బుక్‌చేసుకునే సదుపాయం ఉంది. ఇక ఆర్జితసేవా కల్యాణం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవల టిక్కెట్లు వర్చువల్ కోటా తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 22వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది.ఇక ఆర్జితసేవల టిక్కెట్లు ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో కొన్నిసేవలు ముందువచ్చిన భక్తులకు ముందు అనే ప్రాతిపదికన భక్తులు నేరుగా బుక్‌చేసుకునే సదుపాయం కల్పించారు. అంగప్రదక్షణ టోకెన్లను 23వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది. రోజువారీగా (శుక్రవారం తప్ప)750 టోకెన్లను ఆన్‌లైన్‌లోనే విడుదల చేస్తున్న విషయం విదితమే. 300రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు కోటా 24వతేదీ ఉదయం 10గంటలకు, వసతి కల్పన అదేరోజు విడుదల చేస్తారు.ఇదిలా ఉండగా శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైన్‌లో 23వతేదీ ఉదయం 11గంటలకు విడుదలచేస్తారు. వృద్ధులు దివ్యాంగులకు సంబంధించిన దర్శనాల కోటాను 23వతేదీ సాయంత్రం 3గంటలకు విడుదలచేస్తోంది.27న శ్రీవారి సేవ కోటా విడుదలవుతుంది. భక్తులు 'టిటిదేవస్థానమ్స్.ఎపి.జివొవి.ఇన్'వెబ్‌సైట్‌ద్వారా బుక్ చేసుకోవాలి.

## జగన్ యాత్రలన్నీ నేరాలు ఘోరాలు చేసే వారినే ఓదార్చడం: మంత్రి సత్యకుమార్

**బొబ్బిలి (విజయనగరం జిల్లా), ఆగస్టు 13 ప్రభాతవార్త:** ప్రతిపక్ష నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఓదార్పు యాత్రలన్నీ నేరాలు ఘోరాలు చేసే తన సొంత పార్టీ వ్యక్తులను కాపాడేందుకే ఈ ఓదార్పు యాత్రలు చేస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ అన్నారు. బొబ్బిలి ఒక ప్రైవేట్ కంటి ఆసుపత్రి ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా బొబ్బిలి కోటలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుని పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఐదు సంవత్సరాలు ప్రభుత్వం వైయస్సార్ సిపి లో పాలన చేసి అప్పట్లో టిడిపికి సరైన సంఖ్యాబలం లేకపోతే అసెంబ్లీకి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకపోవడమే అన్న వ్యక్తి 11 సీట్లకు పరిమితమై ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని అనడం ఈయన అవగాహన లోపంతో ఇలా మాట్లాడడం సరైన పద్ధతి కాదని సత్య కుమార్ అన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే ఇచ్చిన ప్రతిపాదనను మేము అసెంబ్లీలో పెడతామని అయితే వంద పడకల ఆసుపత్రిలేని పి పి పి పద్ధతిలో పెట్టేందుకు ఒక ఆలో చన ఉందని అన్నారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఇక్కడ పెట్టేందుకు నా వంతు కృషి చేస్తానని అన్నారు.

11 మంది ఎమ్మెల్యేలు సంఖ్య ఉన్న ఏనాడూ అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే పాలసీలేదని కేవలం ప్యాలస్ నుంచే పరిపాలన సాగిస్తున్నాడని అన్నారు. 16 వేల మంది డిఎస్సి అభ్యర్థులను అవమానించడమే జగన్ ఎజెండా అని వారంతా చూసి రాతలతో ఉద్యోగాలు సాధించారని చెప్పడం వారి యొక్క మనోభావాలపై వారి చదువుపై వారికి నమ్మకం లేకుండా చేయడమే ప్రతిపక్ష నాయకుడిగా జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణ అన్నారు.

# పలు ప్రారంభోత్సవాలకు తిరుమల ముస్తాబు

### ఆధునీకరించిన మ్యూజియం, అచ్యుతం, శ్రీపథం విశ్రాంతి గృహాలు

### రూ.900 కోట్ల వ్యయంతో పూర్తికావచ్చిన భవనాలు




**తిరుమల,ఆగస్టు 13ప్రభాతవార్తప్రతినిధి:** దేశవిదేశాల నుండి తిరుమలకు వచ్చే భక్తులకు మరింత సౌకర్యవంతంగా వసతి కల్పించేందుకు టిటిడి తిరుపతిలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఆధునీకరించి నిర్మించిన అచ్యుతం,శ్రీపథం విశ్రాంతి భవనాలు పూర్తికావస్తున్నాయి. ఈ భవనాలను దాదాపు 600కోట్ల రూపాయలు అంచనాతో టిటిడి నిర్మించిన విషయం విదితమే. 2023లో అప్పటి వైసిపి ప్రభుత్వంలోని వైసిపి టిటిడి బోర్డు పెద్దలు గతంలో ఉన్న గోవిందరాజస్వామి సత్రాలను పడగొట్టి ఆ స్థానంలో అత్యాధునికంగా 600కోట్ల రూపాయల అంచనాతో ఆధునికంగా విశ్రాంతి భవనాలను నిర్మించింది. 2024లో ప్రభుత్వం మారినా కూటమి ప్రభుత్వం ఈ నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తిచేయించింది. ఈ భవనాలను సెప్టెంబర్ 15వతేదీ సిఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక దాతల సహకారంతో తిరుమలలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఆధునికీకరించిన మ్యూజియం కూడా సిద్ధమైంది. ఈ పనులకు టిసిఎస్ 145కోట్ల రూపాయలు విరాళం అందించింది. స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీ వినియోగించి 3డీ, 7డీ అత్యాధునిక హంగులతో టిసిఎస్ 14, మ్యాప్ సిస్టమ్స్ ఐదు కలిపి మొత్తం 19 గ్యాలరీలను ఏర్పాటు చేశారు. త్రిడి విధానంలో శ్రీవారి ఆలయం దర్శనం తరువాత అంతటి అనుభూతి కలిగించేలా తీర్చిదిద్దిన ఎస్వీ మ్యూజియంను సిఎంప్రారంభించనున్నారు. ఇప్పటికే పూర్తిగా అన్ని నిర్మాణాలను టిటిడి పూర్తిచేసేందుకు సిద్ధమైంది. వేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుపతిలో అచ్యుతం, శ్రీపథం భవనాలు భక్తులకు అందుబాటులోకి రానున్నాయి. తిరుమలలో పలు ముఖ్యమైన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలు సిఎం చేపట్టనున్నారు. టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ వెంకయ్య చౌదరి పర్యవేక్షణలో ఈ పనులు సకాలంలో పూర్తవుతున్నాయి.ఇక తిరుమలలోనే టిటిడి,ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌సంయుక్తంగా కాకులమాను తిప్పవద్ద 12.85 కోట్లరూపాయలతో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మించి ట్రయల్ రన్ నిర్వహిస్తున్నాయి. ఈ ప్లాంట్ నుండి పైప్ లైన్ ద్వారా వకుళమాత అన్నప్రసాద కేంద్రానికి బయోగ్యాస్ పంపుతున్నారు. తిరుమల పాపవినాశనం నూతన రోడ్డును ప్రారంభించనున్నారు. భక్తుల సౌకర్యార్థం 27.5 కోట్ల రూపాయలు విలువైన 25 ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చేందుకు రిలయన్స్ సంస్థ అంగీకరించింది. తిరుమలలో ఒక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. రిలయన్స్ సంస్థ 50 మంది డ్రైవర్లను నియమించి, వారికి జీచభత్యాలు చెల్లించనుంది.ఇతర దాతలు అందించిన ఎలక్ట్రిక్ బస్సులను కూడా ప్రారంభించే అవకాశం ఉంది. తిరుమలలో వెంగమాంబ అన్నప్రసాదం కేంద్రం పక్కనే రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ ఆధ్వర్యంలో 120 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఏఐ ఇంటిగ్రేటెడ్ హైటెక్ కిచెన్ భవనానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీ ప్రారంభించి 310 ఏళ్ల పురస్కరించుకుని టిటిడి ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బంగారు నాణేన్ని తయారు చేయించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ నాణేన్ని విడుదల చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల వేళ ఈ కొత్త సముదాయాలను ప్రారంభించేలా నిర్ణయించారు. తిరుపతిలో అచ్యుతం, శ్రీపథం భవనాలలో గదులు 532 చొప్పున 1,064 ఉన్నాయి. దాదాపుగా పదివేల మంది భక్తులకు వసతి కల్పించే వెసులుబాటు కలగనుంది. తిరుపతిలో వసతి సౌకర్యం పెరిగితే.. భక్తులకు ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు.

## వందమీటర్ల త్రివర్ణ పతాకంతో ప్రదర్శన

### జాతీయతా భావంతో ఉప్పొంగిన పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం



**తిరుపతి,ఆగస్టు 13 ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహి స్తున్న హర్‌ఘర్‌తిరంగా కార్యక్రమాల్లో వందమీటర్ల త్రివర్ణపతాకంతో తిరుపతిలో భారీ ర్యాలీ నిర్వహించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో గురువారం ఈ వంద మీటర్ల పొడవైన జాతీయ పతాక ర్యాలీని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ,ఎన్ఎస్ఎస్ బ్యూరో సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ఈ ర్యాలీలో విశ్వవిద్యాలయానికి చెందిన అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు అత్యంత ఉత్సాహంతో పాల్గొని దేశభక్తిని, జాతీయ సమైక్యతను, దేశం పట్ల తమ బాధ్యతను చాటుకున్నారు. వంద మీటర్ల త్రివర్ణ పతాకంతో సాగిన ర్యాలీ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో దేశభక్తి, ఐక్యత, భావా లను వెల్లివిరిసేలా చేసింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమా ప్రసంగిస్తూ విద్యార్థినులు దేశభక్తిని కేవలం ఒక వేడుకగా కాకుండా తమ జీవిత విధానంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, విద్యార్థినులు తమ జ్ఞానం, నైపుణ్యం, క్రమశిక్షణ, నిజాయితీ, సామాజిక బాధ్యత, సేవాభావం ద్వారా దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆమె ఆకాంక్షి ంచారు. రిజిస్ట్రార్ ఆచార్య ఉష మాట్లాడుతూ యువత దేశాభివృద్ధిని ఆలో చించే శక్తిగా నిలవాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు తమ ప్రతిభను వ్యక్తిగత విజయాలకే పరిమితం చేయకుండా, సమాజ శ్రేయ స్సుకు మరియు దేశ ప్రగతికి వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ డీన్లు ఆచార్య సుధ, ఆచార్య విజయ లక్ష్మి ్మ, డాక్టర్ గంగా భవాని, ఇతర డీన్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## గ్రూపు విద్యుత్ సర్వీసుల కోసం వినూత్న సదుపాయం

### ఒకే క్లిక్‌తో అన్ని సర్వీసుల విద్యుత్ బిల్లుల చెల్లింపు: శివశంకర్



**తిరుపతి,ఆగస్టు 13 ప్రభాతవార్తప్రతినిధి:** గ్రూపు విద్యుత్ సర్వీసుల వినియోగదారుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ దక్షి ణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్పీడీసీఎల్) మరో వినూత్న సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సదు పాయం వివరాలను సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి గురువారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ వినియో గదారులకు మెరుగైన సేవలందించడంలో భాగంగా ఎపిఎస్పిడిసిఎల్ వెబ్ సైట్ ద్వారా ఒకే క్లిక్‌తో ఒక వినియోగదారుడికి చెందిన పలు విద్యుత్ సర్వీసుల బిల్లులను ఒకేసారి చెల్లించే విధానాన్ని రూపొం దించి నట్లు వెల్లడించారు. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల్లో మొదటగా ఎస్పిడిసిఎల్‌లో ఈ విధానాన్ని అందుబాటు లోకి తీసుకువచ్చామని తెలియజేశారు. ఇప్పటివరకు ఒకే వినియోగదారుడి పేరుతో ఉన్న పలు విద్యుత్ సర్వీ సులకు సంబంధించిన బిల్లులను చెల్లించేందుకు ప్రతి సర్వీసును విడివిడిగా ఎంపిక చేయాల్సి వచ్చేదని తెలి పారు. దీంతో బిల్లుల చెల్లిం పునకు ఎక్కువ సమయం పట్టడంతో పాటు ప్రక్రియ కొంత క్లిష్టంగా ఉండేదన్నారు. వినియోగదారుల సమయాన్ని ఆదా చేయడంతో పాటు చెల్లింపు ప్రక్రియను మరింత సులభతరం చేయాలనే ఉద్దేశంతో ఈ కొత్త విధానాన్ని రూపొందించినట్లు తెలియజేశారు. ఈ సదుపాయం ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి),మొబైల్ టవర్లు, పాల పరిశ్రమలు తదితర గ్రూపు విద్యుత్ సర్వీసుల వినియోగదారులు తమకు సంబంధించిన అన్ని విద్యుత్ సర్వీసులను ఒకే లాగిన్‌లో నమోదు చేసుకోవచ్చని, అవసరమైన సర్వీసులను ఎంపిక చేసు కుని వాటికి సంబంధించిన బిల్లులను ఒకేసారి చెల్లించే అవకాశం ఉంటుందని తెలిపారు. దీంతో గ్రూపు సర్వీ సుల బిల్లుల చెల్లింపు ప్రక్రియ మరింత వేగవంతంగా, సులభంగా, పారదర్శకంగా ఉంటుందని వివరించారు.

వినియోగదారులకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించడంతో పాటు డిజిటల్ సేవలను మరింత విస్తృతం చేయడమే లక్ష్యంగా ఎస్పిడిసిఎల్ పలు వినూ త్న కార్యక్రమాలను అమలు చేస్తోందని శివశంకర్ లోతేటి తెలిపారు.ఇందులో భాగంగానే గ్రూపు విద్యుత్

## నక్కపల్లిని 100 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు చర్యలు: మంత్రి అనిత

**నక్కపల్లి, ఆగస్టు 13, ప్రభాతవార్త:** నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గురువారం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆమె వివిధ వార్డులను పరిశీలించి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని పిల్లల వార్డును సందర్శించిన హోం మంత్రి చిన్నారులను పరామర్శించి, వారికి బేబీ కిట్లను అందజేశారు. ఆసుపత్రిలో అం దుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యా లపై వైద్యులు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసు కున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలోనే 100 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి అనిత ప్రకటించారు. ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. నక్కపల్లి ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకు



బేబీ కిట్లను అందజేస్తున్న మంత్రి అనిత

రావడంతో పాటు ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ప్రారంభం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా వాహన సేవలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు బాలింతతో కలిసి ఆమె వాహనంలో ప్రయాణించారు. నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అడ్డురోడ్డు మీదుగా కోనవానిపాలెం వరకు తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో మంత్రి ప్రయాణించారు. బాలింత లక్షీ ్మ దుర్గను, ఆమె బిడ్డను వాహనంలో స్వగ్రామమైన కోనవానిపాలెంకు తీసుకెళ్లి, ఇంటి వద్ద సురక్షి తంగా దించారు. ప్రసవానికి ముందు, ప్రసవం అనంతరం తల్లులు, నవజాత శిశువులు ప్రయాణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మంత్రి అనిత తెలిపారు. ఆసుపత్రి నుంచి తల్లీబిడ్డలను సురక్షి తంగా వారి ఇళ్లకు చేర్చడంలో ఈ వాహనాలు కీలకంగా నిలుస్తాయని చెప్పారు. తల్లులు, చిన్నారుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష ్యంగా ప్రభుత్వం పని చేస్తోందని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఆరోగ్యాంధ్ర దిశగా మరో ముం దడుగు అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, ఆసుపత్రి సూపరింటెంట్ సునీల్ తో పాటు పలువురు



## తండ్రి ఆశయ సాధనే డాక్టర్ వెంగళరావు ఐ ఇన్‌స్టిట్యూట్: మంత్రి సత్యకుమార్

**బొబ్బిలి (విజయనగరం జిల్లా), ఆగస్టు 13 ప్రభాతవార్త:** బొబ్బిలికి చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు కీ శే కోటగిరి వెంగళరావు జ్ఞాపకార్థం వారి తనయులు ప్రముఖ వైద్య నిపుణులు కోటగిరి అప్పారావు బొబ్బిలి రైల్వే స్టేషన్ వద్ద నిర్మించిన 'డా.వెం గళరావు ఐ ఇన్‌స్టిట్యూట్' వైద్యఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా అనకాపల్లి ఎంపీ సీఎం.రమేష్ కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాజీ ఎంపీ కేవీపీ.రామచంద్రరావు తదితర రాజకీయ ప్రముఖులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి వైద్య నిపుణులు పాల్గొన్నారు.

## తల్లి కడుపులో చేయి పెట్టే రకాన్ని కాదు

### టిడిపి మాజీ ఎమ్మెల్యే ఆర్.పి.భంజ్ దేవ్

**సాలూరు (విజయనగరం జిల్లా), ఆగస్టు 13 ప్రభాతవార్త :** మంత్రి సంధ్యారాణి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) బందాపు సతీష్ గత రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యయత్నం చేసుకోవడం జరిగింది. అలాగే దీనికి కారణం మాజీ ఎమ్మెల్యే ఆర్.పీ.భంజ్ దేవ్ వేధింపులు ఇంకా ఒక మహిళా కొందరు కారణమని మెసేజ్ వాట్సాప్ గ్రూపులో పెట్టడంతో ఆయన స్పందించారు. ఈ మేరకు గురువారం ఉదయం ఆర్.పీ. భంజ్ దేవ్ నివాసం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీడీపీ రాష్ట్ర నాయకుడిని కాబట్టి ఎందరో సమ స్యలతో నా దగ్గరికి వస్తారని అలాగే ఓ మహిళలకు మంత్రి పీఎస్ సతీష్ పోలీస్ కేసులో నా ప్రమేయం లేదని స్పష్టం చేశారు.

## శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో వ్యక్తిత్వ నిర్మాణ కార్యక్రమ ప్రారంభోత్సవం, పుస్తకావిష్కరణ



**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 13:** విద్యార్థులకు విద్యాభ్యాసంతోపాటు మంచి వ్యక్తిత్వాన్ని, నైతిక విలువలను, క్రమశిక్షణను, దేశభక్తిని పెంపొందించేందుకు శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్షీ ్మబాయి గురువారం కానూరు ఐ.పి.యల్ క్యాంపస్‌లో వ్యక్తిత్వ నిర్మాణ కార్యక్రమము, పుస్తకావిష్కరణ వేడుక ఘనంగా ప్రారంభించబడింది. ఈ సందర్భంగా విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడే ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరిం చారు. ఝాన్సీ మాట్లాడుతూ విద్యా ర్థులలో చిన్నప్పటి నుండి చదువు తోపాటు సంస్కారము పెంపొం దిస్తూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, గురువులు, పెద్దలు, తల్లిదండ్రుల తోపాటు సమాజం పట్ల గౌరవ మర్యాదలు పెంపొంది న్యాయము, ధర్మము మొదలైన విషయాలు తెలుసుకొని నడుచుకొనే విధంగా ఈ వ్యక్తిత్వ నిర్మాణ కార్యక్రమాన్ని విద్యా కరిక్యులమ్‌లో భాగంగా చేరుస్తున్నట్లు తెలిపారు. దేశంలో ప్రపంచంలోనే మొట్ట మొదటి సారిగా ఇలాంటి కార్యక్రమం రూపొందించడం శ్రీచైతన్యకే సాధ్యమైనదన్నారు. ఇప్పటి వరకూ ర్యాంకులతో, మార్కులతో తనదైన శైలితో విజయాల దుందుభి మ్రోగించిన శ్రీచైతన్య వాటితోపాటు ఇప్పటి నుండి విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణానికి, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. పాఠ్యబోధనకు అనుబంధంగా విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దేందుకు శ్రీచైతన్య విద్యాసంస్థ నిరం తరం కృషిచేస్తుందన్నారు.

విద్యార్థులకు ప్రేరణ ఇచ్చే అంశాలతో రూపొందించిన ఈ పుస్తకములో పొందు పరిచిన విషయాలు విద్యార్థులలో సానుకూల ఆలోచనా విధానము, లక్ష ్యసాధనపట్ల పట్టుదల, ఆత్మవిశ్వాసము పెంపొందేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఇ.జి.యమ్ మురళీకృష్ణ, ఆలిండియా అకడమిక్ కోఆర్డినేసర్ బి.వి. సతీష్, రీజనల్ ఇన్‌ఛార్జెస్, ప్రిన్సిపాల్స్, డీన్స్, సెంట్రల్ ఆఫీస్ టీమ్, ఉపాధ్యాయ,

# చంద్రబాబు కుట్ర రాజకీయాలు

### రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది

### విరూపాక్షి అరెస్టే అధికార దుర్వినియోగానికి నిదర్శనం

### బాధితులనే నిందితులుగా మార్చి కేసులు

### మాజీ సిఎం జగన్ మండిపాటు

**కర్నూలు, ఆగస్టు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 'రెడ్‌బుక్ రాజ్యాంగం' పేరుతో ప్రతిపక్షాన్ని అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. బాధితులనే నిందితులుగా మార్చి కేసులు నమోదు చేస్తున్నారని, ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను అరెస్టులతో భయపెడుతున్నారని విమర్శించారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు వ్యవహారమే అధికార దుర్వినియోగానికి నిదర్శనమని అన్నారు. చంద్రబాబు నాయుడు కుట్ర రాజకీయాలు చేస్తున్న జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా జైలులో ఉన్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని గురువారం జగన్ పరామర్శించారు. అనంతరం జైలు సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విరూపాక్షికి ధైర్యం చెప్పేందుకే కర్నూలుకు వచ్చానని, ఆయనపై నమోదైన కేసుల వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. పోలీసు వ్యవస్థను ఉపయోగించుకుని ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని విమర్శించారు. విరూపాక్షిని అరెస్టు చేసే సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపైనా జగన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వందలాది మంది పోలీసులు ఎమ్మెల్యే ఇంటిపైకి వచ్చి తలుపులు, కిటికీలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారని ఆరోపించారు. అధికారంలో ఉన్నవారు చట్టాన్ని తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. విరూపాక్షిపై గంటల వ్యవధిలో మూడు కేసులు నమోదు చేశారని జగన్ పేర్కొన్నారు. మొదటి కేసులో 34 మందిని, రెండో కేసులో 14 మందిని, మూడో కేసులో మరో 12 మందిని నిందితులుగా చేర్చారని తెలిపారు. మొత్తం 38 మందిని జైలుకు పంపారని ఆరోపించారు. వైసీపీ కార్యకర్త గిరిని ఎమ్మెల్యే తన కారులో తీసుకెళ్తున్న సమయంలో దాడి జరిగిందని, ఈ ఘటనలో ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాములుకు గాయాలయ్యాయని చెప్పారు. ఘటనకు సంబంధించి దుస్తుల వివాదాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. టీడీపీ కార్యకర్త తన భార్య దుస్తులను తానే చింపుకున్నప్పటికీ వైసీపీ కార్యకర్తలపై ఆరోపణలు చేసి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారని అన్నారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. విరూపాక్షి కారును ధ్వంసం చేసి ఆ నిందను ఎమ్మెల్యేపై మోపారని జగన్ ఆరోపించారు. మరోవైపు బాధితులుగా ఉన్న గిరి, శ్రీరాములు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా పోలీసులు స్వీకరించలేదని విమర్శించారు. తమకు అనుకూలంగా కేసులు నమోదు చేయడం ఏ విధమైన



న్యాయమని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థపై రాజకీయ ప్రభావం పెరుగుతోందని జగన్ ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై వరుస కేసులు, అరెస్టులతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు ఉందని, ఆ హక్కును అణచివేయడం సరికాదన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని జగన్ హెచ్చరించారు. విరూపాక్షి అరెస్టును రాజకీయ కక్షసాధింపుగా అభివర్ణించిన ఆయన, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

14-8Pg7exHMNWJQE:14-8Pg7exHMNWJQE.qxd 8/13/2026 11:52 PM Page 1



# ఉప్పు రైతుల పొట్టకొట్టి.. పోర్టుకు పట్టం కడతారా?

- 4,687.93 ఎకరాల నౌపడ ఉప్పు భూముల బదలాయింపుపై రైతుల ఆందోళన
- అభివృద్ధి ఎవరి కోసం? ఉపాధి కోల్పోయే వేలాది కుటుంబాల పరిస్థితి ఏమిటి?
- ప్రజాభిప్రాయం లేకుండానే భూముల బదలాయింపు ఎందుకు?
- ఉప్పు పరిశ్రమను నమ్ముకున్న రైతులు, కార్మికులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపుతుందా?





**సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 13, ప్రభాతవార్త:** 'నవధుమలకు తల్లి నౌపడ ఉప్పు'... ఒకప్పుడు నౌపడ పేరు వినగానే గుర్తొచ్చేది ఉప్పే. తరతరాలుగా ఈ ప్రాంతంలో వేలాది మంది రైతులు, ఉప్పు కార్మికులు ఉప్పు సాగు, ఉప్పు పరిశ్రమపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అలాంటి నౌపడ ఉప్పు చరిత్రకు ఇప్పుడు తెరపడబోతుందా? అభివృద్ధి పేరుతో ఉప్పు భూములను పోర్టు అవసరాలకు బదలాయిస్తే తమ జీవనాధారం ఏమవుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కోత మధుసూదనరావు ఆరోపణల ప్రకారం.. నౌపడ పరిధిలోని సుమారు 4,687.93 ఎకరాల ఉప్పు భూములను ఆంధ్రప్రదేశ్ పోర్ట్స్, షిప్పింగ్ అండ్ వాటర్‌వేస్ శాఖకు బదలాయించే ప్రక్రియ వేగవంతమైంది. ఈ మేరకు ఆగస్టు 5న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ తరఫున సాల్ట్ కమిషనర్ ఆదేశాలు వెల్లినట్లు ఆయన పేర్కొన్నారు. మర్రిపాడు పంచాయతీ పరిధిలో సుమారు 880 ఎకరాలు, మరోవైపు సుమారు 3,700 ఎకరాల భూమి పోర్టు అవసరాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. సర్వే నంబర్ 408లోనే భారీగా భూమి ఉన్నట్లు రైతు వర్గాలు పేర్కొంటున్నాయి. తగ్గలో సరిహద్దుల నిర్ధారణ, సర్వే తదితర ప్రక్రియలవేపట్టే భూములను అప్పగించే చర్యలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఉప్పు రైతుల్లో ఆందోళన మొదలైంది.

**అభివృద్ధి సరే.. ఉపాధి సంగతేంటి? :-**
పోర్టు వస్తే ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉద్యోగాలు వస్తాయని పాలకులు చెబుతున్నారు. కానీ ఆ అభివృద్ధి కోసం ఇప్పటికే జీవనోపాధిగా ఉన్న భూములను కోల్పోయే రైతులు, కార్మికుల భవిష్యత్తు ఏమిటన్నదే అసలు ప్రశ్న. నౌపడ, మర్రిపాడు, చిన్న మర్రిపాడు, సెలగొడ, సీతానగరం, మూలపేట, యామలపేట, కుర్మనాథపురం తదితర గ్రామాల్లో ఉప్పు సాగు, ఉప్పు పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఉన్నాయి. భూముల పోర్టు పరిధిలోకి వెళ్తే వీరికి ప్రత్యామ్నాయ ఉపాధి ఏమిటి? పరిహారం ఎవరికి? పునరావాసం ఎలా? కుటుంబాలకు శాశ్వత జీవనోపాధి కల్పించే ప్రణాళిక ఏంటి? అన్న ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**ఒక్క రూపాయికి విలువైన జీవనాధారం? :-**
రైతుల ఆరోపణల ప్రకారం ఉప్పు భూములను కేవలం ఒక్క రూపాయి విలువతో బదలాయించే ప్రక్రియ జరుగుతోందని మరింత ఆందోళన కలిగిస్తోంది. తరతరాలుగా సాగు చేస్తూ వచ్చిన భూములవిలువను, వాటిపై ఆధారపడి ఉన్న కుటుంబాల జీవన విలువను ఎలా నిర్ణయిస్తున్నారు? అన్నది ప్రభుత్వం ప్రజలకు వివరించాలి.

**ఉప్పు రైతులకు ప్రభుత్వం హామీ ఏది? :-**
పోర్టు కోసం భూములు తీసుకుంటే ఉప్పు రైతులకు ప్రత్యేక పునరావాస ప్యాకేజీ, ప్రత్యామ్నాయ భూములు, కుటుంబానికి ఉపాధి, నైపుణ్య శిక్షణ, పరిశ్రమల్లో ఉద్యోగాల్లో ప్రాధాన్యం, నష్టపరిహారం వంటి అంశాలపై ప్రభుత్వం ముందుగానే స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి. లేకపోతే అభివృద్ధి పేరుతో ఒక ప్రాంతానికి కొత్త భవిష్యత్తును నిర్మిస్తూ.. మరోవైపు తరతరాలుగా ఆ ప్రాంతాన్ని నమ్ముకుని బతుకుతున్న కుటుంబాల భవిష్యత్తును చీకట్లోకి నెట్టినట్లవుతుంది. 'ఉప్పు తప్పు మరే పంటా పండించలేని పరిస్థితిలో ఉన్నాం. భూములు పోతేమా కుటుంబాలను ఎలా పోషించుకోవాలి?' అనిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నౌపడ ఉప్పు చరిత్రను కాపాడేదెవరు? :-**
పోర్టులు రావాలి. పరిశ్రమలు రావాలి. ప్రాంతం అభివృద్ధి చెందాలి. కానీ అభివృద్ధి అంటే ప్రజల జీవనాధారాన్ని తొలగించడం కాదని రైతులు గుర్తు చేస్తున్నారు. పోర్టు నిర్మాణానికి అవసరమైన భూముల తీసుకోవడంలో పారదర్శకత పాటించాలని, ప్రభావిత గ్రామాల ప్రజలతో ముందస్తుగా చర్చించాలి. ఉప్పు రైతులు, కార్మికులు, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. భూములు కోల్పోయే ప్రతి కుటుంబానికి భవిష్యత్తుపై భరోసా కల్పించాలి. నౌపడ ఉప్పు భూములు కేవలం మట్టి కాదు... వేలాది కుటుంబాల బతుకు. ఆ భూములపై వేలాది చెమట చుక్కల చరిత్ర ఉంది. ప్రభుత్వం ఒక్కసారి ఆలోచించాలి. ఆ భూములపై ఆధారపడిన రైతుల భవిష్యత్తుకు ప్రభుత్వం ఏం ఇస్తుంది? ఎవరికి తెలియని ప్రశ్నగా మిగిలింది.

## రామచంద్రమూర్తికి ఇండియన్ పోలీస్ మెడల్



కమాండెంట్ కె.రామచంద్రమూర్తి

**చిత్తూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త:** ఎపి పోలీసుశాఖలో 35 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందిస్తున్న 8వ బెటాలియన్ ఎపిఎస్పి చిత్తూరు కమాండెంట్ కె.రామచంద్రమూర్తికి ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ లభించింది. అమరావతిలో శనివారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిఎం నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కె.రామచంద్రమూర్తి ఈ మెడల్‌నుఅందుకోనున్నారు. కె.రామచంద్రమూర్తి 1991 సంవత్సరంలో ఆర్ఎస్ఐగా పోలీసు శాఖలో నియమితులై అంకితభావం, క్రమశిక్షణ, సమర్థవంతమైన విధి నిర్వహణతో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉన్నత స్థాయికి ఎదిగారు. 35 సంవత్సరాల విశిష్ట పోలీస్ సేవలో ఆయనకు పలు ప్రతిష్టాత్మకమైన పురస్కారాలు, ప్రశంసలు లభించాయి.

## శ్రీసిటీకి ట్రైనీ అసిస్టెంట్ కమిషనర్లు

**సత్యవేడు, ఆగస్టు 13 ప్రభాతవార్త:** రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖకు చెందిన 21 మంది ట్రైనీ అసిస్టెంట్ కమిషనర్లు తమ అధ్యయనంలో భాగంగా శ్రీసిటీని సందర్శించారు. రాష్ట్ర పన్నుల విభాగం(జీఎస్టీ) జాయింట్‌కమిషనర్ మురళీకృష్ణ నేతృత్వంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీకి జాతీయ స్థాయి ప్రమాణాల కేంద్రంగా గుర్తింపు లభించడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి గర్వం వ్యక్తం చేశారు. తమ పారిశ్రామికవాడ అమలు విధానాన్ని అధికారులు, పాలనా నిపుణులు అధ్యయనం చేయడం గౌరవంగా భావిస్తున్నామన్నారు. వారితో మా ప్రయాణం, అనుభవాలను పంచుకోవడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. శ్రీసిటీలోని సమగ్రప్రణాళిక, అద్భుత మౌలిక వసతులు, సుస్థిర అభివృద్ధి విధానాలను ట్రైనీ అధికారులు ప్రశంసించారు. శ్రీసిటీ అధికారులతో చర్చల అనంతరం ట్రైనీ అధికారుల బృందం స్థానిక వరుణ్ బెవరేజెస్(పెప్సికో), బ్లూ స్టార్, బాల్‌కార్పొరేషన్ పరిశ్రమల సందర్శించి, అక్కడ అంశాలను ఆరా తీసింది.

## ఎపిలో శాంతిభద్రతలు కరవు: పేర్ని నాని

**విజయవాడ.ఆగస్టు13,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబు ఏకంగా పోలీసులతోనూ తనను తాను పొగిడించుకుంటున్నారని మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పేర్ని నాని ఆరోపించారు. పార్టీనేతలు పొగుడుతుంటే కిక్ రాక.ఇలా చేస్తున్నారన్నారు.. క్షేత్రస్థాయి సీఐలు, ఎస్పీలతో ముఖ్యమంత్రే నేరుగా సమీక్షలు నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. డీజీపీ అసమర్థుడు కావడం వల్లే చంద్రబాబు రంగంలోకి దిగారా అని ప్రశ్నించారు. రాబోయే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పోలీసులను అడ్డగోలుగా వాడుకునేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సీఎం ధైర్యసాహసాలను కొందరు అధికారులు కొనియాడటాన్ని నిలదీస్తూ... నాడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని, పదవులను లాక్కోవడమే చంద్రబాబు చూపిన ధైర్యమా అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మండిపడుతూ, డాక్టర్ ప్రియాంకను కారుతో తొక్కి చంపిన దారుణ ఘటనను ఆయన ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలను కేవలం ప్రమాదాలుగా చిత్రీకరిస్తూ కొందరు పోలీసుల తీరుతో ఖాకీ దుస్తుల పరువు పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ గురించి మాట్లాడే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ప్రియాంక దారుణ హత్యపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**విజయవాడ,ఆగస్టు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఎంతో కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్స్ ఫోరం (ఆర్ఎఫ్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు ఒక ప్రకటన లో కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, ఇతర వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రస్తుతం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి కళాశాలలకు రావాల్సిన బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడంతో విద్యార్థులపై ఫీజుల చెల్లింపు ఒత్తిడి పెరుగుతోంది. ప్రభుత్వం బకాయిలను ఆలస్యం చేయడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల కోసం ఒత్తిడి చేయడం, పరీక్షలకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లను నిలిపివేయడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీనివల్ల విద్యార్థుల్లో మానసిక ఆందోళన పెరుగుతుందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం విద్యార్థుల చదువుకు అండగా నిలిచేందుకు ఉపయోగపడాలని బకాయిల కారణంగా అదే విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి రావడం బాధాకరం అన్నారు.

## మహిళ, మరొకరు బలవన్మరణం

**పొన్నూరు, ఆగస్టు 13,ప్రభాతవార్త:** పట్టణ పరిధిలోని డీవీసి కాలనీలో ఓ మహిళ, వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం పట్టణంలో జరిగింది. అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రేవు శ్రీనివాస కిషోర్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని డీవీసి కాలనీలో మేళం చిరంజీవి(37), బర్కతున్నీసా(35) అనే ఇరువురు ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. బుధవారం రాత్రి వీరిరువురి మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగి, ఆత్మహత్య చేసుకొనేందుకు దారితీసి ఉంటుందని తెలుస్తోంది. ఇంటిలోపల గడియపెట్టుకుని ఉరి వేసుకున్నట్లు చెప్పారు. బర్కతున్నీసా తల్లి నజీరున్నీసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కిషోర్‌కుమార్ తెలిపారు.

## ఆలూరుపాడులో రూ.2.30 కోట్లతో అభివృద్ధి పనులు

**కొడవలూరు, (నెల్లూరు),ఆగస్టు 13, ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో ఆలూరుపాడు ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల్లో సగానికి పైగా పరిష్కరించిన తర్వాతే మళ్లీ గ్రామానికి వచ్చానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. గురువారం ఆలూరుపాడులో 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామదేవత మహాలక్షి మ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ.. రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల ముందు ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## కుప్పంలో నీతి ఆయోగ్ బృందం పర్యటన



**కుప్పం, ఆగస్టు 13 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబునాయుడు నాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో నీతి అయోగ్ సభ్యుల బృందం పర్యటించింది. రూరల్ గ్రోత్ హబ్స్ (ఆర్జిహెచ్) పైలట్ ప్రాజెక్టుకు సంబంధించి కుప్పం నియోజకవర్గంలో ఎనిమిది గ్రామాలను ఎంపిక చేసి ఏడు ప్రభుత్వ పథకాలు రైతులకు అనుసంధానం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలుత నీతి ఆయోగ్ బృందం సోమనాథ్ చౌదరి, అథేనా డైరెక్టర్ అంకిత్‌ఛెత్రిలతో కడ పి.డి. వికాస్ మర్మత్, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు సమావేశమయ్యారు. ఈసందర్భంగా వ్యవసాయ రంగంలో ఆధునిక టెకా న్నలజీ అయిన డ్రోన్, సెన్సర్ టెక్నాలజీ, ఎఐ అప్లికేషన్ల ద్వారా వ్యవసాయ సలహాలు, సూచనలు అందించడం వంటి అంశాలపై 400మంది రైతులతో పైలట్ ప్రాజెక్టులో కలసి పనిచేయడం జరుగుతుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## 16న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల భేటీ ఉద్యమ కార్యాచరణపై నిర్ణయం

**విజయవాడ, ఆగస్టు 13 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ నెల 16వ తేదీన ఎపి జెఏసి అమరావతి రాష్ట్ర కమిటీఅన్ని ఉద్యోగ సంఘాలతో సమావేశం కానున్నట్లు జె.ఎ.సి. ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, కన్వీనర్ పలిశెట్టి దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 22వ తేదీన ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం చర్చించిన అంశాలపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని, ఆగస్టు 15 లోపు ప్రభుత్వ వైఖరి పై స్పష్టత రాని పక్షంలో తదుపరి కార్యాచరణ నిమిత్తం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. పీఆర్సీ కమిషనర్ నియామకం, మధ్యంతర భృతి ప్రకటన, పెండింగ్ డి ఏ ల ప్రకటన, పెండింగ్ బకాయిల విడుదల, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల,కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం తదితర 29 డిమాండ్లపై ఉద్యమ కమిటీ సమావేశం జరుగుతుందని వివరించారు.

## పోలవరం కుడి కాల్వలో బాలుడు గల్లంతు

**విజయవాడ.ఆగస్టు13,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లా వీరపనేనిగూడెం వద్ద ఒక విషాద ఘటన జరిగింది. పోలవరం కుడి కాల్వలో బాలుడు గల్లంతయ్యాడు. స్థానిక పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఆరుమళ్ల లీలామోహన్‌రెడ్డి(12) అనే బాలుడు సైకిల్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు జారి పోలవరం కుడి కాల్వలో పడ్డాడు. అది గమనించిన సమీప ప్రజలకు బాలుడిని రక్షించే ప్రయత్నంలో ఉండగానే అతను గల్లంతయ్యాడు. ఈ . సమాచారం అందుకున్న పోలీసులు, స్థానిక ఈతగాళ్లు కాల్వలో బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు

## 36 మంది విబి జి రామ్ జి ఎపిఒలపై చర్యలు

**విజయవాడ, ఆగస్టు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** విబి జి రామ్ జి పథకం ద్వారా శ్రామికులకు పని కల్పించడంలో నిర్లక్ష్యం వహించిన 36 మంది ఎపిఒలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్ఆర్‌డిఎస్ మెంబర్ సెక్రటరీ ఆదేశించారు. అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, మార్కాపురం, నంద్యాల, ప్రకాశం, శ్రీసత్యసాయి, శ్రీకాకుళం, తిరుపతి, విజయనగరం, వైఎస్ఆర్ కడప జిల్లాలకు చెందిన ఎపిఒలకు చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల డ్వామా పిడిలకు సూచించారు. ఈ ఏడాది జులై 1 నుంచి విబి జి రామ్ జి పథకం అమల్లోకి వచ్చినప్పటికీ, శ్రామికులకు పనిదినాలు కల్పించడంలో ఆయా ఎపిఒలు పూర్తి నిరక్ష ్యం వహించినట్లు గుర్తించారు. విధుల్లో నిరక్ష్యం వహించిన 36మంది ఎపిఒలతో ఇటీవల గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనరేట్ అధికారులు సమావేశమై చర్చించారు. వారి వివరణ సహేతుకంగా లేకపోవడంతో చర్యలు

## ట్రాక్టర్ బోల్తా పడి తండ్రి, కొడుకు మృతి

**చిల్లకూరు, (నెల్లూరు), ఆగస్టు 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కడివేడు గ్రామ సమీపంలో బుధవారం రాత్రి ట్రాక్టర్ బోల్తా పడింది ఈ విషయాన్నిఅటు వైపు వెళుతున్న వాహనదారులు 112 డయల్ చేసి సమాచారం ఇవ్వడం జరిగింది. వెంటనే చిల్లకూరు సురేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా తండ్రి రమణయ్య మృతి చెందారు. పోలీసులు వివరాలు మేరకు ఆత్మకూరు గ్రామానికి చెందిన పొట్లూరు రమణయ్య కొడుకు పొట్లూరు సీనయ్య ఇద్దరూ గత మూడు రోజుల నుండి చిల్లకూరు మండలంలోని చుట్టుగుంట గ్రామం వద్ద ఓ మామిడి తోటలో ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు చేసేందుకు వచ్చారు. అయితే బుధవారం రాత్రి భోజనం చేసేందుకు కడివేడు గ్రామానికి వచ్చి తిరిగి చుట్టుగుంటకు ట్రాక్టర్ పై వెళుతున్న క్రమంలో అదుపుతప్పి పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తండ్రిపొట్లూరు రమణయ్య (59) అక్కడికక్కడే మృతి చెందాడు కొడుకు పోట్లూరు సీనయ్య (29)కి తీవ్ర గాయాలైయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గుడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు

## రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

**వింజమూరు, (నెల్లూరు),ఆగస్టు 13, ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని డాల్మిల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు వైద్య సిబ్బంది తెలిపిన వివరాలు మేరకు కలిగిరి మండలం పాపన ముసలి పాలెం కు చెందిన ఇండ్ల వెంకటేశ్వర్లు వింజమూరు ఎస్టీ కాలనీకి చెందిన ఇండ్ల నరసింహులు (35) కలిగిరి నుండి బైక్ పై వస్తూ వింజమూరు సమీపంలోని డాల్ మిల్ దగ్గర బైకులు నిలిపి మాట్లాడుతుండగా వింజమూరు నుండి కావలికి వెళుతున్న కారు ఢీకొట్టడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి వారిలో ఇండ్ల నరసింహులుకు తలకు బలమైన రక్త గాయాలు తగలడంతో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సను అందించి మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు తరలించారు.

# లేపాక్షి, గండికోటకు ప్రపంచ వారసత్వ హోదా కోసం సిఫారసు చేయండి

- యునెస్కో తుది జాబితాలో చోటు కల్పించేలా కేంద్రం చొరవ చూపాలి
- ఆంధ్రప్రదేశ్‌లో చారిత్రక పర్యాటక స్మారకాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి
- కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో డాక్టర్ జాస్తి వీరాంజనేయులు భేటీ



కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో డాక్టర్ జాస్తి వీరాంజనేయులు

**విజయవాడ ఆగస్టు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని అపారమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను ప్రపంచ పర్యాటక పటంలో మరింత ఉన్నతస్థానంలో నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను గురువారం డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని చారిత్రక ప్రదేశాలు, పురావస్తు సంపద, పర్యాటక అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. లేపాక్షి గండికోటకు యునెస్కో గుర్తింపునకు సిఫారసు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకురాగల లేపాక్షి, గండికోటలను యునెస్కో ప్రపంచ వారసత్వ తుది జాబితాలో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సిఫారసులు, సహకారం అందించాలని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. లేపాక్షి ఇప్పటికే యునెస్కో తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకున్న విషయాన్ని ప్రస్తావించిన ఆయన, తదుపరి దశలో తుది జాబితాలో స్థానం పొందేందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. గండికోటకు కూడా ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించేలా కేంద్రం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ ఏడాదిలోనే ప్రపంచ వారసత్వ హోదా సాధించే దిశగా ముందుకు వెళ్లాలంటే రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన డోసియర్లను తక్షణమే సిద్ధం చేసి కేంద్రానికి పంపాల్సిన అవసరం ఉందని, ఇందుకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ నుంచి మార్గదర్శకత్వం, సహకారం అందించాలని ఆయన కోరారు. చారిత్రక స్మారకాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలిఆంధ్రప్రదేశ్‌లోని చారిత్రక స్మారకాలు, పురావస్తు ప్రదేశాల పరిరక్షణ, అభివృద్ధి, పర్యాటక మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. చారిత్రక కట్టడాల పరిరక్షణతో పాటు అక్కడికి వచ్చే పర్యాటకులకు రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, సమాచార కేంద్రాలు, మార్గదర్శక సదుపాయాలు, విద్యుత్, రవాణా వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని చారిత్రక ప్రదేశాలను అభివృద్ధి చేస్తే దేశ, విదేశాల నుంచి పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు, చిన్న వ్యాపారాలు, హస్తకళలు, సంప్రదాయ కళలకు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. పర్యాటక రంగం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు అమరావతి శిల్ప సంపదకు ప్రపంచస్థాయి ప్రాధాన్యం లండన్‌లోని మ్యూజియంలలో భద్రపరిచిన అమరావతి అపురూప శిల్ప సంపద అంశాన్ని కూడా డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అమరావతి శిల్పాలు భారతదేశ ప్రాచీన కళా, సాంస్కృతిక, బౌద్ధ వారసత్వానికి ప్రపంచస్థాయి ప్రతీకలని, వాటి చరిత్రను, విశిష్టతను ప్రపంచానికి మరింతగా పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు

# నైపుణ్య శిక్షణతో ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం


- సీడాప్ చైర్మన్ జి. దీపక్ రెడ్డి..

**విజయవాడ.ఆగస్టు13,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర ప్రణాళికలో భాగంగా రాష్ట్ర యువతను ప్రపంచస్థాయి నైపుణ్యాలతో తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పన మరియు వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ (సీడాప్) చైర్మన్ జి. దీపక్ రెడ్డి తెలిపారు. స్థానిక నందమూరి తారక రామారావు పరిపాలనా భవనం రెండో అంతస్థులోని సీడాప్ కార్యాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పన మరియు వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ (సీడాప్) చైర్మన్ జి. దీపక్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. శ్యామ్ ప్రసాద్‌తో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో యువతకు నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, ఇప్పటివరకు సుమారు రూ.11.37 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు గ్రౌండ్ కాగా, 10 లక్షలకు పైగా ఉద్యోగాల కమిట్‌మెంట్లు వచ్చాయని తెలిపారు. వీటి ద్వారా ప్రభుత్వానికి కూడా గణనీయమైన ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. ఐటీఐలు, ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, సీడాప్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ తదితర సంస్థల ద్వారా పెద్ద ఎత్తున శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 7,28,347 మంది యువతకు ఉద్యోగాలు, శిక్షణ అందించినట్లు తెలిపారు. సీడాప్ ద్వారా అందించే శిక్షణ పూర్తిగా ఉచితమని, రవాణా, కౌన్సెలింగ్, యూనిఫాం, స్టడీ మెటీరియల్, శిక్షణ, ఆహారం, వసతి, పరీక్ష ఫీజులు, సర్టిఫికేషన్ వంటి అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు పొందే యువతకు కూడా ప్రభుత్వం అవసరమైన ఫెసిలిటేషన్, వసతి, మార్గదర్శకత్వం అందిస్తోందన్నారు. ఉద్యోగంలో చేరిన తర్వాత ఆరు నెలల పాటు వారి పరిస్థితిని పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా స్కిల్ అసెస్‌మెంట్, సీవీ/రెస్యూమ్ తయారీ, ఇంటర్వ్యూ ప్రిపరేషన్, కెరీర్ గైడెన్స్ వంటి సేవలను ఒకే వేదికపై అందిస్తున్నామని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సేవలతో యువతకు మరింత మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నామని, స్కిల్ ప్రొఫైల్ ఆధారంగా స్కిల్ పాస్‌పోర్ట్, స్కిల్ ఐడీ కార్డు అందించడం ద్వారా ఉద్యోగదాతలకు అభ్యర్థులను ఎంపిక చేయడం సులభతరం అవుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 202021 లో సీడాప్ ద్వారా కేవలం 7,200 మంది విద్యార్థులకు మాత్రమే శిక్షణ అందించగా, కూటమి ప్రభుత్వం యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డు లభించడం రాష్ట్ర ప్రభుత్వ కృషికి గుర్తింపు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ భృతికి భిన్నంగా, ప్రస్తుత ప్రభుత్వం ఒక్కో యువతిపై రూ. లక్ష కు పైగా పెట్టుబడి పెట్టి నైపుణ్య శిక్షణ అందించి, వారు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు.

# హంద్రీనీవా, హెచ్ఎల్‌సి నీళ్లపైనే అందరి కన్ను

### ప్రత్యేక బృందాలతో కాలవ గట్లపై నిఘా

### హంద్రీనీవా నీటిని జీడిపల్లి రిజర్వాయర్కు తరలింపు



**అనంతపురం, ఆగస్టు 13 ప్రభాతవార్త బ్యూరో:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తీవ్రం కావడం తో చెరువులు నీరు లేక వెలవెలబోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. గార్లదిన్నె మండలం ముకుందాపురం లాంటి పలు గ్రామాల్లో పండ్ల తోటలను బతికించుకునేందుకు ట్రాక్టర్ల ద్వారా నీరు అందిస్తున్నారు. ఎలినినో ప్రభావం దేశవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉన్నప్పటికీ అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలో ఆ ప్రభావం ఇంకా ఎక్కువ కనిపిస్తోంది. మూడు, నాలుగు దశాబ్దాలుగా కరువు పరిస్థితులు ప్రతి ఏటా కరాల నృత్యం చేస్తున్నడంతో ఆర్థిక ఇబ్బందులతో రైతు కుటుంబాలు నలిగిపోయాయి. ప్రతి మూడేళ్లలో రెండేళ్లు కరువులు వచ్చేటివి. గతంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఉమ్మడి అనంతపురం జిల్లా కరువు పరిస్థితులను గుర్తించి కరువు నివారణకు ఎన్నో పథకాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఒక్కగానొక్క నీటి నీటి వనరు అయినా తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే హెచ్.ఎల్.సి కెనాల్ మాత్రమే ఉండేది. హెచ్ఎల్సీ కెనాల్ వల్ల కొద్ది ప్రాంతంలో సాగునీటికి వాడుతూ వచ్చిన ఎక్కువగా ప్రజలు దాహార్తిని తీర్చే మంచినీటి పథకాల కు ఆ నీటిని వాడేవారు. అయితే ఒక దశాబ్దపు కాలం నుంచి ఏడాదికి ఏడాది ఉమ్మడి అనంతపురం జిల్లా రైతుల జీవితాలు మెరుగైతూ వచ్చాయి. దీనికి కారణం హెచ్ ఎల్ సి నీటితోపాటు హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి నీరు రావడమే కారణం.. హంద్రీనీవా నీరు సాగునీటికి వినియోగించలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కువ చెరువులకు హంద్రీ నీవా, హెచ్.ఎల్.సి నీటిని నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరగడం తో రైతులు మంచి దిగుబడులు తీసుకొస్తూ వచ్చారు. గత కొన్ని నీళ్లగా మంచి వర్షాలు రావడం, దీనికి అదనంగా హెచ్.ఎల్.సి , హంద్రీ నీవా నీరు తోడు కావడంతో వివిధ పండ్ల తోటలతో పాటు వాణిజ్య పంటలను కూడా పండించి రైతులు మంచి ఆదాయాన్ని పొందుతూ వచ్చారు.. అయితే ఈ ఏడాది అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో రైతుల పరిస్థితులు దయనీయంగా మారాయి.

వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు ఆదుకునేందుకు వర్షాధారిత పంటలు బీమాను పగడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ఆ మేరకు రైతులు ప్రీమియం చెల్లించారు. అన్ని పంటలకు ప్రీమియం కట్టించుకోలేదని కొన్ని వర్గాల రైతులలో అసంతృప్తి ఉన్నప్పటికీ ఎక్కువ మంది రైతులు ప్రీమియం చెల్లించారని అభిప్రాయం ఉంది. పంట నష్టపోతే పరిహారం వస్తుందని రైతులు ఆశతో ప్రీమియం చెల్లించిన వారు కూడా ఉన్నారు. అయినప్పటికీ వర్షం పైన, హెచ్ ఎల్ సి, హంద్రీ నీవా నీటి పైన రైతులు ఆశపెట్టుకున్నారు.. ఇన్నాళ్లు రాయదుర్గం నియోజకవర్గం లో కనేకల్లు, బొమ్మనహాళ్ ప్రాంతంలో హెచ్ ఎల్ సి నీటిని పంట పొలాలకు వదిలేవారు. హంద్రీనీవా నీటిని ప్రధాన కాలవల్లో అటు ఇటు ఉన్న రైతులు మోటార్లు వేసి తమ పంట పొలాలకు వాడుకునేవారు.. హెచ్ ఎల్ సి కెనాల్ పైన కూడా కొందరు మోటార్లు వేసుకునేవారు.. అయితే ఈ సంవత్సరం వర్షపావ పరిస్థితుల వల్ల హెచ్.ఎల్.సి నీటిని, హంద్రీ నీవా నీటిని తాగునీటికే వాడుకోవాలని జిల్లా అధికారులు పదేపదేగా హెచ్చరికలు చేస్తుండడంతో ఇన్నాళ్లు సాగు నీరు పై ఆధారపడ్డ రైతులు నిరాశతో ఉన్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్ ఇటీవల అధికారుల సమావేశం ఏర్పాటు చేసి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు టీములుగా ఏర్పడి కాలువల గట్లపై మోనిటరింగ్ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో నీటిని సాగునీటికి రైతులు వాడకుండా చూడాలని, మంచినీటికే ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు లేకపోయినా కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు రావడం వల్ల ఒకవైపు కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి, మరొకవైపు ఆంధ్రాలోని శ్రీశైలం జలాశయానికి నీరు భారీగా ఒక నెల కాలంలో వచ్చి చేరింది. రిజర్వాయర్లు కూడా నీటితో కటకట లాడే పరిస్థితిలో ఎగువ ప్రాంతాల్లో వచ్చిన వర్షాల వల్ల తాగునీటి ఎద్దడి తీర్చేందుకు అవకాశం ఏర్పడింది.

అయితే ఇటు తుంగభద్ర కు, అటు శ్రీశైలం కు ఇంకా ఎక్కువ నీరు పై భాగం నుంచి వస్తేనే సాగునీరు, తాగునీరు అవసరాలతో పాటు విద్యుత్ ఉత్పత్తికి ఎక్కువ అవకాశాలు వస్తాయని నీటిపారుదల నిపుణులు అభిప్రాయపడు తున్నారు. గురువారం శ్రీశైలం జలాశయంలోకి నీటి ప్రవాహం 26,939 క్యూసెక్కుల మీరు వస్తుండగా 86,951 క్యూసెక్కుల నీరు బయటికి వదులు తున్నారు. శ్రీశైలం జలాశయంలో 215 టిఎంసిలకు గాను 185.56 టీఎంసీ ల నీరు నిల్వ ఉంది. రిజర్వాయరూలో నీటిమట్టం 885 అడుగులకు గాను 879.50 అడుగులు ఎత్తువరకు నీరు ఉంది. అదేవిధంగా తుంగభద్ర డ్యామ్ పూర్తి నీటిమట్టం 1633.00 అడుగులు కాగా ప్రస్తుత మట్టం628.20 అడుగులు వరకు ఉంది. టీబీ డ్యాంలో మొత్తం నిల్వ సామర్థం 105.788 టీఎంసీ ప్రస్తుత నిల్వ: 87.454 టీఎంసీ ల నీరు ఉంది. ఇటు శ్రీశైలం కు, అటు తుంగభద్ర జలాశయానికి రాబోయే కాలంలో ఎక్కువ నీరు వచ్చి చేరుతాయని రైతులు ఆశిస్తున్నారు.

14-08pg10:14-08pg10.qxd 8/13/2026 11:29 PM Page 1



## ఈస్ట్ బెంగాల్ విజయం

### అల్ అరబీ 4-1 తేడాతో ఓటమి



**న్యూఢిల్లీ:** ఏఎఫ్‌సి ఛాంపియన్స్ లీగ్ టూ గ్రూప్ దశకు అర్హత సాధించేందుకు, ఈస్ట్ బెంగాల్ కువైట్‌కు చెందిన అల్ అరబీ ఎస్‌సిని 4-1 తేడాతో ఓడించింది. 76వ నిమిషంలో అనాయో ఇవూలా పెనాల్టీని గోల్‌గా మలిచి అతిథి జట్టును ఆధిక్యంలోకి తీసుకురావడంతో, ఐఎస్‌ఎల్ ఛాంపియన్లు టోర్నమెంట్ నుండి నిష్క్రమించే దిశగా పయనిస్తున్నట్లు కనిపించారు. అయితే, 90వ నిమిషంలో జయ్ గుప్తా హెడర్‌తో చేసిన గోల్ అదనపు సమయానికి దారితీయగా, ఆ తర్వాత ఈస్ట్ బెంగాల్ పూర్తి నియంత్రణ సాధించింది. 108వ నిమిషంలో కెప్టెన్ మహమ్మద్ రషీద్ అద్భుతమైన హాఫ్‌వాలీతో ఆతిథ్య జట్టును ఆధిక్యంలోకి తీసుకువెళ్లగా, ఆట ముగియడానికి ఏడు నిమిషాల ముందు ప్రత్యామ్నాయ ఆటగాడు డేవిడ్ లాల్హ్లాన్‌సంగా మూడవ గోల్ చేశాడు. స్టాపేజ్ టైమ్‌లో రోహిత్ దాను ఈ ఘన విజయాన్ని పూర్తి చేశాడు. ప్రభ్‌సుఖన్ సింగ్ గిల్ కూడా కీలకమైన సేవ్‌లు చేసి ఆతిథ్య జట్టును పోటీలో నిలబెట్టాడు. 50వ నిమిషంలో జెసిన్ తోనిక్కర అందించిన పాస్‌ను అందుకున్న బిపిన్ సింగ్ బంతిని లక్ష్యం నుండి దూరంగా కొట్టడంతో ఈస్ట్ బెంగాల్ ఒక గొప్ప అవకాశాన్ని కోల్పోయింది. గుప్తా చివరి నిమిషంలో చేసిన గోల్ ఆట స్వరూపాన్ని మార్చేసి గెలుపొందింది. ఈ విజయంతో ఈస్ట్ బెంగాల్ ఏఎఫ్‌సి ఛాంపియన్స్ లీగ్ టూ యొక్క వెస్ట్ రీజియన్ గ్రూప్ దశకు చేరుకుంది, అక్కడ 16 జట్లు హోమ్‌అండ్‌అవే రౌండ్‌రాబిన్ ఫార్మాట్‌లో పోటీపడతాయి.

## కెనడియన్ ఓపెన్ ఫైనల్‌కు స్వియాటెక్

**న్యూఢిల్లీ:** కెనడియన్ ఓపెన్‌లో జరిగిన యూఎస్ ఓపెన్ ట్యూన్‌అప్ ఈవెంట్‌లో ఇగా స్వియాటెక్ ఫైనల్‌కు చేరుకుంది. నిర్ణయాత్మక సెట్‌లో స్వియాటెక్ ఒక బ్రేక్ వెనుకబడినప్పటికీ పుంజుకుని ఉక్రెయిన్‌కు చెందిన ఎలినా స్విటోలినాను 6-3, 1-6, 6-3 తేడాతో ఓడించి, ఈ సీజన్‌లో తొలిసారిగా టొరంటోలో ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. 2022లో ఫ్లషింగ్ మెడోస్‌లో తన ఆరు గ్రాండ్ స్లామ్ టైటిల్స్‌లో ఒకదాన్ని గెలుచుకున్న స్వియాటెక్, ఈ యూఎస్ ఓపెన్ వెంట్‌లో వర్షం కారణంగా ఆలస్యమైన మొదటి సెట్‌ను కైవసం చేసుకుంది. ఆ తర్వాత స్విటోలినా ఆటను తన వైపుకు తిప్పుకుని, ఏకపక్షంగా సాగిన రెండో సెట్‌లో పోలిష్ క్రీడాకారిణి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. నిర్ణయాత్మక సెట్‌లో స్విటోలినా బ్రేక్ సాధించి 3-2 ఆధిక్యం సంపాదించినప్పటికీ, మాజీ ప్రపంచ నంబర్ వన్ స్వియాటెక్ చివరి నాలుగు గేమ్‌లను వరుసగా గెలుచుకుని విజయాన్ని కైవసం చేసుకుంది. మరో సెమీఫైనల్‌లో కజకిస్తాన్‌కు చెందిన ఎలెనా రైబాకినా, నాలుగో సీడ్ క్రీడాకారిణి కోకో గాఫ్‌ను 5-7, 6-2, 6-2 తేడాతో ఓడించింది. క్వార్టర్ ఫైనల్‌లో ఒక సెట్ వెనుకబడినప్పటికీ పుంజుకుని నవోమి ఒసాకాను ఓడించి, రెండో సీడ్ క్రీడాకారిణి మరో పునరాగమన విజయాన్ని పూర్తి చేసింది.





## వన్డేలోనూ అఫ్ఘాన్ విజయం

### 42 పరుగుల తేడాతో ఐర్లాండ్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఐర్లాండ్ గడ్డపై అఫ్గానిస్తాన్ జైత్రయాత్ర నిర్విఘ్నంగా కొనసాగించింది. బెల్‌ఫాస్ట్ వేదికగా జరిగిన నాలుగో వన్డేలో ఆతిథ్య ఐర్లాండ్‌ను 42 పరుగుల తేడాతో అఫ్గాన్ ఓడించింది. ఈ విజయంలో అఫ్గానిస్తాన్ ఓపెనర్లు సెదీఖుల్లా అటల్, ఇబ్రహీం జద్రాన్‌లు భారీ సెంచరీలతో చెలరేగి కీలక పాత్ర పోషించారు. అటల్ ఏవలం 120 బంతుల్లో 17 ఫోర్లు, 4 సిక్సర్లతో 143 పరుగులు సాధించగా, జద్రాన్ 118 బంతుల్లో 107 పరుగులు చేశాడు. ఫలితంగా తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 343 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఐరీష్ జట్టు 48 ఓవర్లలో 301 పరుగులకు ఆలౌట్ అయింది. అఫ్గాన్ పేసర్ యామిన్ అహ్మద్‌జాయ్ 4,రషీద్ ఖాన్ తలా 3 వికెట్లు సాధించారు. ఇక ఈ మ్యాచ్‌లో అద్భుత సెంచరీతో సత్తాచాటిన సెదీఖుల్లా అటల్ ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. పుట్టిన రోజున వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన ప్లేయర్‌గా అటల్ వరల్డ్ రికార్డు సృష్టించాడు.



# 23 యేళ్ల తర్వాత తొలి టెస్ట్

### ఆస్ట్రేలియాను గడగడలాడించిన బంగ్లాదేశ్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనను బంగ్లాదేశ్ ఘనంగా ప్రారంభించింది. 23 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై తొలి టెస్ట్ ఆడుతున్న బంగ్లాదేశ్, ఫస్ట్ టెస్ట్ తొలి రోజు ఆతిథ్య జట్టును గడగడలాడించింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం డార్విన్ వేదికగా ప్రారంభమైన తొలి టెస్ట్‌లో టాస్ గెలిచిన బ్యాటింగ్ దిగిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా, టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హోస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) హాఫ్ సెంచరీతో రాణించి ఇజ్జత్ కాపాడాడు. ట్రావిస్ హెడ్(22), జాక్ వెదరాల్డ్(23), మార్నస్ లబుషేన్(1), కామెరూన్ గ్రీన్(13), అలెక్స్ క్యారీ(19), బ్యూ వెబ్‌స్టర్(12), పాట్ కమిన్స్(9), మిచెల్ స్టార్క్(1), నాథన్ లయన్(7) తీవ్రంగా నిరాశపర్చారు. ఓవైపు వరుసగా వికెట్లు పడినా స్టీవ్ స్మిత్ ఒంటరి పోరాటం చేశాడు. టెస్ట్‌ల్లో బంగ్లాదేశ్‌పై ఆసీస్‌కు ఇదే అత్యల్ప స్కోర్. ఈ మ్యాచ్‌లో పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగిన ఆసీస్ ఆశించిన రీతిలో రాణించలేకపోయింది. ఇప్పటి వరకు బంగ్లాదేశ్‌తో ఆసీస్ 7 టెస్ట్‌లు ఆడగా, ఇదే అత్యల్ప స్కోర్. 9 ఏళ్ల క్రితం 2017లో మిర్‌పూర్‌లో బంగ్లాదేశ్‌పై ఆసీస్ ఓడిన టెస్ట్‌లో 217 పరుగులకే ఆలౌటైంది. ఇప్పటి వరకు ఇదే అత్యల్పం కాగా.. తాజా ఇన్నింగ్స్ దాన్ని బ్రేక్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. క్రీజులో తంజిద్ హసన్(32 బ్యాటింగ్), మోమినుల్ హక్(35 బ్యాటింగ్) ఉన్నారు. ఓపెనర్ షాదమన్ ఇస్లామ్(20)ను మిచెల్ స్టార్క్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ప్రస్తుతం బంగ్లాదేశ్ 102 పరుగుల వెనుకంజలో ఉంది. మొత్తంగా తొలి రోజు ఆటలో మూడు సెషన్లలో బంగ్లాదేశ్ ఆధిపత్యం చెలాయించింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో చాలా మంది ఎడ్జ్‌లతో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగారు.








## కీమర్ చేతిలో ప్రజ్ఞానంద ఓటమి!

### స్విస్ గ్రాండ్ మాస్టర్‌ను ఓడించిన దివ్య

**న్యూఢిల్లీ:** సింక్‌ఫీల్డ్ కప్ 2026లో భారత్ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద కొనసాగిస్తున్న అజేయ ప్రస్థానానికి జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్ చేతిలో మూడో రౌండ్‌లో ఓటమితో తెరపడింది. 21 ఏళ్ల యువకుడు నల్ల పావులతో ఆడి సూపర్ చెస్ క్లాసిక్ రొమేనియా ఛాంపియన్ చేతిలో ఓడిపోయి, లీడర్‌బోర్డ్‌లో సంయుక్తంగా నాలుగో స్థానానికి (1.5) పడిపోయాడు. అమెరికాకు చెందిన వెస్లీ సో తన స్వదేశీయుడైన ఫాబియానో కరువానాను ఓడించి 2.5 పాయింట్లతో ఏకైక అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఫ్రెంచ్ జీఎం మాక్సిమ్ వాచియర్‌లాగ్రావ్ మరియు అమెరికాకు చెందిన లెవాన్ అరోనియన్, జవోఖిర్ సిందరోవ్ మరియు జోర్డెన్ వాన్ ఫోరెస్ట్‌లతో డ్రాలు పంచుకుని, మూడు రౌండ్ల తర్వాత 2 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానానికి చేరుకున్నారు. ప్రజ్ఞానంద, కరువానా, కీమర్ మరియు సామ్ సెవియన్‌లతో కలిసి నాల్గవ స్థానాన్ని పంచుకున్నారు. మరోపక్క కెయిర్న్స్ కప్‌లో వరుసగా మూడో ఓటమిని చవిచూసిన స్విస్ గ్రాండ్ మాస్టర్ అలెగ్జాండ్రా కోస్టెనియుక్‌ను ఓడించిన భారత క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్ మూడో స్థానానికి ఎగబాకింది. దివ్య ఇప్పుడు 2 పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. 2.5 పాయింట్లతో సంయుక్త అగ్రగాములుగా ఉన్న చైనాకు చెందిన టాన్ జోంగ్యీ, అమెరికాకు చెందిన ఆలిస్ లీల కంటే ఆమె వెనుక ఉంది.




## టాటా సన్స్ తదుపరి ఛైర్మన్ ఎంపికకు కమిటీ ఏర్పాటు



**ముంబయి,ఆగస్టు 13:** టాటా సన్స్ తదుపరి ఛైర్మన్‌ను ఎంపిక చేసేందుకు సెలెక్షన్ కమిటీ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించాలని సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ గురువారం తీర్మానం చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభమయ్యే మూడో విడత పదవీకాలానికి తిరిగి నియమించుకోవడానికి ప్రస్తుత ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ ఆసక్తి చూపకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ వరకు విభిన్న రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ రెండు ప్రధాన వాటాదారుల్లో ఒకటి. మరో కీలక ట్రస్ట్ అయిన సర్ రతన్ టాటా ట్రస్ట్ ప్రస్తుతం బోర్డు కూర్పుపై నియంత్రణ సంస్థ విచారణను ఎదుర్కొంటోంది. మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ ఆదేశాల కారణంగా ఆ ట్రస్ట్ సమావేశాలు నిర్వహించడంపైనా ఆంక్షలు ఉన్నాయి. చంద్రశేఖరన్ మూడోసారి ఛైర్మన్‌గా కొనసాగేందుకు తనను తాను ప్రతిపాదిం చుకోవడం లేదని టాటా సన్స్ నామినీ డైరెక్టర్లకు ఈమెయిల్ ద్వారా తెలియజేసినట్లు టాటా ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. టాటా సన్స్ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌కు అనుగుణంగా, కొత్త బోర్డు ఛైర్మన్‌గా నియమించాల్సిన వ్యక్తిని సిఫారసు చేసేందుకు వీలుగా వీలైనంత త్వరగా సెలెక్షన్ కమిటీ ఏర్పాటును ప్రారంభించాలని తీర్మానించినట్లు వెల్లడించారు. నాయకత్వ మార్పు సజావుగా, నిర్ణీత సమయంలో, క్రమబద్ధంగా జరిగేలా టాటా సన్స్‌కు పూర్తి సహకారం అందిస్తామని టాటా ట్రస్ట్స్ తెలిపింది. టాటా సన్స్, టాటా గ్రూప్ విలువలు, దీర్ఘకాలిక ప్రయోజనాలకు అనుగుణంగా ఈ మార్పు ఉండేలా చూస్తామని పేర్కొంది.గత పదేళ్లలో టాటా సన్స్, టాటా గ్రూప్‌కు చంద్రశేఖరన్ అందించిన విశేష సేవలు, నాయకత్వానికి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ పేర్కొంది. ముఖ్యంగా గ్రూప్‌లో గణనీయమైన మార్పులు, వృద్ధి, పరివర్తన చోటుచేసుకున్న సమయంలో ఆయన అందించిన సేవలను ట్రస్ట్ కొనియాడింది.

## వాణిజ్యం



## భారత్ వాణిజ్య లోటు జులైలో 31.9 బిలియన్ డాలర్లకు పెరుగుదల

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** భారత్ వాణిజ్య లోటు జులై నెలలో 31.9 బిలియన్ డాలర్లకు పెరిగింది. గత ఏడాది ఇదే నెలలో నమోదైన 27.88 బిలియన్ డాలర్లతో పోలిస్తే లోటు పెరిగినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ గురువారం వెల్లడించింది. వాణిజ్యనిపుణుల అంచనా 30.5 బిలియన్ డాలర్లతో పోలిస్తే వాణిజ్య లోటు కొంత అధికంగా నమోదైంది. జులైలో దిగుమతులు 17.5 శాతం వార్షిక వృద్ధితో 76.22 బిలియన్ డాలర్లకు చేరుకోగా, ఎగుమతులు 19.6 శాతం పెరిగి 44 బిలియన్ డాలర్లకు చేరాయి. దిగుమతులతో పోలిస్తే ఎగుమతులు వేగంగా పెరిగినప్పటికీ, దిగుమతుల విలువ అధికంగా ఉండటంతో వాణిజ్య లోటు విస్తరించింది. మొత్తం వాణిజ్యంలో సరుకుల వాణిజ్య లోటు వాటా గత ఏడాది 27.3 శాతంగా ఉండగా, ఈ ఏడాది జూలైలో 26.5 శాతానికి తగ్గింది.ఎగుమతుల్లో ఎలక్ట్రానిక్స్ దూకుడుపెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, రత్నాలు-ఆభరణాలు, ఇనుప ఖనిజం, మాంసం-పౌల్ట్రీ ఉత్పత్తులు ఎగుమతుల్లో మెరుగైన పనితీరు కనబరిచాయి. ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 30 శాతం పెరిగాయి. ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు 18 శాతం, రత్నాలు-ఆభరణాలు 6 శాతం, ఇనుప ఖనిజం 33 శాతం, మాంసం-పౌల్ట్రీ ఉత్పత్తుల ఎగుమతులు 45 శాతం వృద్ధి చెందాయి. తైవాన్, జపాన్, వియత్నాం, ఆస్ట్రేలియా, స్పెయిన్, ఆస్ట్రియా, ఆసియాన్ దేశాలకు ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. కెన్యా, ఎస్‌ఏసీయూ ప్రాంతాలకు కూడా ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో ఎగుమతులు పెరిగాయి.




## స్వల్ప లాభాలతోనే సెన్సెక్స్, నిఫ్టీ ముగింపు

**ముంబయి, ఆగస్టు 13:** వారాంతపు బీఎస్‌ఈ డెరివేటివ్స్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో గురువారం దేశీయ స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకుల మధ్య స్వల్ప లాభనష్టాలతో ముగిశాయి. మెటల్, ప్రైవేట్ బ్యాంకింగ్, ఆర్థిక సేవల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తగా ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, కెమికల్ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్‌కు అండగా నిలిచాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు రెండూ లాభాల్లో ముగిశాయి.బీఎస్‌ఈ సెన్సెక్స్ 113.61 పాయింట్లు లాభపడింది. మరోవైపు నిఫ్టీ 50 40.10 పాయింట్లు కోల్పోయి 24,395.85 వద్ద ముగిసింది. నిఫ్టీని పైకి నడిపిన షేర్లలో లార్సెన్ అండ్ టూబ్రో, ఎటర్నల్ 1.26 శాతం చొప్పున, టీసీఎస్ 1.08 శాతం చొప్పున లాభపడ్డాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.29 శాతం, బీఎస్‌ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.09 శాతం చొప్పున పెరిగాయి. బీఎస్‌ఈలో మొత్తం 2,192 షేర్లు లాభపడగా, 2,127 షేర్లు నష్టపోయాయి. మరో 237 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు అక్టోబర్ 2026 ఫ్యూచర్స్ బ్యారెల్‌కు 1.64 డాలర్లు తగ్గి 87.34 డాలర్లకు చేరింది. విదేశీ మారక మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలపడింది. గత సెషన్‌లో 95.3325 వద్ద ముగిసిన రూపాయి గురువారం 95.4800 వద్ద కొనసాగింది. భారత్ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రాబడి 0.28 శాతం తగ్గి 6.758 శాతానికి చేరింది. గత సెషన్‌లో ఇది 6.777 శాతంగా ఉంది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ 0.44 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,54,200 వద్ద నిలిచాయి. టాటా మోటార్స్ 3.82 శాతం, గుజరాత్ ఫ్లోరోకెమికల్స్ 3.57 శాతం, మిశ్రధాతు నిగమ్ 9.19 శాతం, బ్లాక్ బాక్స్ 7.76 శాతం, లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ 1.63 శాతం, ఆస్ట్రల్ 8.74 శాతం, లింకన్ ఫార్మాస్యూటికల్స్ 4.79 శాతం పెరిగితే థైరోకేర్ టెక్నాలజీస్ 6.21 శాతం, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ 1.54 శాతం, 63 మూన్స్ టెక్నాలజీస్ 8.09 శాతం, 63 మూన్స్ టెక్నాలజీస్ 8.09 శాతం చొప్పున క్షీణించాయి.

## 'ఫండ్స్'లోకి రికార్డు స్థాయిలో పెట్టుబడులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** భారత మ్యూచువల్ ఫండ్‌రంగంలోకి వచ్చిన మొత్తం నికర పెట్టుబడులు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి రూ.85.75 లక్షల కోట్లకు చేరుకున్నాయి. వివిధ మార్కెట్ విభాగాల్లో పెట్టుబడిదారుల విశ్వాసం బలంగా కొనసాగుతున్నదానికి పెట్టుబడుల రాక నిదర్శనమని ఆంఫీ వెల్లడించింది.జిఐపిఎల్ క్యాపిటల్ నివేదిక ప్రకారం.. జూన్‌తో పోలిస్తే జూలైలో మొత్తం నికర పెట్టుబడులు సుమారు 4.30 శాతం పెరిగాయి. ఏడాది కాలంలో మ్యూచువల్ ఫండ్ల నికర ఆస్తుల నిర్వహణ విలువ 13.80 శాతం వృద్ధిని నమోదు చేసింది. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల యాజమాన్య వివరాలను పరిశీలిస్తే వివిధ వర్గాల మధ్య దాదాపు సమతుల్య పంపిణీ కనిపించింది. మొత్తం మ్యూచువల్ ఫండ్ ఆస్తుల్లో కార్పొరేట్లు 37.17 శాతంతో అత్యధిక వాటాను కలిగి ఉన్నాయి. ఆ తర్వాత అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు 33.83 శాతం వాటాతో రెండో స్థానంలో ఉన్నారు. రిటైల్ ఇన్వెస్టర్ల వాటా సుమారు 27 శాతంగా ఉండగా, బ్యాంకులు, ఆర్థిక సంస్థల వాటా 1.92 శాతంగా ఉంది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు , విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా కలిపి సుమారు 0.07 శాతంగా ఉంది.ఇతర రంగాల్లో పరిశీలిస్తే ఈక్విటీ, బ్యాలెన్స్‌డ్ ఫండ్లు ఆధిపత్యం కొనసాగిస్తున్నాయి. మొత్తం మ్యూచువల్ ఫండ్ ఆస్తుల్లో వీటి వాటా 61.06 శాతంగా ఉంది. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు, ఫండ్ ఆఫ్ ఫండ్స్14.01 శాతం వాటాను నిర్వహిస్తున్నాయి.లిక్విడ్, మనీ మార్కెట్ ఫండ్ల వాటా 13.37 శాతంగా ఉండగా లిక్విడ్, మనీ మార్కెట్ ఉత్పత్తులను మినహాయించిన డెట్ ఫండ్ల వాటా 11.57 శాతంగా ఉంది. ఈక్విటీ ఫండ్లలోకి రూ.24,697 కోట్ల పెట్టుబడులు జూలైలో ఈక్విటీ విభాగంపై పెట్టుబడిదారుల్లో భారీ ఆసక్తి కనిపించింది. ఈ విభాగంలోకి మొత్తం రూ.24,697 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. ఈక్విటీ విభాగంలో పెట్టుబడిదారులు స్మాల్‌క్యాప్ ఫండ్లకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వగా మిడ్‌క్యాప్, ఫ్లెక్సీక్యాప్ తదితర కేటగిరీలు కూడా మెరుగైన పెట్టుబడులను ఆకర్షించాయి.









Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.

14 -8Pg9th cheli:14 -8Pg9th cheli.qxd 8/13/2026 11:28 PM Page 1



# పరిమళంతో జ్ఞాపకశక్తి మెరుగు



అమ్మకిస్తే జాగ్రత్తగా దాస్తుందని, పిల్లలు వస్తువులను మనకిస్తారు. తీరా తిరిగి వాళ్లడిగినప్పుడే చిక్కంతా. జాగ్రత్తగా దాచిపెట్టామని మాత్రమే గుర్తుంటుంది. అయితే.. ఎంతకూ జ్ఞాపకం రాదు. పని ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు వంటివి ఎదురైనప్పుడు జ్ఞాపకశక్తి దూరమవుతుంటుంది. అలాగే మెనోపాజ్ సమయంలోనూ ఇది తగ్గుతుంటుంది. దీన్ని తిరిగి తీసుకురావడంలో పరిమళద్రవ్యాలు సహాయపడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. మెదడులో మరుగున పడే జ్ఞాపకాలను తిరిగి పరిమళద్రవ్యాల వాసనలతో బయటకి తేవొచ్చని పిట్స్ బర్గ్ యూనివర్సిటీ ఆఫ్ మెడిసిన్ పరిశోధక బృందం తాజాగా ఓ అధ్యయనంలో తేల్చింది. జ్ఞాపకం తెచ్చుకోవడం కోసం తీవ్రంగా ఆలోచించేటప్పుడు మెదడు వెంటనే స్పందించాల్సి ఉంటుంది. అయితే తీవ్ర ఒత్తిడివల్ల మెదడులోని అక్కడి భాగం నియంత్రణకు గురవుతుంది. ఈ సమస్య ఉన్న కొందరికి కాఫీ గింజలు, లవంగ మొగ్గలు, నారింజ ఎసెన్షియల్ ఆయిల్ వంటివాటితో చేసిన కొన్నిరకాల పరిమళద్రవ్యాల వాసనలను చూపించారు. దాంతో దూరమైన వారి జ్ఞాపకాలు క్రమేపీ తిరిగి రావడం మొదలయ్యాయి. చిన్న చిన్న విషయాలను కూడా ఒక్కోసారి మర్చిపోయేలా చేస్తోంది. అందుకే ఉదయం ఇంటిలోని మెదలు పెట్టేటప్పుడు లేదా రాత్రి నిద్రపోయే ముందు గదిని సహజసిద్ధమైన పరిమళాలతో నింపితే చాలు. జ్ఞాపకశక్తిని కాపాడుకోవచ్చు. మరిగించిన ముప్పావుకప్పు నీటిలో నాలుగు టేబుల్‌స్పూన్ల తులసి ఆకులు వేసి రెండు నిమిషాలు మరగనిచ్చి చల్లార్చాలి. దీన్ని వడకట్టి స్ప్రే సీసాలో నింపాలి. ఇందులో ముప్పావు కప్పు డిస్టిల్డ్ వాటర్, ఆయిదు చుక్కల నిమ్మ ఎసెన్షియల్ ఆయిల్ వేసిబాగా కలపాలి.ఈ మిశ్రమాన్ని ఇల్లంతా స్ప్రే చేస్తే చాలు. అలాగే చిన్న గిన్నె లేదా మట్టికుండలో గుప్పెడు నారింజపండు ముక్కలు ఏడెనిమిది లవంగాలు, చిన్నచిన్నగా కట్ చేసిన అయిదారు దాల్చినచెక్క ముక్కలను వేయాలి. ఇవి మునిగేలా నీటిని పోసి బాగామరిగిస్తే చాలు.ఇల్లంతా సువాసనతో నిండుతుంది. కుండీలో విరిసిన గులాబీలు నాలుగింటిని వాజ్‌లో ఉంచి భోజనబల్ల లేదా టీపాయిపై సర్దాలి. గులాబీల పరిమళం జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తూనే ఉల్లాసంగానూ ఉంచుతుంది.

## చిన్న చిట్కా పెద్ద మార్పు!



**వంట చేసే క్రమంలో వెలువడే కొన్ని వాయువులు పర్యావరణాన్ని కలుషితం చేయడంతో పాటు మన ఆరోగ్యానికీ ముప్పు తెచ్చిపెడతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే వంట చేసే క్రమంలో చిన్న చిన్న జాగ్రత్తలు, చిట్కాలు తెలుసుకుందాం..**


వంట చేసే క్రమంలో కొంతమంది పాత్రలపై మూత పెట్టరు. మరికొందమంది సగం వరకే పెట్టి వదిలేస్తారు. మూత పెట్టకుండా వండుకోవడం వల్ల 20 శాతం అదనంగా ఇంధనం వాడాల్సి వస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి కాబట్టి ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవడం మంచిది. ఆహారాన్ని మాటిమాటికీ వేడి చేయడం ఆరోగ్యకరం కాదు. పైగా దీని వల్ల కూడా గ్యాస్ వృథా అవుతుంది. తద్వారా పర్యావరణానికి నష్టమే. ఓపిక లేకో, సమయం సరిపోకో.. కొంతమంది కాయ గూరలను పెద్ద పెద్ద ముక్కలుగా తరుగుతారు. పెద్ద ముక్కలు ఉడకడానికి ఎక్కువ సమయం పడుతుంది.. గ్యాస్ కూడా వృథా! అదే చిన్న ముక్కలుగా కట్ చేస్తే.. త్వరగా ఉడికి పోతాయి.. కాలుష్యమూ తగ్గుతుంది.. అంతేకాదు.. కూర రుచి గానూ ఉంటుంది. కిచెన్‌లో పోగయ్యే తడి చెత్త కూడా వాతావరణం కాలుష్య కారకమే! అయితే ఈ వృథాతో పాటు కుళ్లిపోయిన కాయగూరలు/పండ్లు, వాడిన కాఫీ/టీ పొడి పిప్పి, కోడిగుడ్డు పెంకులు, టీ బ్యాగ్స్.. వంటివన్నీ కలిపి కంపోస్ట్ ఎరువుగా మార్చితే.. ఇటు దీన్ని ఇంట్లో పెంచుకునే మొక్కలకు ఎరువుగానూ ఉపయోగపడుతుంది. ఎవరి కిచెన్‌లో చూసినా ప్లాస్టిక్ డబ్బాలు, ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తుంటాయి. నిత్యావసరాలు, కాయగూరలు తీసుకురావ డానికి చాలామంది ప్లాస్టిక్ సంచులే ఉపయోగిస్తారు. వీటికి బదులుగా క్లాత్ బ్యాగ్స్ ఉపయోగించడం, నిత్యావసరాలను గాజు/ స్టీల్/సిలికాన్‌తో తయారుచేసిన డబ్బాల్లో భద్రపరచుకోవడం.. వంటివీ కిచెన్‌లో కాలుష్యాన్ని తగ్గించుకునేందుకు చక్కటి ప్రత్యామ్నాయ మార్గాలు.

# శ్రావణ మాసం

హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసం విశిష్టమైనదిగా భావిస్తారు. చాంద్రమానం ప్రకారం.. తెలుగు మాసాల్లో ఐదో మాసం శ్రావణ మాసం. పౌర్ణమి తిది రోజు చంద్రుడు శ్రవణ నక్షత్రంలో ఉంటాడు కాబట్టి ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. అలాగే.. స్థితికారుడైన శ్రీ మహావిష్ణువు యొక్క జన్మ నక్షత్రం కూడా శ్రావణ నక్షత్రం కాబట్టి శ్రావణ మాసం అని కూడా వచ్చిందని చెబుతారు. ఈ మాసంలో చేసే పూజలు ఎంతో విశిష్టమైనవిగా హిందు ఆచారాన్ని పాటించే వారి నమ్మకం. దేవతలకు అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణ మాసం లక్ష్మీ మ్రదేవి ఎంతో ఇష్టమైన ఈ మాసంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల దీర్ఘసుమంగళీ ప్రాప్తంతో పాటు అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పెద్దల ఉవాచ. తిథులతో కూడా సంబంధం లేకుండా అష్టమి, నవమి, అమావాస్య రోజుల్లో కూడా పూజలు, పండుగలు చేసే మాసం ఈ శ్రావణ మాసం మాత్రమే. అందుకే దీన్ని అత్యంత శుభప్రదమైన మాసంగా భావిస్తారు. ఈ శ్రావణ మాసంలో శివ కేశవులను నిష్ఠతో, అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. శ్రావణ సోమవారం, శ్రావణ మంగళవారం, శ్రావణ శుక్రవారం, శ్రావణ శనివారం ఇలా ఈమాసంలో ప్రతి రోజూ విశిష్టతతో కూడుకున్నదే. ఈ మాసంలో చేసే పూజలు విశేషమైన ఫలితాలు ఇస్తాయని నమ్మకం.

## ఆధారం ఇస్తేనే ఆరోగ్యంగా..

**ఎండా, వానా, చలీ.. వంటివాటి నుంచి మనం రక్షణ ఏర్పాటు చేసుకున్నట్లే మొక్కల విషయం లోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే అవి ఆరోగ్యంగా ఉంటాయి.**



వర్షం, బలమైన గాలుల వల్ల పొడవుగా ఉన్నవీ, కాయలూ, పండ్లతో ఉన్న మొక్కలు రకాలూ ఇట్టే విరిగిపోతుంటాయి. అలాకాకుండా ఉండాలంటే మొక్కలను గ్రిల్‌కో,పెద్ద చెట్టుకో తాడుతో కట్టేయాలి. వర్షాకాలంలో కుండీల్లో అదనపు నీరు నిలిచి మొక్కలు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. వీలైతే వాటిని రూఫ్ కిందకో, పెద్ద చెట్టు నీడకో తెచ్చి పెట్టడం మేలు. ఆ అవకాశం లేకపోతే మొదలు చుట్టూ ప్లాస్టిక్ షీట్ కప్పేయండి. తరచూ వర్షాల్లో తడవడంవల్ల ఆకులూ, పూలూ వాడిపోవడం, కుళ్లిపోవడం జరగొచ్చు. అలాంటివాటిని ఎప్పటికప్పుడు తీసేయాలి. లేదంటే ఈ సమస్య మిగిలిన భాగాలకూ వ్యాపించొచ్చు. ఇలాంటప్పుడు బేకింగ్ సోడా, కార్న్‌పౌడర్, దాల్చినచెక్క పొడి వంటివి చల్లుకుంటే సరి. తెగుళ్లను నియంత్రించొచ్చు.

# అలసట లేకుండా పని చేయాలంటే..



**ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులు.. క్షణం తీరికుండదు.. ఒత్తిడి, అలసట.. ఈ విధంగా అలసట రాకుండా ఉండాలంటే శరీరంలో తగినంత శక్తి ఉండాలి. మరి ఆ శక్తి రావాలంటే ఏం చేయాలి?**

ప్రొటీన్లు మెండుగా ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీర కండర వ్యవస్థ దృఢమవుతుంది. దీంతో ఎలాంటి అలసట లేకుండా సునాయాసంగా పనులు చేసుకోవడం సాధ్యమవుతుంది. అలాగే ప్రొటీన్లు గుండె బలంగా ఉండేందుకు, రోగ నిరోధకశక్తిని పెంపొందిం చేందుకూ దోహదం చేస్తాయి.

అవసరమైన మేరకు ప్రొటీన్లు లభించే ఆహారం తీసుకుంటే తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండిన భావన కూడా కలుగుతుంది.

**నట్స్...** ప్రొటీన్లతో నిండిన బాదం పప్పు, పిస్తా, అక్రోట్ వంటి గింజలను ప్రతిరోజూ పరిమి తంగా తీసుకోవడం మంచిది. అవి గుండెకు మేలు చేస్తాయి. సలాడ్లు కూరగాయలతో కూడా వీటిని కలుపుకొని తినొచ్చు. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవాలి.

**పాలు, పాట పదార్థాలు ...** ...కండరాల నిర్మాణానికి తోడ్పడే ప్రొటీన్లు పాల పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటు తగ్గటానికి తోడ్పడతాయి. ఈ క్రమంలో తక్కువ కొవ్వు ఉండే పాల పదార్థాలను తీసుకోవాలి.

**సోయాబీన్స్..** సోయాబీన్స్‌లో ప్రొటీన్ల మెతాదు ఎక్కువ. వీటిని సోయా పాలు, సోయా పేస్ట్, టోఫూ రూపంలోనూ తీసుకోవచ్చు. మామూలు పాలలో మాదిరిగానే సోయా పాలలోనూ ప్రొటీన్ ఉంటుంది. అయితే ఇవి కొంతమంది పడకపోవచ్చు. అలాంటి తీసువకునే విషయంలో వైద్యులను సంప్రదించాలి. అలాగే బఠానీలు, రాజ్మా, బీన్స్, చిక్కుళ్లు, ఇతర కూరగాయల్లోనూ ప్రొటీన్ ఉంటుంది. చేపల్లో ప్రొటీన్లతో పాటు గుండెకు మేలు చేసే ఒమేగా కొవ్వు ఆమ్లాలూ ఎక్కువగానే ఉంటాయి. ఇతర మాంసాహార పదార్థాల్లో కూడా ప్రొటీన్లు దండిగా ఉంటాయి. అయితే వీటిల్లో కొవ్వు కూడా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మితంగానే తినాలి. ఈ క్రమంలో చర్మం తీసేసిన చికెన్ తీసుకోవడం మంచిది. అలాగే కోడి గుడ్డులో కూడా ప్రొటీన్ ఉంటుంది.కానీ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు, గుండెజబ్బు, మధుమేహం వంటి సమస్యలు ఉన్నవారు డాక్టర్ల సలహా మేరకే ఎన్ని గుడ్లను తినొచ్చో నిర్ణయించుకోవాలి.

## పోషకాల 'పుట్ట'



**ఒక్కో సారి** మనసు దిగులుగా ఉంటుంది. భావోద్వేగాలూ పెల్లు బుకుతూ ఉంటాయి. కానీ, ఇలా తరచూ జరుగుతూ ఉంటే మాత్రం మీ డైట్‌లో కొన్నిరోజులు మాష్రూమ్‌ని చేర్చుకుని చూడండి. ఇందులోని పొటాషియం ఆ భావనని పోగొట్టి కొన్ని రోజులు మష్రూమ్‌ని చేర్చుకుని చూడండి. ఇందులోని పొటాషియం ఆ భావనని పోగొట్టి మిమ్మల్ని చురుగ్గా మారుస్తుందని చెబుతోంది పెన్ యూనివర్సిటీ పరిశోధన. ఇది కాదు..గతంలో ఓ అధ్యయనం పుట్టగొడుగుల్లో లభించే ఎర్గోథియోనీన్ అనే యాంటీకానఇసడెంట్‌కి..రొమ్ము క్యాన్సర్ కణాలతో పోరాడి అకాల మృత్యు ముప్పుని తగ్గించే శక్తి ఉందనీ వెల్లడించింది. ఇంతేనా మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ వీటిని తినడం వల్ల అందుకోవచ్చు. సాధారణంగా వర్షాకాలంలో మష్రూమ్స్ ఎక్కువగా దొరుకుతాయి. ఇవి రుచిలోనూ, పోషకాల్లోనూ నాన్‌వెజ్‌కిపోటీనివ్వ గలుగుతాయి. అందుకే, వీటికి సూపర్‌ఫుడ్ అనే పేరూ ఉంది. అయితే, ప్రపంచ వ్యాప్తంగా పుట్ట గొడుగుల్లో రెండు వేల రకాలు ఉంటే, మన దేశంలో 283 జాతులున్నాయి. వాటిల్లో వైట్ బటన్ మాష్రూమ్, ఆయిస్టర్ మష్రూమ్, చైనీస్ మష్రూమ్, మిల్కీ మష్రూమ్ వంటివాటినే మనం ఎక్కువగా పెంచుతాం. తింటుంటాం. వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో కెమికల్స్..యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్‌గా పనిచేస్తాయి. ఇందులోని పోషకాలు కొలెస్ట్రాల్‌ని తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎముకల్ని దృఢంగా మార్చే డి విటమిన్, ఆహారాన్ని శక్తిగా మార్చి శరీరానికి అందించే బి12 వంటి కీలకమైన పోషకాల్నీ అందిస్తాయి. కండరాల పనితీరుని, వ్యాధినిరోధకశక్తినీ పెంపొందించే ప్రొటీన్ కూడా పుట్టగొడుగుల నుంచి తగినంతగా అందుతుంది. ఆరోగ్యానికి రక్షణనూ

# 'అగధ' చూసి ఆనందంగా ఉంది: కామాక్షి భాస్కర్ల



**'అగధ'లోని వస్త్రాధారణ గురించి చెప్పండి?**
అగధలో ప్రతీది కూడా రాజు విజన్ అని చెప్పుకోవచ్చు. ప్రతీది డిఫరెంట్‌గా ఉండాలని ముందే ఆయన అనుకున్నారు. అలాంటి చీరకట్టులో నాకు కాస్త ఇబ్బంది అనిపించింది.

**'అగధ'లోని యాక్షన్ సీక్వెన్స్ గురించి చెప్పండి?**
అగధలోని యాక్షన్ సీక్వెన్స్ కోసం మేం ముందుగానే వర్క్ షాప్స్ చేశాం. రిహార్సల్స్ చేశాం.

**అగధ జర్నీలో మీరు ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి?..**
మహాదేవి పాత్ర కోసం మారేందుకు నాకు టైం పట్టింది. కామాక్షి గా నన్ను నేను పక్కనపెట్టి, నా ప్రిన్సిపల్స్ పక్కన పెట్టి ఆ పాత్ర కోసం మారడానికి ఇబ్బంది అనిపించింది.

**ఎం.ఎస్. రాజు నుంచి ఫోన్ రావడం ఎలా అనిపించింది?..**
నాకు ఎం.ఎస్. రాజు గారి సినిమాలు అంటే చాలా ఇష్టం. ఆయన తీసిన వాటిల్లో మనసంతా నువ్వే నాకు ఆల్ టైం ఫేవరేట్. ఆయన అగధ్ధ కోసం ఫోన్ చేయడంతో చాలా సంతోషంగా అనిపించింది.

**పొలిమేర' అగధ' వంటి చిత్రాలు మీకు వస్తుండటం ప్లస్ పాయింట్ అనుకుంటున్నారా? మైనస్ అనుకుంటున్నారా?**
జానర్స్ రిపీట్ అవుతున్నా పాత్రలు మాత్రం కొత్తగానే ఉంటున్నాయి. ఓ సినిమాని కామాక్షి భుజానికి ఎత్తుకుని ముందుకు తీసుకు వెళ్లగలదు అనే నమ్మకాన్ని ఏర్పర్చాలి.

**గ్లామర్ పాత్రలను ఎందుకు ఎంచుకోవడం లేదు?..**
ఎప్పుడూ ఒకే రకమైన పాత్రలు చేయడం నాకు నచ్చదు. పైగా మన ఇంట్లోని మహిళలను రిప్రజెంట్ చేసే కారెక్టర్స్‌ని పోషించాలని అనుకుంటున్నాను.

**అగధలోని హారర్, థ్రిల్లింగ్ మూమెంట్స్ గురించి చెప్పండి?..**అగధలో మరీ ఎక్కువ హారర్ మూమెంట్స్ ఉండవు. చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది.

**ఇతర ఆర్టిస్టుల గురించి చెప్పండి?..**
మా సెట్‌లో అందరూ అద్భుతమైన ఆర్టిస్టులే. అందరికీ చాలా అనుభవం ఉంది.

**టెక్నికల్ టీం గురించి చెప్పండి?..**
నాని చమిడిశెట్టి గారి కెమెరా వర్క్ అద్భుతంగా వచ్చింది. నాని చమిడిశెట్టి ఈ మూవీలో ఎన్నో ప్రయోగాలు చేశారు. రాజు విజన్‌కి ఆయన ప్రాణం పోశారు. డీఐ అద్భుతంగా అనిపించింది.

**డాక్టర్ వృత్తిని పక్కన పెట్టారా?..**
అవునండి..



# 'ఇరుముడి' ట్రైలర్ లాంచ్



మాస్ మహారాజా రవి తేజ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇరుముడి చిత్రం ఆగస్టు 21న థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో అంచనాలను పెరుగు తున్నాయి. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం గ్లింప్స్ పాటలతో ఇప్పటికే చాలా ఆసక్తిని రేకెత్తించింది. ఇప్పుడు చిత్ర నిర్మాతలు తెలుగు, తమిళ భాషలలో విడుదల చేసిన థియేట్రికల్ ట్రైలర్‌తో ఉత్సాహాన్ని మరో మెట్టు పైకి తీసుకెళ్లారు. భీమవరంలో గ్రాండ్‌గా జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ: హలో భీమవరం. నాకు భీమవరంతో మంచి అనుబంధం ఉంది. నా జీవితంలో దాదాపు ఎనిమిది నెలల పాటు కేవలం సినిమాలు చూడటానికే భీమవరంలో ఉన్నాను. మా తాతయ్య, నానమ్మ డీఎన్ఆర్ కాలేజ్ దగ్గర ఉండేవారు. భీమవరానికి చాలా మంచి వైబ్ ఉంటుంది. మాది భీమవరం అని ఎవరైనా సరే గర్వంగా చెప్పుకుంటారు. ఇక్కడి ఫుడ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నెక్స్ట్ సంక్రాంతికి కోడిపందాల్లో కలుద్దాం. మీతో పాటు ట్రైలర్ నేను కూడా ఈరోజే చూశాను. మీ అందరికీ ట్రైలర్ నచ్చడం చాలా హ్యాపీగా ఉంది. డైరెక్టర్ శివ నిర్వాణ మాట్లాడుతూ: వభీమవరంలో ఈ వేడుక జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. అందరికీ ఈ ట్రైలర్ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ట్రైలర్‌లో ఉన్నదానికి పదింతలు సినిమాలో ఉంటుంది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ: రవితేజ నా కజిన్. స్టార్ అవ్వాలని సంకల్పంతో ఎవరి సహాయం లేకుండా తన కష్టంతో పైకి వచ్చిన రియల్ హీరో మా రవితేజ. మా జిల్లా వ్యక్తి మాస్ మహారాజా అవ్వడం, తను ఈ వేడుకకు రావడం, నేను ఇక్కడ ఎమ్మెల్యేగా ఉండడం నిజంగా చాలా మెమొరబుల్ మూమెంట్. నాకు చాలా గర్వంగా అనిపిస్తోంది.

# 'రోమాంచకం' టైటిల్ సాంగ్ రిలీజ్



సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న మూవీ బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణు గోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. మరోవైపు ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ సక్సెస్ ఫుల్ గా కొనసాగుతున్నాయి. ఇప్పటికే 'రోమాంచకం' సినిమా నుంచి రిలీజ్ చేసిన 'రాధా రమణ సాంగ్‌కు మ్యూజిక్ లవర్స్ నుంచి హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి టైటిల్ సాంగ్ ను రిలీజ్ చేశారు మేకర్స్. రోమాంచకం' సినిమా టైటిల్ సాంగ్ ను మ్యూజిక్ డైరెక్టర్ వాసుకీ వైభవ్ మంచి బీట్, మెలోడీ కలిపి కంపోజ్ చేసి ఎనర్జిటిక్ గా పాడారు. ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ తను అలవోకగా రాయగల మెచ్యూర్డ్ లిరిక్స్ అందించారు. ఈ పాట ఎలా ఉందో చూస్తే ఈ లోకం ఎంతో కొత్తగా, మారిపోయో ఈ దినం, లోకంలో ఉందీ కేవలం నువ్వు నేను ఇద్దరం, గడియారం లేని సమయాలు, కొలమానం లేని వరదాలు, అంతా మనకు సొంతాలు, విసుగంటూ రాని విషయాలు, విషయాలే లేని వివరాలు, ఎంతో ఎంతో మధురాలు, ఇలా ఇలా మొదటిసారి మొదల య్యిందే, రోమాంచకం, రోమాంచకం, రోమాంచకం, రోమాంచకం... అంటూ ఫస్ట్‌లవ్‌లోని ఎగ్జైట్ మెంట్, ప్రేమికులు మాత్రమే ఫీలయ్యే క్యూట్ మూవ్ మెంట్స్‌ను చూపిస్తూ ఈ పాటను బ్యూటిఫుల్ గా చిత్రీకరించారు.'రోమాంచకం' సినిమా ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు సెప్టెంబర్ 3న తెరపైకి రాబోతోంది.

# 'హుషార్ పిట్టలు' ప్రి రిలీజ్



అన్ష్, వాసవి గణేషన్ జంటగా రూపొందిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషార్ పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మించిన ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. ఈ సినిమాని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు ఆగస్ట్ 15న భారీ ఎత్తున విడుదల చేస్తున్నాయి.నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ.. .. 'హుషార్ పిట్టలు'నుంచి వచ్చిన ప్రతీ కంటెంట్ అందరికీ నచ్చింది. ఆల్రెడీ ప్రీమియర్లకు మంచి రెస్పాన్స్ వస్తోంది. రిలీజ్ టైంలో నాకు సురేష్‌బాబు, శిరీష్, బెక్కెం వేణు గోపాల్ సహాయం చేస్తున్నారు. మేమంతా కష్టపడి సినిమాని తీశాం. మేం ఒంటరిగా పోరాడు తున్నాం. మా ఈ పోరాటంలో మీడియా మాకు సపోర్ట్ చేయాలని కోరుకుంటు న్నాను. ..అన్ష్ మాట్లాడుతూ.. .. హుషార్ పిట్టలు సినిమాతో హిట్టు కొట్ట బోతోన్నా అని తొడగొట్టి చెబుతున్నా. చిన్నప్పటి నుంచి స్టేజ్ మీద నాటకాలు వేస్తుండేవాడిని. కృష్ణా నగర్‌లో జరిగిన ఓ ఆడిషన్‌కి వెళ్తే.. అక్కడ కాఫీ కప్పులు తీయించారు. కానీ నా అభిమాన హీరో చిరంజీవి ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు కదిలాను. హీరోయిన్ వాసవి గణేశన్ మాట్లాడుతూ ' ఈ సినిమా ప్రివ్యూ చూసి అందరూ ఎంజాయ్ చేస్తున్నారు..మా అమ్మమ్మ ఏజ్ ఉన్న వాళ్ళు కూడా ఈ సినిమా చూస్తున్నారు..

# 'పళ్ళ బురుసు'తో ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు: ఉదయ్ చౌహాన్



**మీ నేపథ్యం గురించి చెప్పండి? పళ్ళ బురుసు ఎలా మొదలైంది?**
మాది మహబూబ్‌నగర్ జిల్లా. అమ్మానాన్న ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. నాకు చిన్నప్పటి నుంచే సినిమాలంటే చాలా ఇష్టం. ఇంట్లో డాక్టర్ చదవని చెప్పారు. కానీ సినిమాలపై పాషన్‌తో మాస్ కమ్యూనికేషన్‌లో జాయిన్ అయ్యాను.

**ఈ కథకు మీ స్వస్థలం నుంచి ఎలాంటి స్ఫూర్తి వచ్చింది?**
నేను మహబూబ్‌నగర్‌లోనే పుట్టాను. ఊర్లో జరిగే సంఘటనలు, అక్కడి పాత్రలను చాలా జాగ్రత్తగా పరిశీలించేవాడిని.

**సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్‌లను ఈ పాత్రలకు ఎంపిక చేయడానికి కారణం?**
సుధాకర్ రెడ్డి బలగం సినిమాలో నటించారు. అయితే అందులో ఆయన కనిపించేది చాలా తక్కువ సమయం. మురళీధర్ కి కూడా డిజే టిల్లు తర్వాత మంచి గుర్తింపు వచ్చింది. బలంగంలో సుధాకర్‌ని, మురళీధర్‌ని మామా అల్లుళ్లుగా చూశాం. ఇందులో దానికి పూర్తి భిన్నంగా, నా కథకు సరిపోయేలా తండ్రి, కొడుకు పాత్రల్లో కనిపిస్తారు. వారి కెమిస్ట్రీ తెరపై చాలా అద్భుతంగా ఉంటుంది.

**సినిమా షూటింగ్ ఎక్కడ జరిగింది?**
సిద్దిపేట లచ్చపేట ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. కథకు సరిపోయే లొకేషన్స్, సీన్స్ అక్కడ చాలా సహజంగా దొరికాయి.

**ఈ కథకు ఏదైనా సంఘటన స్ఫూర్తిగా నిలిచిందా?**
ఊర్లో చాలా విషయాలు చూశాను. చిన్న చిన్న విషయాల గురించి చాలా పెద్ద గొడవలు జరుగుతాయి. కాసేపు గొడవపడతారు, ఆ తర్వాత మళ్లీ కలిసిపోతారు.

**నాగార్జున సినిమా చూశారా?**
నాగార్జున సినిమా చూసి చాలా హార్ట్ టచింగ్‌గా ఉందని అన్నారు. సినిమా డైలాగ్స్ చాలా బాగున్నాయని చెప్పారు.

**మీ ప్రీప్రొడక్షన్ వర్క్ ఎలా ఉంటుంది?**
నేను ప్రీప్రొడక్షన్‌ను చాలా బాగా చేసుకుంటాను. షూటింగ్‌కు వెళ్లే ముందే స్క్రిప్ట్, ఆర్ట్ వర్క్, లొకేషన్స్ అన్నీ పక్కాగా చూసుకుంటాను. ఒక సన్నివేశానికి ఏం అవసరమో ముందే క్లారిటీగా ఉండేలా ప్లాన్ చేసుకుంటాను.

**పళ్ళ బురుసు కోసం కేసు పెట్టడం ఏంటి? దానికంటే లాయర్ ఖర్చులే ఎక్కువ కదా అనే లాజిక్ ఉంది కదా?**
మీరు అన్నది కరెక్టే. నిజానికి ఇలాంటి క్యూరియాసిటీ రావాలనే నేను అలా రాశాను. ఆ కేసు వెనుక చాలా ఆసక్తికరమైన విషయాలు ఉంటాయి. అవన్నీ సినిమాలో చూసినప్పుడు ఎంజాయ్ చేస్తారు.

**పవన్ సిహెచ్ సంగీతం గురించి?**
పవన్ చాలా టాలెంటెడ్. లవ్ స్టోర్ఠీ పాటలు విన్న తర్వాత ఆయన పొటెన్షియల్ నాకు మరింత అర్థమైంది. ఈ కథ ఆయనకు చెప్పాను. కథ వినగానే చేస్తానని చెప్పారు.

# 'సిగ్మా' ఓలమ్మో వగలాడి సాంగ్ విడుదల




, లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ నిర్మిస్తున్న 'సిగ్మా' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దర్శకుడిగా జేసన్ సంజయ్ అరంగేట్రం చేస్తున్న ఈ చిత్రంలో సందీప్ కిషన్ హీరోగా నటిస్తు న్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ సిగ్మా స్టయిల్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజా గా మేకర్స్ ఓలమ్మో వగలాడి సాంగ్ రిలీజ్ చేశారు. తమన్ ఎనర్జిటిక్ నెంబర్‌ని కంపోజ్ చేశారు. యువన్ శంకర్ రాజా, సంజనా దివాకర్ కల్మంజే కలిసి ఆలపించిన ఈ పాట విన్నవెంటనే కనెక్ట్ అవుతుంది. కృష్ణ చైతన్య సాహిత్యం క్యాచిగా వుంది. ఈ పాటలో సందీప్ కిషన్, ఫారియా అబ్దుల్లా మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. ఇద్దరి మధ్య ఉన్న ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ పాటకు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. మెలోడీతో పాటు ఎనర్జిటిక్ బీట్‌తో సాగుతున్న ఈ పాట సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు థాసన్, యోగ్ జాపీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఈ చిత్రానికి థమన్ ఎస్ సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కె.ఎల్ ఎడిటింగ్, హరిహరసుధన్ విజువల్ ఎఫెక్ట్స్ సూపర్వైజం గా పనిచేస్తున్నారు. నాకు కావేరి పాత్ర ఇచ్చిన దర్శకుడు శివ నిర్వాణకి ధన్యవాదాలునిశాంత్ మాట్లాడుతూ: మా కాలేజ్ తరఫున హీరో రవితేజకి, డైరెక్టర్‌కి, టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్.

# పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుపై అధ్యయనం

## విద్యుత్ సంస్థలపై రుణ భారం తగ్గించేలా నిరంతర చర్యలు

### విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

### డిజిటల్ ట్విన్, అసెట్ హెల్త్ ఇండెక్స్‌పై ముఖ్యమంత్రి ప్రశంసలు



గురువారం విద్యుత్ శాఖపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చేలా సమగ్ర ప్రణాళికలను తయారుచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... రాష్ట్రంలోని 130 రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలన్నారు. పోలవరం వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట ఏర్పాటుపై వచ్చిన ప్రతిపాదన ప్రస్తావనకు వచ్చిన సందర్భంలో ముఖ్యమంత్రి ఈ సూచన చేశారు. ఈ మేరకు అధ్యయనం చేయడంతోపాటు... ఎకనమిక్ ఫీజిబిలిటీపై స్టడీ చేయాలన్నారు. ఇక ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఉన్నందున్న వివిధ రిజర్వాయర్లు.. ప్రాజెక్టుల్లో విద్యుత్ ఉత్పత్తి కష్టసాధ్యం కావచ్చనే అంశాన్ని ప్రస్తావిస్తూ... విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామికీకరణ వేగం పుంజుకోవడంతో పాటు... ప్రతి ఆరేళ్లకూ విద్యుత్ వినియోగం రెట్టింపు అవుతుందని... దానికి అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అదే సమయంలో విద్యుత్ పంపిణీ నష్టాలను మరింత తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు.

**సోలార్ విద్యుత్‌పై మరింత దృష్టి:** సౌర విద్యుత్ ఉత్పత్తిని వీలైనంత మేర పెంచాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పీఎం సూర్యఘర్ కింద 6 లక్షల సోలార్ కనెక్షన్లను సెప్టెంబరు నాటికి ఇన్‌స్టాల్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాన్ సూర్య ఘర్ కింద మరో 3 లక్షల కనెక్షన్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. వీటితో పాటు మరో 10 లక్షల కనెక్షన్ల కోసం కేంద్రానికి దరఖాస్తు చేయాలని చెప్పారు. ఇక కుసుమ్ పథకం కింద లక్ష్యాన్ని పూర్తిచేస్తూనే, అదనంగా 2,000 మెగావాట్ల సామర్థం కోసం కేంద్రాన్ని కోరాలని సీఎం సూచించారు. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ వంటి వనరులను సమన్వయం చేసుకుని తక్కువ ధరకు, నిరంతర విద్యుత్ అందించే వ్యవస్థను రూపొందించాలని సూచించారు. దీంతో పాటు విద్యుత్ కొనుగోలు ధరను ఈ ఏడాది యూనిట్‌కు రూ.4.60కు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సీఎం తెలిపారు. 2029 నాటికి యూనిట్ విద్యుత్ కొనుగోలు ధరను రూ.4కు తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తక్కువ ధర విద్యుత్ కొనుగోలుతోపాటు పవర్ స్వాపింగ్, కుసుమ్, సూర్యఘర్, పునరుత్పాదక విద్యుత్, స్టోరేజ్ వంటి వివిధ మోడళ్లను ఇంటిగ్రేట్ చేయాలన్నారు.

**విద్యుత్ సంస్థలకు రేటింగ్... కార్పొరేట్లతో పోటీ..** రాష్ట్రంలోని ఆరు విద్యుత్ సంస్థలకు పనితీరు ఆధారంగా రేటింగ్ విధానం తీసుకురావాలని సీఎం సూచించారు. ప్రతి సంస్థ సమర్థంగా పనిచేసేలా లక్ష్యాలు నిర్దేశించి, కార్పొరేట్ సంస్థలకు ధీటుగా విద్యుత్ సంస్థలను తీర్చిదిద్దాలని ఆదేశించారు. సంస్థల పనితీరు, ఆర్థిక సామర్థం, నిర్వహణ సామర్థ్యాలను నిరంతరం సమీక్షించాలని చెప్పారు. విద్యుత్ కొనుగోళ్లల్లో ఆప్టిమైజేషన్ ద్వారా రూ.234 కోట్లు, ప్రాంప్ట్ పేమెంట్ రిబేట్ కింద రూ.100 కోట్లను ఆదా చేసినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీఎం స్పందిస్తూ... విద్యుత్ సంస్థలపై రుణ భారాన్ని తగ్గించాలన్నారు. విద్యుత్ సంస్థల రుణాలపై నిరంతర సంప్రదింపులతో వడ్డీరేట్లను వీలైనంత మేర తగ్గించాలని ఆదేశించారు. సంస్థల పనితీరు మెరుగుపడుతున్న విషయాన్ని ఆర్థిక సంస్థల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ మేరకు ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఆస్తుల కల్పన, మూలధన పెట్టుబడుల కోసం మాత్రమే ఇకపై విద్యుత్ సంస్థలు అప్పులు తీసుకోవాలి తప్ప... ఇతర అవసరాలకు అప్పులు చేసే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. టారిఫ్ పెంచకుండా... కొనుగోలు వ్యయం, వడ్డీ భారం, పంపిణీ నష్టాలను తగ్గించడం ద్వారా సంస్థల ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. విద్యుత్ సంస్థల్లో డిజిటల్ ట్విన్ వ్యవస్థ, అసెట్ హెల్త్ ఇండెక్స్ విధానాలను అమలు చేస్తున్న అధికారులను సీఎం చంద్రబాబు అభినందించారు. విద్యుత్ వ్యవస్థలోని ఆస్తుల పరిస్థితిని డిజిటల్‌గా పర్యవేక్షించడం, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర పరికరాల కండీషన్ ను ముందుగానే అంచనా వేసి మరమ్మతులు, మార్పులకు చర్యలు తీసుకోవడం ద్వారా వ్యయాన్ని తగ్గించడంతోపాటు నాణ్యమైన విద్యుత్ ను వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవి, విద్యుత్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




ప్రయాణికుడికి బోర్డింగ్‌పాస్ అందిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, విజయవాడ యంపి కేశినేని చిన్ని

# గన్నవరం-వారణాసి విమానసర్వీసు ప్రారంభం

**గన్నవరం(కృష్ణా) , ఆగస్టు 13, ప్రభాతవార్త :** రాష్ట్రరాజధానికి అనుసంధానంగా ఉన్న ఏకైక విమానాశ్రయం గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం ఇక్కడి నుండి కొత్తగా వారణాసి, కోల్‌కత్తాకు విమానసర్వీసు గురువారం నుండి ప్రారంభమైంది. ఇండిగోసంస్థ ఈసర్వీసును నడుపుతుంది. వారంలో మూడురోజులపాటు నడిచే ఈసర్వీసు మధ్యాహ్నం 2.10గంటలకు కోల్‌కత్తాలో బయలు దేరి 3.55గంటలకు వారణాసి చేరుకుంటుంది. అక్కడి నుండి బయలుదేరి సాయంత్రం 5.50గంలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 6.20కి గన్నవరం నుండి బయలుదేరి రాత్రి 8.15గంటలకు వారణాసి, 10.15గంటలకు కోల్‌కత్తా చేరుకునేలా షెడ్యూల్ రూపొందించారు. మొదటి రోజు గన్నవరం నుండి 130మంది ప్రయాణికులతో విమానం వారణాసికి బయలుదేరి వెళ్ళింది. నూతన సర్వీసు ప్రారంభోత్సవం సందర్భంగా గన్నవరం విమానాశ్రయంలో జరిగిన కార్యక్రమంలో విజయవాడ యంపి కేశినేని చిన్ని, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి ప్రయాణికుడికి బోర్డింగ్‌పాస్‌ను అందచేసారు. ఈసందర్భంగా యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ శబరిమల యాత్రీకుల కోసం గన్నవరం నుండి కొచ్చిన్‌కు విమానసర్వీసులు ఏర్పాటు చేయాలని ఇండిగో సంస్థను కోరారు. ఈఏడాది గన్నవరం విమానాశ్రయంలో నూతన టెర్మినల్ భవనాన్ని ప్రారంభిస్తామన్నారు. ఇక్కడి నుండి మరిన్ని నగరాలకు విమానసర్వీసులు ప్రారంభించేలా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడిని కోరినట్లు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లా నుండి ఎంతోమంది విదేశాల్లో ఉంటున్నారని, ఇక్కడి నుండి విదేశాలకు సర్వీసులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈదిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. గన్నవరం విమానాశ్రయం అభివృద్ధికి కేంద్రరాష్ట్రప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని యంపి కేశినేని చిన్ని తెలిపారు. దేశంలోని ప్రధాన నగరాలకు సర్వీసులు ప్రారంభించేలా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. విమానాల రాకపోకలు పెరిగితే ఈప్రా ంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈకార్యక్రమంలో విమానాశ్రయం

# అనంతబాబు పిటిషన్ పై విచారణ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు13, ప్రభాతవార్త:** డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై కోర్టులో విచారణ జరిగింది. శాసనమండలి సమావేశాలు జరుగనున్నందున సమావేశానికి హాజరయ్యేందుకు తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని అనంతబాబు తరుపున పిటిషన్ వేశారు. ఈ బెయిల్ పై విచారించిన ప్రత్యేక కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునేద్ అహ్మద్ మోలానా ఇరుపక్షాల వాదనలు విన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి శాసనమండలి సమావేశాలు జరుగుతున్నందున సమావేశానికి హాజరయ్యేందుకు తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ పై వాదనలు జరిగాయి. ఈ బెయిల్ పై విచారించిన న్యాయం మూర్తి ఈనెల 17వ తేదీన తీర్పు ఇవ్వనున్నారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ళ సుబ్బారావు తెలిపారు. హత్య కేసులో సాక్షులను ప్రభావితం చేశారనే కేసులో ముగ్గుర సాక్షులను న్యాయమూర్తి విచారించారు. అనంత బాబుకు బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉన్నందున బెయిల్ మంజూరు చేయవద్దని కోర్టులో తమ వాదనలు వినిపించామని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు.

# వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం

## 'డయల్ యువర్ సిఎండి'కు విశేష స్పందన

### ఆరు నెలల్లో 1,087 ఫిర్యాదులు.. 1,046 పరిష్కారం

### ఫిర్యాదుల ఆధారంగా రూ.7.47 కోట్ల విలువైన 305 పనులు: సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి



**విశాఖపట్నం, ఆగస్టు 13 ప్రభాతవార్త:** వినియోగదారుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ఎపిఇపిడిసిఎల్ ప్రారంభించిన 'డయల్ యువర్ ఎపిఇపిడిసిఎల్ సిఎండి' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని సంస్థ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. "సమస్యలు విని, స్పందించి, పరిష్కరించాలి" అనే విధానానికి అనుగుణంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు పాడేరు, తూర్పు గోదావరి, కాకినాడ, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వినియోగదారుల సమస్యలను కేవలం స్వీకరించడమే కాకుండా, వాటి పరిష్కారం జరిగే వరకు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ సమర్థవంతమైన సేవలను అందించడమే ఎపిఇపిడిసిఎల్ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎపిఇపిడిసిఎల్ ప్రతి వినియోగదారుడి ఫిర్యాదుపై సత్వర స్పందన, నిర్ణీత గడువులో పరిష్కారం అందించేందుకు కట్టుబడి ఉందని సిఎండి తెలిపారు. వోల్టేజ్, విద్యుత్ సరఫరా, కొత్త సర్వీసు కనెక్షన్లు, విద్యుత్ స్తంభాలు, లైన్లు, డిటిఆర్‌లకు సంబంధించిన సమస్యలు, పాలసీ స్థాయిలో జోక్యం లేదా మౌలిక సదుపాయాల సహకారం అవసరమయ్యే అంశాలను సాధారణంగా 15 రోజుల్లోపు పరిష్కరిస్తున్నామని తెలిపారు. మీటరింగ్, బిల్లింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులను సగటున 2-3 రోజుల్లో, ప్రమాద ఘటనలు, ఉద్యోగులు, వినియోగదారులకు సంబంధించిన వైద్య క్లెయిమ్‌లతో సహా పరిహారానికి సంబంధించిన అంశాలను సాధారణంగా 7-15 రోజుల్లో పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఇతర వివిధ రకాల ఫిర్యాదులను కూడా ప్రాధాన్యతతో స్వీకరించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తున్నామని తెలిపారు.

**1912తో పాటు సిఎండికి నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం:** వినియోగదారుల రోజువారీ సమస్యల పరిష్కారానికి 1912 వినియోగదారుల కాల్ సెంటర్ 24 గంటలూ ప్రత్యేక వ్యవస్థగా పనిచేస్తోందని సిఎండి తెలిపారు. దీనికి అదనంగా 'డయల్ యువర్ ఎపిఇపిడిసిఎల్ సిఎండి' కార్యక్రమం ద్వారా 86884 00499 నంబర్‌కు ఫోన్ చేసి వినియోగదారులు తమ సమస్యలను సంస్థ అత్యున్నత స్థాయికి నేరుగా తెలియజేసే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. 1912 వ్యవస్థతో పాటు సిఎండి స్థాయిలో నేరుగా సమస్యలను తెలుసుకునే ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారుల సమస్యలపై సంస్థ మరింత బాధ్యతాయుతంగా, వేగంగా స్పందించేందుకు వీలవుతోందని తెలిపారు.

2026 ఫిబ్రవరి 9న ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా గత ఆరు నెలల్లో 1,087 ఫిర్యాదులు అందగా, వాటిలో 1,046 ఫిర్యాదులను పరిష్కరించినట్లు సిఎండి వెల్లడించారు. మిగిలిన ఫిర్యాదులను కూడా త్వరితగతిన

# ఢిల్లీ స్కూళ్లలో ఇకపై ఇండ్లీ సాంబార్ వడ్డన

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** విద్యార్థులకు ఢిల్లీ ప్రభుత్వం పోషకవిలువలున్న ఉపాహారం అందిస్తోంది. పీఎం పోషణ్ అభియాన్ మెనూలో భాగంగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో ఇడ్లీసాంబార్ వడ్డించనున్నారు. ఆగస్టు 24 నాటికి ఇడ్లీసాంబార్‌ను తప్పనిసరిగా అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఏజెన్సీలను ప్రభుత్వం ఆదేశించింది. పీఎం పోషణ్ సవరించిన మెనూ ప్రకారం రాగి హల్వా స్థానంలో గోధుమ పిండి, శనగ మసాలా, అలాగే వెజిటబుల్ దలియా స్థానంలో జొన్నలు, సజ్జలను చేర్చారు. దీనితో పాటు రాబోయే రెండు వారాల్లో విద్యార్థులకు ఇడ్లీసాంబార్‌ను అందించనున్నారు. ఆగస్టు 24 నాటికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని విద్యా శాఖ పాఠశాలలను, అమలు చేసే ఏజెన్సీలను ఆదేశించింది. సవరించిన మెనూలోని చాలా అంశాలు తక్షణమే అమల్లోకి వస్తున్నప్పటికీ, ఇడ్లీసాంబార్ అమలును వెంటనే చేపట్టాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తెలిపింది. ఇడ్లీ తయారీకి ప్రత్యేక పరికరాలు, పదార్థాలు, రవాణా సదుపాయాలు, శిక్షణ పొందిన సిబ్బంది తదితర అవసరాల రీత్యా దీని అమలుకు రెండు వారాల గడువు ఇచ్చారు. అయితే వారంలో ఆరు రోజులు మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# ముందు మీరు భారత్‌కు రండి..తర్వాత పిటిషన్ విచారిస్తాం

## విజయ్ మాల్యాకు బాంబే హైకోర్టు చురకలు

**ముంబయి, ఆగస్టు 13:** పరారీలో ఉన్న ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా దాఖలు చేసిన పిటిషన్లపై బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తాను భారత్‌కు ఎప్పుడు తిరిగి వస్తారో స్పష్టం చేస్తూ అఫిడవిట్ దాఖలు చేస్తే తప్ప పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టం చట్టబద్ధతను సవాలు చేస్తూ ఆయన వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టబోమని ధర్మాసనం తెగేసి చెప్పింది. దేశం దాటి విదేశాల్లో తలదాచుకుంటూ, భారతీయ న్యాయస్థానాల పరిధికి లొంగకుండా క్రిమినల్ బాధ్యతల నుంచి తప్పించుకోలేరని కోర్టు వ్యాఖ్యానించింది. విజయ్ మాల్యా వేసిన రెండు వేర్వేరు పిటిషన్లను ఒకేసారి విచారించలేమని, విదేశాల్లో ఉంటూ రాజ్యాంగబద్ధతను సవాలు చేసే పిటిషన్‌ను కొనసాగించలేరని ధర్మాసనం స్పష్టం చేసింది. భారత్‌కు తిరిగి వస్తే సమస్యకు పరిష్కారం చూపుతామని సూచిస్తూ, ఆయన ఎప్పుడు తిరిగి వస్తారో సమయపాలనతో కూడిన వివరణ ఇవ్వాలని ఆదేశించింది. మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరఫున వాదనలు వినిపించిన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పరారీలో ఉన్న నేరస్థులు విచారణకు సహకరించకుండా కోర్టులను ఆశ్రయించకుండా పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టం చట్టంలోని సెక్షన్ 14 అడ్డుకుంటుందని తెలిపారు. బ్రిటన్‌లో మాల్యా అప్పగింత ప్రక్రియ ఆఖరి దశకు చేరుకుందని, ఇలాంటి పిటిషన్లతో ఆ ప్రక్రియకు ఆటంకం కలగకూడదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో, పిటిషన్ వెనక్కి తీసుకుంటారా లేదా భారత్‌కు తిరిగొచ్చే తేదీని ఖరారు చేస్తారా అని ప్రశ్నిస్తూ హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

# హాఫీజ్ సయీద్‌కు గులాంను : పాక్ మాజీ మంత్రి

**ఇస్లామాబాద్, ఆగస్టు 13:** పాకిస్థాన్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతున్నాయి. ముంబయి ఉగ్రదాడుల సూత్రధారి, లష్కరే తోయిబా (ఎల్ఈటీ) వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు తాను గులాంను అని ఆయన బహిరంగంగా ప్రకటించారు. లష్కరే తోయిబా కీలక నేతలతో వేదికను పంచుకుంటూనే, భారత్‌ను ఉద్దేశించి ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒక బహిరంగ సభలో ప్రసంగించిన షేక్ రషీద్, "నేను హాఫీజ్ సాహెబ్‌కు బానిసను" అని వ్యాఖ్యానించారు. తన మొబైల్ ఫోన్‌లో హాఫీజ్ సయీద్ ఫోన్ నంబర్ ఉన్నందునే అమెరికా తనపై నిషేధం విధించిందని ఆయన పేర్కొన్నారు. లష్కరే తోయిబా సీనియర్ కమాండర్ ఖలీద్ మసూద్ సంధు, సలహా కమిటీ సభ్యుడు కారీ మహ్మద్ యాకూబ్ షేక్‌లతో కలిసి ఆయన వేదికపై కనిపించడం గమనార్హం. ఇదే సభలో భారత్‌ను ఉద్దేశించి రషీద్ విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. భారత్ గనుక పాకిస్థాన్ వైపు కన్నెత్తి చూస్తే సర్వనాశనమవుతుంది. ఆ తర్వాత భారత్‌లో ఏ పక్షీ కూయదు, ఏ గుడిలోనూ గంట మోగదంటూ రెచ్చగొట్టేలా హెచ్చరించారు. పాకిస్థాన్‌తో పాటు హాఫీజ్ సయీద్‌కు తాను పూర్తి మద్దతు ఇస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.

# లడక్‌లో భూప్రకంపనలు.. రిక్టర్‌స్కేలుపై 5.5గా నమోదు

**లేహ్, ఆగస్టు 13:** లడఖ్ లోని లేహ్ ప్రాంతంలో గురువారం ఉదయం భూప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.5గా నమోదైనట్లు జాతీయ భూకంప విజ్ఞాన కేంద్రం వెల్లడించింది. ఈ భూకంపం కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని అధికారులు ధ్రువీకరించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఈరోజు ఉదయం సుమారు 6 గంటల సమయంలో లేహ్‌లో భూమి కంపించింది. భూ ఉపరితలానికి దాదాపు 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం కేంద్రీకృతమై ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

# తల్లి,సోదరుడిని హత్యచేసిన భారతీయుడి అరెస్టు

**మాసాచుసెట్స్,ఆగస్టు 13:** అమెరికాలో 17 ఏళ్ల భారతీయ సంతతి వ్యక్తి తన తల్లి, సోదరుడిని హత్య చేశాడు. మసాచుసెట్స్ శివారుప్రాంతంలో జరిగిన ఈ కేసులో నిందితుడిని అర్జున్ అరవింద్‌గా గుర్తించారు. అతనిపై పలు నేరాభియోగాలు నమోదు చేశారు. 14 ఏళ్ల సోదరుడు సిద్దార్థ అరవింద్, 45 ఏళ్ల సుధా వెంకటేశన్ హత్యకు గురయ్యారు. ఇంట్లోని ఇద్దర్నీ చంపేసి అర్జున్ తన తల్లి కారుతో పరారీ అయ్యాడు. ఏ ఆయుధంతో అతను తన ఫ్యామిలీని చంపేశాడన్న విషయాన్ని ఇంకా మెడికల్ ఆఫీసర్లు ధ్రువీకరించలేదు. ఆక్టాన్‌లో ఉన్న మార్హా లేన్ ఇంటిలో ఈ మర్డర్ జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. బోస్టన్‌కు సుమారు 48 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉన్నది. ఈనెల 11వ తేదీన ఆక్టన్ పోలీసులకు అర్జున్ తండ్రి నుంచి ఫోన్ వెళ్లింది. ఇంట్లో ఉన్న కుటుంబీకులు రెస్పాండ్ కావడం లేదని అతను ఫిర్యాదు చేశాడు. వారి ఇంటికి ఓ ట్యూటర్ వెళ్లగా, ఇంట్లో ఎవరూ కాంటాక్టు కాలేదు. దీంతో ఆ ట్యూటర్ అర్జున్ తండ్రికి ఫోన్ చేశాడు. అయితే నిందితుడి తండ్రి ఇంటికి ఫోన్ చేసే ప్రయత్నం చేశాడు. కానీ ఫోన్‌కు స్పందించకపోవడంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సిద్దార్ధ్ అనే వ్యక్తి ఫస్ట్ ఫ్లోర్‌లో, సుధా అనే వ్యక్తి బేస్మెంట్‌లో శవాలై కనిపించారు. హత్యకు పాల్పడిన అర్జున్ తన తల్లి కారుతో పరారీ అయినట్లు గుర్తించారు. వేలాండ్‌లోని ఓ పార్కింగ్ ప్రదేశంలో అర్జున్ కారులో ఉన్నట్లు పోలీసులు పసికట్టారు. అతన్ని కస్టడీలోకితీసుకున్నారు. ఇటీవల అర్జున్ ప్రవర్తన సరిగా లేదని గుర్తించారు. ఇంటర్నెట్, చాట్‌జీపీటీలో ఫ్యామిలీహత్యకు చెందినఅంశాలను అతను సెర్చ్ చేసినట్లు తెలిసింది.

## ఎన్‌హెచ్‌ఏఐ కొత్త నిబంధనలు..

# 10 నిమిషాల్లో చేరుకోకపోతే అంబులెన్స్‌కు రూ.10 వేల జరిమానా

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు సత్వర వైద్య సహాయం అందేలా జాతీయ రహదారులశాఖ అంబులెన్స్‌లు, క్రేన్లు, పెట్రోలింగ్ వాహనాల పనితీరుపై నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ప్రమాద సమాచారం అందిన 10 నిమిషాల్లో ఘటనాస్థలికి చేరుకోని అంబులెన్స్‌కు రూ.10వేలు జరిమానా విధించనున్నారు. అలాగే ప్రమాద బాధితుడిని అత్యంత కీలకమైన గోల్డెన్ అవర్‌లోగా ఆసుపత్రికి తరలించడంలో విఫలమైనా అదే మొత్తంలో జరిమానా ఉంటుంది. ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలోని దాదాపు 50వేల కిలోమీటర్ల జాతీయ రహదారులపై సుమారు 3,000 అంబులెన్స్‌లు, 1,000 చొప్పున పెట్రోలింగ్ వాహనాలు, క్రేన్లు పనిచేస్తున్నాయి. ఈ వాహనాలన్నింటికీ జీపీఎస్‌తో పాటు ఎన్‌హెచ్‌ఏఐకేర్ యాప్‌ను నిర్వహించే ప్రత్యేక మొబైల్ పరికరాలను అమర్చారు. ప్రమాద ప్రాంతానికి సంబంధించిన సమాచారాన్ని ఈ యాప్ ద్వారా స్పందించే వాహనాలకు చేరవేయడంతో పాటు, అత్యవసర సమయంలో చేపట్టిన చర్యలు, ఇతర వివరాలను కూడా నమోదు చేస్తారు.

# 600 మంది నిరసనకారులపై రాంచి పోలీసుల ఎఫ్ఐఆర్

## 100 మందిపేర్లతోపాటు 500 మంది అజ్ఞాత అభ్యర్థులని నమోదు

రాంచి, ఆగస్టు 13: జార్ఖండ్ రాజధాని రాంచీలో ఉద్యోగార్థుల నిరసనలు, విద్యార్థుల ఆగ్రహ జ్వాలలు మరింత ఉధృతంఅవుతున్నాయి. రిక్రూట్‌మెంట్ పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ జెపిఎస్‌సిజెపిఎస్ ది రిఫార్మ్ మంచ్ ఆధ్వర్యంలో రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో చేపట్టిన నిరసన ప్రదర్శన గురువారానికి ఏకంగా 20వ రోజుకు చేరుకుంది. తమ డిమాండ్లు తీరేవరకు పోరాటాన్ని విరమించేదే లేదని స్పష్టం చేయడంతో అక్కడి వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలోనే గురువారం అసెంబ్లీ దిగ్బంధనానికి యత్నించిన ప్రదర్శనకారులు, మార్చ్ నిర్వహిస్తున్న విద్యా ర్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు, వాటర్ కెనన్లు, భాష్పవాయు గోళాలను ప్రయోగించి విచక్షణారహితంగా చెదరగొట్టారు. శాంతిభద్రతల ఉల్లంఘన పేరుతో ఏకంగా 600 మంది నిరసనకారులపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీరిలో 100 మంది పేర్లను నేరుగా చేర్చగా, మరో 500 మంది అజ్ఞాత విద్యార్థులు, ఇతర నిరసనకారులను నిందితులుగా చేర్చడం సంచలనం సృష్టిస్తోంది. ఈ పోలీస్ చర్యలతో జార్ఖండ్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. విద్యార్థులపై దౌర్జన్యాన్ని నిరసిస్తూ బీజేపీ రాష్ట్రవ్యాప్త బంద్ పాటించడమే కాకుండా, సీఎం హేమంత్ సోరెన్ ప్రభుత్వం ఉద్యమాన్ని తొక్కేసేందుకు ప్రయత్నిస్తోందని తీవ్ర స్థాయిలో మండిపడింది. రిక్రూట్‌మెంట్ కుంభకోణంపై వారం రోజుల్లోగా సీబీఐ విచారణకు ఆదేశించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని మాజీ ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ ప్రభుత్వం తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. 2024 ఎక్సైజ్ కానిస్టేబుల్ శారీరక పరీక్షల సమయంలో ప్రాణాలు కోల్పోయిన 19 మంది అభ్యర్థుల కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు ఈ వ్యవహారంలో ప్రభుత్వం వేసిన ఎస్ఐటీ కమిటీలో పదే పదే సభ్యులను మారుస్తుండటంతో దాని విశ్వసనీయతపై ఏబీవీపీ తీవ్ర సందేహాలు వ్యక్తం చేస్తూ, దేశవ్యాప్తంగా 1,200కి పైగా విశ్వవిద్యాలయాల్లో ఆందోళనలు చేపడతామని ప్రకటించింది.

# ఓటరు నమోదుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలి

**విజయవాడ, ఆగస్టు 13, ప్రభాతవార్త :** అర్హులైన యువతకు ఓటుహక్కు కల్పించేందుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయం నుండి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్‌లతో పోలింగ్ కేంద్రాలు, ఓటరు నమోదు, ఫారం-6,7,8లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా యాదవ్ మాట్లాడుతూ 18ఏళ్ళు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకునేందుకు కళాశాలలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, వికలాంగులు, కొండప్రాంతాల ప్రజలను దూరప్రాంతంలో ఉన్న కార్యాలయాలకు పిలిపించకుండా ఈఆర్వో, ఏఈఆర్వో స్థాయిలో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఓటర్లపేర్లు, తల్లిదండ్రుల పేర్లలో అక్షరదోషాల సవరణకు ఈసీఐ నిబంధనలు, సు ప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణ నిర్వహించాలని సూచించారు. ఈసిఐ నెట్ యూజర్‌నేమ్, పాస్‌వర్డ్, ఓటిపిల భద్రతపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని యాదవ్ అధికారులను ఆదేశించారు.

# విజయవాడలో నేడు కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్

**విజయవాడ, ఆగస్టు 13, ప్రభాతవార్త :** రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అగస్టు 14వతేదీ శుక్రవారం విజయవాడలో కంపెనీ స్పెసిఫక్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి నైపుణ్య అధికారి సి.మధుభూషణరావు, జిల్లానైపుణ్యాధికారి ఎస్.శ్రీనివాసరావులు తెలిపారు. విజయవాడ గాయత్రీ నగర్‌లోని ఆధ్యాస్టోర్, పాత ఎస్‌బీఐ బ్రాంచ్, జుడియో స్పోర్ట్స్ ఎదురుగా ఉదయం 9గంటల నుండి డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 18సంవత్సరాల నుండి 29 సంవత్సరాల లోపు వయస్సు గల యువతీయువకులు ఈడ్రైవ్‌కు హాజరుకావాలని కోరారు. అభ్యర్దులకు కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని, అసక్తికల అభ్యర్దులు హాజరుకావాలని సూచించారు.

# హర్‌ఘర్ తిరంగా ర్యాలీకి విశేషస్పందన

**విజయవాడ, ఆగస్టు 13, ప్రభాతవార్త :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విజయవాడలో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీకి ప్రజల నుండి విశేషస్పందన లభించింది. విజయవాడ బందరురోడ్‌లోని కలెక్టరేట్ వద్ద జిల్లాకలెక్టర్ లక్ష్మీశా ర్యాలీని ప్రారంభించగా, ఇక్కడి నుండి ప్రారంభమైన ర్యాలీ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వరకు సాగింది, ఈ ర్యాలీలో జాతీయజెండాలు చేతపట్టిన విద్యార్థినీవిద్యార్థులు, యువత, క్రీడాకారులు, అధికారులు, పోలీస్‌లు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# నేటి నుంచి త్రయాహ్నిక వరుణ యాగాలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 13, ప్రభాతవార్త :** సమృద్ధిగా వర్షాలు కురిసి సకల లోకకల్యాణార్థం ఇంద్రకీలాద్రిపై ఆగస్టు 14 నుండి 16 వరకు త్రయాహ్నిక "వరుణ యాగములు, వరుణ జపములు నిర్వహిస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ ఉత్తర్వుల ప్రకారం దుర్గాఘాట్ మరియు పాత యాగశాల వేదికలుగా 3 రోజుల పాటు విశేష హోమాలు, జపాలు, ఘటాభిషేకాలను రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను నివారించి, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, నదులు, చెరువులు, జలాశయాలు నిండి రైతాంగం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో ప్రత్యేక వైదిక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మొదటి రోజు ది.14.08.2026 (శుక్రవారం) ఉదయం 06:15 నుండి 08:30 వరకు (దుర్గాఘాట్ వద్ద) విఘ్నేశ్వర పూజ, వరుణ అనువాక సహిత కారక పారాయణలు, ఉదయం 09:00 నుండి (పాత యాగశాల వద్ద) విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, మండపారాధన, ప్రధాన దేవతలు, వరుణ, ఋష్య శృంగ, నవగ్రహ, అష్ట దిక్పాలకులకు పురుష సూక్త విధానాన పూర్వక పూజలు, సాయంత్రం 04:00 నుండి 06:00 వరకు గణపతి, ఇంద్ర, వరుణ, ఋష్య శృంగ, మండప దేవతా ఆవాహనలు మరియు మండప పూజ, రెండవ రోజు 15వ తేదీన శనివారం ఉదయం 6:30 నుండి 8:30 వరకు దుర్గాఘాట్ వద్ద వరుణ అనువాక కార్యక్రమము, మండప పూజ, ఉదయం 9గంటల నుండి 11 వరకు పాత యాగశాల వద్ద రుద్రహోమం, సాయంత్రం వివిధ హోమములు, మండప దేవతా హోమములు, విశేష పూజలు, మూడవ రోజు 16వ తేదీన ఆదివారం ఉదయం 6:30 గంటలకు దుర్గాఘాట్ నుండి పవిత్ర కృష్ణానదీ జల గ్రహణము, ఉదయం 7 గంటలకు శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో మహాన్యాస పారాయణము. ఉదయం 7:30 గంటలకు శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో "ఘటాభిషేకం" ప్రారంభం, శత అనువాహక, కారక పారాయణాలు, మండప దేవతా హోమములు, జయాదులు, ఉదయం 10:30 గంటలకు పాత యాగశాల వద్ద "మహా పూర్ణాహుతి" తో ఉత్సవ సమాప్తి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సకాల వర్షాలు, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ దేవాదాయ శాఖ నుండి ఈ కార్యక్రమం చేపడుతున్నామని ఈవో వివరించారు.

**ఇంద్రకీలాద్రిపై కొత్త భద్రతా సంస్కరణలు**

ఇంద్రకీలాద్రికి విచ్చేసే భక్తుల భద్రతను మరింత మెరుగుపరచడానికి, అలాగే సులభతర దర్శనం కల్పించేందుకు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో సీనా నాయక్ గారు పలు కీలక పరిపాలన మరియు భద్రతా సంస్కరణలను ప్రకటించారు. స్కానింగ్ పాయింట్ వద్ద కొత్త గేట్ మరియు మొబైల్ ఫోన్ల నిషేధంకొత్త స్కానింగ్ పాయింట్, భక్తులను తనిఖీ చేయడానికి ప్రధాన స్కానింగ్ పాయింట్ వద్ద సరికొత్త భద్రతా గేటును ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలోకి మొబైల్ ఫోన్లను తీసుకురావడాన్ని పూర్తిగా నిషేధించారు. కొత్త సెక్యూరిటీ చెక్ పాయింట్ వద్ద హోంగార్డులు మరియు అజైల్ సెక్యూరిటీ సిబ్బంది భద్రతను మరింత కఠినతరం చేయాలని ఈవో ఆదేశించారు. భక్తులందరూ క్యూ లైన్లలోకి ప్రవేశించే ముందే తమ మొబైల్ ఫోన్లను ఆలయం కేటాయించిన కౌంటర్లలో తప్పనిసరిగా డిపాజిట్ చేయాలన్నారు.